ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

గురువారం 27.11.2025 | సంపుటి :12 సంచిక : 127 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్






## పంచాయతీ ఎన్నికల్లో జీవోకు విరుద్ధంగా రిజర్వేషన్లు

- హైకోర్టులో పలు పిటిషన్లు..
- విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్(జనంసాక్షి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జీవోకు విరుద్ధంగా రిజర్వేషన్లు కేటాయిస్తున్నారంటూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వేర్వేరుగా దాఖలైన 9 పిటిషన్లపై జస్టిస్ టి.మాధవి దేవి విచారణ చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లు 17 శాతానికి మించడంలేదని సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం రామసానిపల్లికి చెందిన మాజీ సర్పంచి ఆగమయ్య పిటిషన్ దాఖలు చేశారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 613 గ్రామ పంచాయతీలుండగా.. 117 సర్పించి స్థానాలను మాత్రమే బీసీలకు కేటాయించారని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు

మిగతా 2లో..

# హైదరాబాద్‌లో విమాన ఇంజన్ల మరమ్మతుల కేంద్రం

- శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో పార్క్‌లో సాఫ్రాన్ ఎయిరోస్పేస్ ఫెసిలిటీ సెంటర్
- ఆన్‌లైన్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ
- హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు

**దేశంలోనే తొలి అంతర్జాతీయ లీప్‌ఇంజిన్ ఎంఆర్వో సెంటర్**




- డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేయండి
- ఎరోస్పేస్, ఏవియేషన్ హబ్‌గా హైదరాబాద్ ఎదుగుతోంది
- యువతను తీర్చిదిద్దడానికి నైపుణ్యశిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశాం
- సాఫ్రాన్ సంస్థకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌లో విమానయాన రంగానికి సంబంధించి మరో కీలక ముందడుగు పడింది. శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో పార్క్‌లో ఫ్రెంచ్ దిగ్గజ సంస్థకు చెందిన సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా ఫెసిలిటీని ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. భారత ఏవియేషన్ రంగంలో ఇదో కీలక మలుపన్న మోదీ, సాఫ్రాన్

మిగతా 2లో..



"భారత్ విమానయాన రంగం వేగంగా విస్తరిస్తున్నందున మెయింటనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ రంగం- ఎమ్ఆర్ఓ అవసరం కూడా పెరుగుతోంది. మన దేశం 85 % ఎమ్ఆర్ఓ పని దేశం వెలుపలే జరుగుతోంది. దీని వల్ల ఖర్చు, సమయం పడుతోంది. విమానం చాలా రోజులు నేలపైనే ఉంటోంది. భారత్ వంటి విశాలమైన ఏవియేషన్ రంగానికి ఈ పరిస్థితి సరికాదు. అందుకే భారత ప్రభుత్వం దేశంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఎమ్ఆర్ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. సాఫ్రాన్ సంస్థ అంతర్జాతీయ శిక్షణ, భారతీయ సంస్థలతో కలిసి దేశంలో తయారు చేసే శ్రామిక శక్తి రాబోవు సంవత్సరాల్లో ఎమ్ఆర్ఓ ఎకోసిస్టమ్‌కు కొత్త దిశను నిర్దేశిస్తుంది" - ప్రధాని మోదీ



## సంవిధాన్ సదన్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- నేతృత్వం వహించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- హాజరైన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రతిపక్ష నేతలు ఖర్గే, రాహుల్ గాంధీ
- రాజ్యాంగం అంటే ఒక పుస్తకం కాదు.. దేశ ప్రజలకు లభించిన వాగ్దానం: రాహుల్

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన తేదీకి గుర్తుగా ఏటా నవంబరు 26న 'జాతీయ రాజ్యాంగ దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా బుధవారం సంవిధాన్ సదన్ (పాత పార్లమెంటు భవనం)లోని చారిత్రక సెంట్రల్ హాల్‌లో ఈ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేతృత్వం వహించారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఉభయసభల్లో ప్రతిపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

మిగతా 2లో..



## డీజీపీ కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

12లో..

## రాజ్యాంగాన్ని సమగ్రంగా తెలుగులో అందించడం అభినందనీయం: సీఎం రేవంత్



2లో..

## అట్టహాసంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

**ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీకి ఆహ్వానం : సీఎం రేవంత్**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్రమోదీని ఆహ్వానించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. డిసెంబరు 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. ఆహ్వానితులకు ఎక్కడా లోటు లేకుండా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకునే విషయంలో ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలని సీఎం చెప్పారు. ఇప్పటి వరకు 2,600 మందిని ఆహ్వానించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. సమ్మిట్‌లో సంక్షేమం, వైద్యం, పరిశ్రమలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర విభాగాల స్టాల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. సమ్మిట్‌లో స్టాల్స్ ఏర్పాటుకు సంబంధించిన

మిగతా 2లో..




## హైదరాబాద్‌లో ఇంద్రజాల్ రేంజర్

- ప్రపంచంలోనే మొట్ట మొదటి అటానమస్ యాంటీ-డ్రోన్ గస్తీ వాహనం ప్రారంభం
- భవిష్యత్‌లో యుద్ధాలలో డ్రోన్ల పాత్ర ఆందోళనకరంగా మారబోతోంది: మాజీ లెఫ్టినెంట్ జనరల్ దేవేంద్ర ప్రతాప్ పాండే

హైదరాబాద్(జనంసాక్షి): ప్రపంచంలోనే మొట్ట మొదటి అటానమస్ యాంటీ-డ్రోన్ గస్తీ వాహనాన్ని ప్రారంభించారు. ఇంద్రజాల్ డ్రోన్ డిఫెన్స్ ఇండియా ఆధ్వర్యంలో 'ఇంద్రజాల్ రేంజర్'ను ఆవిష్కరించారు. రాయదుర్గం టీ హబ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ దేవేంద్ర ప్రతాప్ పాండే హాజరయ్యారు."భవిష్యత్‌లో దేశాల మధ్య యుద్ధాలు.. కేవలం ఆయుధాలతో మాత్రమే ఉండవు. వీటిల్లో డ్రోన్స్ పాత్ర ఆందోళనకరంగా మారింది. దేశంలోకి పాకిస్థాన్ పలుమార్లు పంపిన

మిగతా 2లో..

## రిజర్వేషన్ల పేరుతో బీసీలను మోసం చేసిన ప్రభుత్వం

**ప్రభుత్వం తీరుపై కేటీఆర్ విమర్శ**

వరంగల్ ప్రతినిధి, నవంబర్ 26 (జనంసాక్షి): రిజర్వేషన్ల పేరుతో ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ కాకతీయ మెగా టెక్స్ టైల్స్ పార్క్ జరుగుతున్న పరిశ్రమ అభివృద్ధిని పరిశీలించిన తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీసీ రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. బుధవారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని మెగా టెక్స్టైల్ పార్క్ ను పరిశీలించి కిటెక్స్ కంపెనీలో పరిశ్రమల పనితీరును సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు.బీసీలను ఆశలు పెట్టించి మోసం చేసిన పార్టీగా కాంగ్రెస్ను దుయ్యబట్టారు. కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో బీసీ రిజర్వేషన్లు 24 శాతం ఉన్నప్పటికీ, కాంగ్రెస్ 42 శాతం ఇస్తామని చెప్పి బీసీ డిక్లరేషన్ పేరిట ఓట్లు దోచుకుందని ఆరోపించారు. కానీ ఇప్పుడు కేవలం 17 శాతానికి మాత్రమే రిజర్వేషన్లు పరిమితం చేయడం బీసీలతో చేసిన తీరని ద్రోహం అని మండిపడ్డారు. చాలా మండలాల్లో ఒక్క బీసీ ప్రతినిధికి కూడా అవకాశం ఇవ్వని విధంగా రిజర్వేషన్లు ఖరారు చేశారని పేర్కొన్నారు. బీసీలతో చేసిన మోసానికి రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పంచాయతీ ఎన్నికలలో పార్టీ తరఫున రిజర్వేషన్లు ఇస్తామని చెప్పడం మరో మోసమని పేర్కొంటూ, "ఎనుముల రేవంత్ కాదు...



మిగతా 2లో..

## పవర్ ప్రాజెక్టుల్లో రూ.50 వేల కోట్ల అవకతవకలు

- మరో దందాకు తెరలేపిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎన్టీపీసీ చౌక విద్యుత్ ఎందుకు తిరస్కరించారు: హరీశ్

2లో..

## అరుణాచల్‌ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే

- చైనా మాటలు ఎన్నటికీ లెక్కచేయం
- అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించింది
- చైనా రెచ్చగొట్టే ప్రకటన మానుకోవాలి
- ఎయిర్‌పోర్టులో భారత యువతి నిర్బంధ: నిబంధనలు ఉల్లంఘించడమే..
- భవిష్యత్తులో దీనికి పరిణామాలు తప్పవు
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వెల్లడి



న్యూఢిల్లీ(జనంసాక్షి): దాదాపు 5 ఏళ్ల తరువాత భారత్, చైనా మధ్య సంబంధాలు కుదట పడుతున్నాయని భావిస్తున్న తరుణంలో మరో వివాదం మొదలైంది. అరుణాచల్ ప్రదేశ్ గురించి చైనా చేసిన రెచ్చగొట్టే ప్రకటనపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చైనాకు సమాధానమిస్తూ.. అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలో అంతర్భాగమని, విడదీయరాని భాగమని అన్నారు. చైనా చేసే ఏ ప్రకటన కూడా ఈ వాస్తవాన్ని మార్చలేదని స్పష్టం చేశారు. అరుణాచల్ ప్రదేశ్ కు చెందిన ఒక భారత పౌరుడిని ఏకపక్షంగా నిర్బంధించినందుకు సంబంధించి చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటనలు చూశాం. ఆమెకు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్ ఉంది. షాంఘై అంతర్జాతీయ విమానాశ్రయం నుండి జపాన్‌కు తన తదుపరి ప్రయాణం చేయాల్సి ఉంది. నిర్బంధం సమస్యను చైనాతో గట్టిగా లేవనెత్తాం. అంతర్జాతీయ విమాన ప్రయాణాన్ని నియంత్రించే అనేక నిబంధనలను ఉల్లంఘించిన వారి చర్యపై చైనా అధికారులు ఇంకా మాకు క్లారిటీ ఇవ్వలేదు" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.చైనా అధికారుల చర్యలు తమ దేశ నిబంధనలను కూడా ఉల్లంఘిస్తున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. అన్ని దేశాల పౌరులకు 24 గంటల వరకు వీసా రహిత ప్రయాణానికి అనుమతిస్తుంది. బ్రిటన్‌లో నివసిస్తున్న భారత పౌరురాలు పేమా వాంగ్‌జోమ్ థోంగ్‌డోక్ నవంబర్ 21న లండన్ నుండి

మిగతా 2లో..

## అరుదైన ఖనిజాల కోసం ప్రత్యేక చర్యలు

**కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం**

- దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అడుగులు
- రూ.19,919 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ఆమోదం
- రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకూ గ్రీన్ సిగ్నల్
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్



న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా కేంద్ర కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ ఒకేసారి నాలుగు ప్రధాన నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశంలో అరుదైన-భూమి అయస్కాంతాల దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం అత్యంత ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది మోదీ సర్కార్. అలాగే మహారాష్ట్ర-గుజరాత్ ప్రజలకు ప్రత్యేక బహుమతులు సహా మొత్తం రూ. 19,919 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ నిర్ణయాలను ప్రకటించారు. అరుదైన భూమి అయస్కాంతాలతో పాటు, ప్రభుత్వం రెండు కీలక రైల్వే ప్రాజెక్టులను కూడా ఆమోదించింది. ముంబై సమీపంలోని బద్లాపూర్-కర్జాత్ లైన్, గుజరాత్‌లోని ద్వారకా లైన్లకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు దేశవ్యాప్తంగా కనెక్టివిటీ గురించి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. ఈ ప్రాజెక్టులు లక్షలాది మంది ప్రయాణికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తాయి. ప్రయాణ సమయాన్ని గణనీయంగా

మిగతా 2లో..



## ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి..

**విద్యార్థుల వివరాల్లో పొరపాట్ల సవరణకు బోర్డు కొత్త మార్గదర్శకాలు**

**30 వరకు నామినల్ రోల్స్ లో తప్పులు సరిచేసుకునే అవకాశం**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఇంటర్ బోర్డు పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో, ప్రతీ సంవత్సరం పరీక్ష ఫీజు చెల్లింపు సమయంలో విద్యార్థుల


మిగతా 2లో..

## హెచ్-1బీ వీసాల్లో చైన్నైకు అక్రమ లబ్ది

- ఆ నగరం ఏకంగా 220,000 వీసాలు పొందింది
- ఇలా పరిమితికి మించి పొందడం అమెరికన్లను మోసం చేయడమే
- అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు డాక్టర్ దేవ్ బ్రాట్ సంచలన ఆరోపణలు

వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికాలో హెచ్1బీ వీసా వ్యవస్థ అదుపు తప్పిందని అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు డాక్టర్ దేవ్ బ్రాట్ సంచలన ఆరోపణలు చేశారు. భారత్‌లోని ఓ జిల్లా నుంచి పరిమితికి మించి హెచ్1బీ వీసా పొందారని అన్నారు. అమెరికా పొలిటికల్ స్ట్రాటజిస్ట్,మాజీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ స్టీవ్‌బ్యానన్ వార్ రూమ్ పాడ్‌కాస్ట్‌లో పైవిధంగా వ్యాఖ్యానించారుఅమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్1బీ వీసాలపై ఆంక్షలు కొనసాగుతున్న తరుణంలో డాక్టర్ దేవ్ బ్రాట్ పాడ్‌కాస్ట్‌లో హెచ్1బీ వీసాపై కీలక వ్యాఖ్యలు చేశారు. 71 శాతం హెచ్1బీ వీసాలు భారత్ నుంచి, 12 శాతం మాత్రమే చైనా నుండి వస్తాయి.

మిగతా 2లో..



## నగరంలో నకిలీ ఐపీఎస్

**గన్‌మెన్‌తో సహా దొరికిపోయాడు**

హైదరాబాద్(జనంసాక్షి): పోలీసు విభాగంలో ఏదైనా పని ఉంటే ఐపీఎస్, ఎన్ఐఏ అధికారి.. ఇతర ప్రభుత్వ విభాగాల్లో పనికోసం ఐఏఎస్‌గా అవతారమెత్తి ప్రజలను మోసగిస్తున్న వ్యకిని ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీగార్డ్స్‌లోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పశ్చిమ మండలం డీసీపీ శ్రీనివాస్ వివరాలు

మిగతా 2లో..

## పాక్ జైల్లో ఇమ్రాన్ ఖాన్ మృతి?

- హత్య చేశారంటూ వదంతులు
- ఆఫ్ఘన్ మీడియా సంచలన ప్రకటన
- ఆరోపణలను ఖండించిన పాకిస్తాన్
- జైలు వద్ద ఇమ్రాన్ సోదరీమనులకు అనుమతి ఇవ్వని పోలీసులు



న్యూఢిల్లీ(జనంసాక్షి): పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి, పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ పార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలులో 'రహస్యంగా' చంపేశారని అఫ్ఘాన్ మీడియా ప్రకటించింది. అయితే, పాకిస్తాన్ ప్రభుత్వం, సైనిక అధికారులు ఈ ఆరోపణలను ఖండించారు. ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నారని చెబుతోంది. ఆఫ్ఘన్ మీడియా చేసిన ప్రచారంతో రావల్పిండిలోని అడియాలా జైలు వద్ద వేలాది మంది పీటీఐ

మిగతా 9లో..

జనంసాక్షి www.janamsaksh.org
గురువారం 27.11.2025

## పంచాయతీ ఎన్నికల్లో జీవోకు విరుద్ధంగా రిజర్వేషన్లు

తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గెజిట్ 43ను జారీ చేశారని వాదించారు. దీని ప్రకారం బీసీ రిజర్వేషన్లు 19శాతం మాత్రమే ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులకు బీసీ రిజర్వేషన్లు 17శాతం మాత్రమే ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 46కు విరుద్ధంగా ఈ రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. సంగారెడ్డి కలెక్టర్ జారీ చేసిన గెజిట్‌ను రద్దు చేసి.. రిజర్వేషన్లు మళ్లీ కేటాయించాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో వెల్దండ మండలం తిమ్మనోనిపల్లి రిజర్వేషన్లపై మరో పిటిషన్ దాఖలైంది. గ్రామంలో 8 వార్డులుండగా అన్నింటినీ ఎస్సీ, ఎస్టీలకే కేటాయించారని.. బీసీ జనాభా ఓటర్లు ఎక్కువగా ఉన్నప్పటికీ అధికారులు పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు సర్పంచుల రిజర్వేషన్లు కేటాయించినట్లు స్పెషల్ జీపీ రాహుల్ రెడ్డి కోర్టుకు తెలిపారు. రోస్టర్ ప్రకారం రిజర్వేషన్లు మారుతూ వస్తాయని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. 2011 జనాభా గణనలో తప్పులున్నట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తున్నారని.. దీనికి కేంద్రమే సమాధానం చెప్పాల్సి ఉందని రాహుల్ రెడ్డి వాదించారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

బీసీలు ఎక్కువగా ఉన్నచోట ఎస్సీ,ఎస్టీలకు ఎలా కేటాయిస్తారు?

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లను సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు. రిజర్వేషన్లను సవాలు చేస్తూ పలువురు గ్రామస్థులు పిటిషన్లు వేశారు. బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించలేదని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా వెల్దండ తిమ్మనోనిపల్లి వార్డుల రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. తిమ్మనోనిపల్లిలోని వార్డులన్నింటిని ఎస్సీ, ఎస్టీలకే కేటాయించారన్న పిటిషనర్లు తిమ్మనోనిపల్లిలో ఎస్సీ, ఎస్టీల కంటే బీసీలు అధికంగా ఉన్నారని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలోని గ్రామాల్లో రిజర్వేషన్లను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. సంగారెడ్డి జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు సరిగా పాటించలేదంటూ పిటిషన్ వేశారు. బీసీ రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లపై విచారణను రేపటికి వాయిదా వేశారు.

## అరుదైన ఖనిజాల కోసం ప్రత్యేక చర్యలు

తగ్గిస్తాయి. అత్యధిక బడ్జెట్ కలిగిన పూణే మెట్రోకు కేంద్రం రూ. 9,858 కోట్ల గ్రాంట్‌ను అందించనున్నారు. 32 కిలోమీటర్ల కొత్త లైన్ వేయడానికి వీలు కల్పించింది కేంద్రం. ఈ మార్గం ఖరడి నుండి ఖడక్వాస్లా వరకు, నల్ స్టాప్ నుండి మాణిక్ బాగ్ వరకు నడుస్తుంది. ఇది పూణే మెట్రో నెట్‌వర్క్‌ను 100 కిలోమీటర్లకు పైగా విస్తరిస్తుంది. ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బంది పడుతున్న పూణే నివాసితులకు ఇది ఒక పెద్ద ఉపశమనం. భవిష్యత్ సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం అరుదైన భూమి శాశ్వత మాగ్నెట్ (%=జ్రూవీ%) పథకాన్ని ఆమోదించింది. దీని కోసం రూ. 7,280 కోట్ల బడ్జెట్ కేటాయించింది. భారతదేశంలో హైటెక్ మాగ్నెట్లను తయారు చేయడమే దీని లక్ష్యం. ఈ మాగ్నెట్లను ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ ఫోన్లలో ఉపయోగిస్తారు. ఈ కొత్త ప్రణాళిక భారతదేశంలో అరుదైన-భూమి అయస్కాంతాల ఉత్పత్తికి పూర్తి దేశీయ పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తుంది. ప్రస్తుతం, ఈ రంగంలో మనం ఇతర దేశాలపై ఆధారపడుతున్నాము. ఈ నిర్ణయం భారతదేశాన్ని స్వావలంబన చేస్తుంది. గుజరాత్ యాత్రికులకు కూడా కేంద్రం శుభవార్త తెలిపింది. ఓఖా నుండి కనాలస్ రైల్వే లైన్‌ను డబుల్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ. 1,457 కోట్లు ఖర్చవుతుంది. 159 కిలోమీటర్ల పొడవైన ఈ లైన్ దేవభూమి ద్వారకకు ప్రయాణించే రైళ్ల సంఖ్యను పెంచుతుంది. ఈ లైన్‌ను రెట్టింపు చేయడం వల్ల సరుకు రవాణా రైళ్లు వేగంగా నడపడానికి వీలు కలుగుతుంది. ఇది ఈ ప్రాంత అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఈ నాలుగు నిర్ణయాల కోసం ప్రభుత్వం మొత్తం రూ. 19,919 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇది ఒకే రోజులో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయం. ఇది రైల్వే, మెట్రో ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకుంది కేంద్రం. రేర్ ఎర్త్ పథకం దేశ సాంకేతికతకు కొత్త దిశానిర్దేశం చేస్తుంది. ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తవుతాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

## పవర్ ప్రాజెక్టుల్లో రూ.50 వేల కోట్ల అవకతవకలు

**హైదరాబాద్(జనంసాక్షి):** హరీష్ రావు మళ్ళీ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఘాటు విమర్శలు చేశారు. ఇప్పటికే ల్యాండ్ స్కాం బయట పెట్టిన తమ పార్టీ, ఇప్పుడు రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుగుతున్న పవర్ స్కాంను వెలుగులోకి తీసుకురానున్నట్లు ఆయన ప్రకటించారు. అక్షరాల రూ.50 వేల కోట్ల భారీ మోసం జరుగుతోందని, దీనిలో 40 శాతం కమీషన్ తీసుకుంటున్నారని హరీష్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో విధాన నిర్ణయాల కోసం నిర్వహించాల్సిన కేబినెట్ సమావేశాలు, ఇప్పుడు పంపకాల కోసం మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశాలు వరుసగా భూ స్కాం, పవర్ స్కాం కోసం జరిగాయని ఆయన విమర్శించారు. తమ పార్టీ ఇప్పటికే రూ.5 లక్షల కోట్ల ల్యాండ్ స్కాం ను బయట పెట్టినా, ప్రభుత్వం దానిపై ఒక్క సమాధానం కూడా చెప్పలేదని హరీష్ రావు మండిపడ్డారు. రామగుండం, పాల్వంచ, మక్తల్ పవర్ ప్లాంట్లలో రూ.50 వేల కోట్ల భారీ అవకతవకలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. "రేవంత్ ప్రభుత్వం చేసే ప్రతి పనిలో ఒక మిషన్ ఉంటుంది.. ఆ మిషనే కమిషన్" అని వ్యాఖ్యానిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలలో ప్రజల ప్రయోజనం కంటే స్వప్రయోజనాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అరాచకం రాజ్యమేలుతుందని కేసీఆర్ గతంలో చెప్పిన విషయం ఇప్పుడు నిజమవుతోందని హరీష్ వ్యాఖ్యానించారు. వాటాల విషయంలో తలెత్తిన అంతర్గత తగాదాల వల్ల మంత్రులే రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తే వెంటనే డర్టీ పాలిటిక్స్‌కు తెర తీస్తున్నారని ఆరోపించారు. ఎన్టీపీసీ తక్కువ ధరకే విద్యుత్ అందించేందుకు సిద్ధంగా లేఖ రాసినా, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఎందుకని ప్రశ్నించారు. ఎన్టీపీసీ ప్రతిపాదనను ఎందుకు తిరస్కరించారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దామరచర్లలో పవర్ ప్లాంట్ నిర్మాణంపై గతంలో తీవ్రంగా విమర్శించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. "కమీషన్ కోసమే కోమటిరెడ్డి పెదవులు మూసుకున్నారా?" అని హరీష్ వ్యంగ్యంగా ప్రశ్నించారు. పథకాల అమలుకు డబ్బుల్లేవని ప్రభుత్వం చెప్పుకుంటూనే, వేల కోట్లతో 2,400 మెగావాట్ల పవర్ ప్లాంట్లను డబుల్ కాస్ట్‌తో నిర్మించడం అంటే కమీషన్ల కోసం చేస్తున్న ప్రాజెక్టులేనని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రతి రోజు తన మాటలను మార్చుకుంటారని, 'రామ్-రెమో' లెక్క రోజుకో కొత్త కథ చెబుతున్నారని హరీష్ వ్యాఖ్యానించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

**చర్ల(జనంసాక్షి):** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు పర్వం కొనసాగుతోంది. బీజాపూర్ జిల్లాలో ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ ఎదుట బుధవారం 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిపై రూ.1.19 కోట్ల రివార్డ్ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. వీరిలో 12 మంది మహిళలు సహా 29 మంది పురుష మావోయిస్టులు ఉన్నారన్నారు. లొంగిపోయిన వారిలో కీలక పీఎల్‌జీఏ ( పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) నంబర్ వన్ బెటాలియన్, వివిధ ఏరియా కమిటీలు, ప్లాటూన్లు, కంపెనీ, మిలీషియా యూనిట్ల సభ్యులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. సౌత్ సబ్ జోనల్ బ్యూరో నుంచి 39 మంది, తెలంగాణ రాష్ట్ర కమిటీ, ధమ్తారి.. గరియా బంద్, నువపాడ డివిజన్ సభ్యులు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఇప్పటివరకు జిల్లాలో 790 మంది మావోయిస్టులు ప్రధాన జీవన స్రవంతిలో చేరారని, 1031 మందిని అరెస్టు చేశామని, వివిధ ఎన్‌కౌంటర్లలో 202 మంది మావోయిస్టులు మృతి చెందారని ఎస్పీ పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో విమాన ఇంజన్ల మరమ్మతుల కేంద్రం

సంస్థకు కేంద్రం సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నా రు. ఫ్రెంచ్ దిగ్గజ సంస్థ సాఫ్రాన్ వాణిజ్య విమా నాలకు శక్తినిచ్చే ఎం88 ఇంజిన్ల నిర్వహణ, మరమ్మత్తు, ఓవర్‌హాల్ సౌకర్యాన్ని కల్పించనుంది. ఏవియేషన్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో పేరెన్నిక గన్న సఫ్రాన్ సంస్థ దస్సాల్ట్ ఏవియేషన్‌కు చెందిన రఫెల్ ఫైటర్ జెట్‌లో వినియోగించే ఎం88 ఇంజిన్ల కోసం మరో ప్రత్యేక మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ ఫెసిలిటీని త్వరలో ఏర్పాటు చేయనుంది. ఇవాళ్టి నుంచి భారతదేశ విమానయాన రంగం కొత్త ఊపును సంతరించుకుంటుందన్న ప్రధాని సాఫ్రాన్ ఏర్పాటు చేసిన ఎమ్ఆర్ఓ కేంద్రం వల్ల భారతదేశాన్ని గ్లోబల్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ హబ్‌గా తీర్చిదిద్దడంలో తోడ్పడుతుందని పేర్కొన్నారు

సాఫ్రాన్ సంస్థకు ధన్యవాదాలు : సాఫ్రాన్ సంస్థ ఏర్పాటు హైదరాబాద్ అభివృద్ధిలో కీలక మైలురాయిగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఫ్రెంచ్ సంస్థకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. హైదరాబాద్‌ను ఎంచుకున్న సాఫ్రాన్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. సాఫ్రాన్ సంస్థ ఏర్పాటు హైదరాబాద్ అభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని, ఎరోస్పేస్, ఏవియేషన్ హబ్‌గా హైదరాబాద్ ఎదుగుతోందన్నారు. ఏవియేషన్‌కు చెందిన ఎన్నో సంస్థలు ఇప్పటికే హైదరాబాద్‌లో నెలకొన్నాయని, ఏవియేషన్, ఎరోస్పేస్‌కు చెందిన ఉన్నత నిపుణులు కూడా హైదరాబాద్ ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగళూర్ మధ్య వైమానిక, రక్షణ రంగ కారిడార్ ఏర్పాటు చేయాలని ప్రధానిని సీఎం కోరారు. ఏవియేషన్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో పేరెన్నిక గన్న సఫ్రాన్ సంస్థ డస్సాల్ట్ ఏవియేషన్‌కు చెందిన రఫెల్ ఫైటర్ జెట్‌లో వినియోగించే ఎం88 ఇంజిన్ల కోసం ప్రత్యేక మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ ఫెసిలిటీని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం జీఎంఆర్ ఏరోపార్క్‌లోనే ఏర్పాటు చేసే ప్రత్యేక ఫెసిలిటీ కేంద్రానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు భూమిపూజ చేశారు. సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా ఫెసిలిటీ 2026లో అందుబాటులోకి రానుంది. ఏటా 300 లీప్ ఇంజిన్లకు సేవలందించే ఈ ఫెసిలిటీ 2035 నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది. ఈ ఫెసిలిటీ ద్వారా వెయ్యి మందికి పైగా అత్యంత నైపుణ్యం కలిగిన భారతీయ సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లకు ఉపాధి లభించనుంది. ఈ కొత్త ఫెసిలిటీలో స్వదేశీ సామర్థ్యాలను అభివృద్ధి చేయడం వల్ల విదేశీ మారక ద్రవ్య నిల్వల వినియోగం తగ్గటం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. ఈ ఫెసిలిటీ ద్వారా భారతదేశం ప్రపంచ విమానయానానికి హబ్‌గా మారనుంది.



### అట్టహాసంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

డిజైన్లను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ప్లీనరీలో విభాగాల వారీగా వివిధ అంశాలపై మాట్లాడేందుకు వక్తలకు సంబంధించిన పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఒక్కో ఈవెంట్‌కు సీనియర్ ఐఏఎస్ అధికారికి బాధ్యత అప్పగించాలని సీఎం సూచించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా డ్రోన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన డిజైన్లన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## రాజ్యాంగాన్ని సమగ్రంగా తెలుగులో అందించడం అభినందనీయం

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ న్యాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు, ఇంగ్లీషు భాషలో ముద్రించిన భారత రాజ్యాంగం ద్విభాషా గ్రంథాన్ని ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. రాజ్యాంగాన్ని సమగ్రంగా తెలుగులో అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. కార్యక్రమంలో లా సెక్రటరీ బి.పాపి రెడ్డి, కార్యదర్శి, లా అడిషనల్ సెక్రటరీ కె.సునీత, జాయింట్ సెక్రటరీ ,(అనువాదం) కె.గీత, తదితరులు పాల్గొన్నారు

## రిజర్వేషన్ల పేరుతో బీసీలను మోసం చేసిన ప్రభుత్వం

అనకొండ రేవంత్" అని రేవంత్ రెడ్డిపై ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు కూడా కేటీఆర్ స్పందించారు. కేఎమ్‌టీపీ స్థాపన కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని తెలిపారు. ఒకప్పుడు అజంజాహీ మిల్లుల ఆధారంగా అభివృద్ధి చెందిన వరంగల్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో తన పూర్వ వైభవాన్ని కోల్పోయిందని గుర్తుచేశారు. నేతన్నలు ఉపాధి కోసం సూరత్, షోలాపూర్, భివాండి ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ పరిస్థితిని మార్చేందుకు 2017లో కేసీఆర్ శంకుస్థాపన చేసినట్లు వివారించారు. కైటెక్స్, యంగ్వన్, గణేషా వంటి ప్రముఖ కంపెనీలు పార్కులో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండటం, దాదాపు 25-30 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్న విషయం సంతోషదాయకమని అన్నారు. కైటెక్స్ అత్యాధునిక స్పిన్నింగ్, గార్మెంటింగ్ యూనిట్లను పరిశీలించినట్లు తెలిపారు. యంగ్వన్ సంస్థకు భారీ స్థాయిలో భూమి కేటాయించిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి చల్ల ధర్మారెడ్డి, తాటికొండ రాజయ్య గండ్ర వెంకట రమణారెడ్డి వివిధ కార్పొరేషన్ల మా మాజీ చైర్మన్లు మాజీ జడ్పీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 'ఇంద్రజాల్ రేంజర్'

డ్రోన్లను మన బలగాలు నిర్వీర్యం చేస్తున్నాయి. 'ఇంద్రజాల్ రేంజర్' అనే వాహనం అలాంటి అనుమానాస్పద డ్రోన్లను కూల్చుతుంది. ఇది చాలా కీలకమైన ముందడుగు. ఇంద్రజాల్ సంస్థను నేను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. దేశ భద్రత విషయంలో ఇది కీలక పరిణామం" అని ప్రతాప్ పాండే పేర్కొన్నారు. ఇంద్రజాల్ రేంజర్ ప్రారంభం కోసం 26/11 దాడి జరిగిన రోజును ఎంచుకోవడానికి కారణాన్ని ఇంద్రజాల్ డ్రోన్ డిఫెన్స్ ఇండియా సీఈవో కిరణ్ రాజు వివరించారు. 26/11 దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించేందుకే ఈ తేదీని ఎంచుకున్నట్లు చెప్పారు. "ఇక్కడ యువత డ్రగ్స్‌పై ఉపయోగించే నిధులు పాకిస్థాన్ ఉగ్ర ముఠాలకు వెళ్తున్నాయి. ఇక్కడ చేసే తప్పులు.. సరిహద్దు రాష్ట్రాల ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. భారత్‌కు ఇతర దేశాలతో భూ సరిహద్దు 15 వేల కిలోమీటర్లు ఉంది.

## ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి..

వ్యక్తిగత వివరాలు, విద్యా సంబంధిత వివరాలు తప్పుగా నమోదు కావడం ఒక పెద్ద సమస్యగా మారుతోంది. పేరు, తండ్రి పేరు, గ్రూపు, మాధ్యమం, భాషా సబ్జెక్టులు వంటి కీలక అంశాల్లో తేడాలు రావడం వల్ల పరీక్ష సమయాన విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటారు. గతంలో పరీక్ష కేంద్రాల్లోనే విద్యార్థులు ఓఎంఆర్ పత్రాల్లో తప్పులు సవరించుకునే అవకాశం ఉండేది. చాలా సందర్భాల్లో తెలుగు స్థానంలో హిందీ ముద్రించబడడం, గ్రూప్ మారడం, తల్లిదండ్రుల పేర్లు తప్పుగా రావడం వంటి సమస్యల్ని అప్పటికప్పుడు సరిచేసుకునే అవకాశం ఉండేది. అయితే ఈసారి పరీక్ష కేంద్రాల్లో అలాంటి అవకాశం ఉండదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. దీనికి బదులుగా, ఈ విద్యా సంవత్సరం నుంచి పరీక్షలకు ముందుగానే వివరాల సవరణకు అవకాశం కల్పించనుంది. ఇందుకోసం డీఐఈవోలకు మరియు కాలేజీ ప్రిన్సిపాళ్లకు బోర్డు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థికి కాలేజీ ప్రిన్సిపాళ్లు నామినల్ రోల్స్‌ను చూపించి, అందులో ఉన్న అన్ని వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా కాలేజీలకు పిలిపించి వివరాలను క్రాస్ చెక్ చేయించి సంతకాలు తీసుకోవాలని సూచించింది. ఈ ప్రక్రియ ద్వారా ఓఎంఆర్ పత్రాల్లో వచ్చే పొరపాట్లను ముందుగానే పూర్తిగా నివారించవచ్చని బోర్డు భావిస్తోంది.

## హెచ్-1బీ వీసాల్లో చైన్నైకు అక్రమ లబ్ధి

85 వేల హెచ్1బీ వీసాల పరిమితి ఉంది. అయినప్పటికీ భారత్‌లోని మద్రాస్ (చెన్నై) నుంచి 220,000 వీసాలు వచ్చాయి. అది అమెరికా ప్రభుత్వం నిర్ధేశించిన పరిమితికి 2.5 రెట్లు ఎక్కువ. కాబట్టి అదే మోసం. ఈ సందర్భంగా ఇలా పరిమితికి మించి వీసాలు పొందడం అంటే అమెరికన్లను మోసం చేయడమేనన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. బ్రాట్ ఈ సమస్యను అమెరికన్లకు ప్రత్యక్ష ముప్పుగా పరిగణించారు. చెన్నై కేంద్రంగా వీసా పొందిన వ్యక్తులు తాము నైపుణ్యం కలిగిన నిపుణులు అని చెబితే అందులో వాస్తవం ఉండదు. ఎందుకంటే?. వారు నైపుణ్యం లేనివారు. అలాంటి వారే మీ కుటుంబ ఉద్యోగం,మీ ఇల్లు ఇలా అన్నీ లాక్కుంటున్నారని హెచ్చరించారు. 2024లో చెన్నైలోని అమెరికా కాన్సులేట్ సుమారు 2.2 లక్షల హెచ్1బీ వీసాలు, అదనంగా 1.4 లక్షల హెచ్4 డిపెండెంట్ వీసాలు ప్రాసెస్ చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే దరఖాస్తులను ఈ కాన్సులేట్ పరిశీలిస్తుంది. ఈ కారణంగా ఇది ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే హెచ్1బీ వీసా కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం చెన్నై కాన్సులేట్‌లో పనిచేసిన భారతీయ మూలాలున్న అమెరికా విదేశాంగ సేవాధికారి మహ్వాష్ సిద్ధిఖీ చేసిన పాత ఆరోపణలు మళ్లీ చర్చకు వచ్చాయి. ఒక ఇంటర్వ్యూలో ఆమె హెచ్1బీ వ్యవస్థలో భారీ స్థాయిలో నకిలీ పత్రాలు, తప్పుడు అర్హతలు, ప్రాక్సీ అభ్యర్థులు ఉన్నారని పేర్కొన్నారు.

## నగరంలో నకిలీ ఐపీఎస్

వెల్లడించారు. చంపాపేటకు చెందిన బత్తిని శశికాంత్ (39) 3-డి ఏనిమేషన్ కోర్సు చేసి చిన్న కంపెనీ ఏర్పాటు చేశాడు. ఇతని స్వస్థలం ఏపీలోని ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు. ఇటీవల షేక్‌పేటలోని అపర్ణ ఔరా అపార్టుమెంట్‌కు మకాం మార్చాడు. నేర్చుకున్న ఏనిమేషన్ కోర్సును ఉపయోగించి తన పేరిట నకిలీ ఐఏఎస్, ఐపీఎస్, ఎన్ఐఏ అధికారుల గుర్తింపు కార్డులు తయారు చేశాడు. పోలీసు, ఎన్ఐఏలో ప్రత్యేక ఆపరేషన్ల కోసం తనను ప్రభుత్వం నియమించిందని నమ్మబలుకుతూ తిరుగుతుండేవాడు. తమిళనాడుకు చెందిన విశ్రాంత సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రవీణ్, విమల్‌ను గన్‌మెన్లుగా నియమించుకున్నాడు. గన్‌మెన్లతో కలిసి షేక్‌పేటలోని గోల్డ్ జిమ్‌కు వెళ్లేవాడు. కసరత్తు చేస్తున్న సమయంలో ఫోన్ రింగ్‌కాగా ప్రత్యేక ఆపరేషన్‌కు వెళుతున్నానంటూ హడావిడిగా జిమ్ నుంచి బయటికి వెళ్లేవాడు. ఈనేపథ్యంలో టీఎస్ఐఐసీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని, ఖాళీ స్థలాలు కేటాయించే విభాగానికి ప్రత్యేక ఐఏఎస్ అధికారినంటూ జిమ్ ఎండీ అలీ హసన్‌కు చెప్పాడు. పరిశ్రమ స్థాపన కోసం స్థలం కేటాయింపు జరిగిందంటూ నకిలీ అలాట్‌మెంట్ ఆర్డర్ తయారు చేసి అలీ హసన్‌కు చూపించి, రూ.10.50 లక్షల నగదు బ్యాంకు నుంచి బదిలీ చేయించుకున్నాడు. జిమ్‌కు వచ్చే మరో వ్యక్తి నుంచి రూ.10లక్షలు వసూలు చేశాడు. కేటాయింపు జరిగిందని చూపించిన స్థలం తన పేరుపై బదిలీ కాకపోవడంతో అలీ హసన్‌కు ఇతని ప్రవర్తనపై అనుమానం వచ్చి ఫిల్మ్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శశికాంత్‌ను అరెస్టు చేసి రెండు చరవాణులు, ఆరు సిమ్‌కార్డులు, రెండు వాకీటాకీలు, నకిలీ ఐఏఎస్, ఐపీఎస్, ఎన్ఐఏ అధికారుల గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఇతనికి గన్‌మెన్లుగా వ్యవహరించిన తమిళనాడుకు చెందిన విశ్రాంత సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రవీణ్, విమల్‌ను అరెస్టు చేయాల్సి ఉందని డీసీపీ శ్రీనివాస్ చెప్పారు.

## సర్వీస్ రివాల్వర్ అమ్మేసిన ఎస్ఐ!

**అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు**
**అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఘటన**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఇటీవల ఓ పోలీస్ నిందితుడ్ని వదిలిపెట్టేందుకు అతడి వద్ద నుంచి ఏకంగా రూ.2 కోట్లు తీసుకోవడం దుమారం రేపింది. తాజాగా మరో పోలీస్ అధికారి తన సర్వీస్ రివాల్వర్‌ను అమ్మేయడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. హైదరాబాద్ లోని అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఘటన రాష్ట్ర పోలీసు విభాగంలో తీవ్ర కలకలం సృష్టించింది. సర్వీస్ రివాల్వర్‌ను ఎక్కడైనా తాకట్టు పెట్టి ఉంటాడన్న కోణంలోనూ విచారణ జరుగుతోంది. పోలీస్ స్టేషన్ లాకర్‌లో భద్రపరచాల్సిన దొంగల నుంచి రికవరీ చేసిన బంగారంతో పాటు, ఎస్సైకి కేటాయించిన సర్వీస్ తుపాకీ (రివాల్వర్) కూడా కనిపించకుండా పోవడం గమనార్హం. ఈ వస్తువులు అదృశ్యం కావడం తో, ఉన్నతాధికారులు కేసు నమోదు చేయించి, వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు.

# సంవిధాన్ సదన్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

రాష్ట్రపతి ఆధ్వర్యంలో రాజ్యాంగ ప్రవేశిక సామూహిక పఠనాన్ని చేపట్టారు. తెలుగు, మలయాళం, మరాఠీ, నేపాలీ, పంజాబీ, బోడో, కశ్మీరీ, ఒడియా, అస్సామీ భాషల్లోకి అనువదించిన రాజ్యాంగ ప్రతులను విడుదల చేశారు. ఈసందర్భంగా రాష్ట్రపతి మాట్లాడారు."ఈ చరిత్రాత్మక దినోత్సవం సందర్భంగా మీ అందరి మధ్య ఉండటం నాకు సంతోషంగా ఉంది. 1949, నవంబర్ 26న రాజ్యాంగసభ సెంట్రల్ హాలులో రాజ్యాంగ సభ సభ్యులు భారత రాజ్యాంగాన్ని రూపొందించే పనిని పూర్తి చేసి ఆమోదించుకున్నారు. ముసాయిదా కమిటీ ఛైర్మన్ బీఆర్ అంబేద్కర్ మన రాజ్యాంగ వాస్తుశిల్పుల్లో ముఖ్యులు. ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేయడం ద్వారా మన సోదరీమణుల సాధికారతకు పార్లమెంట్ చర్యలు తీసుకుంది. జీఎస్టీ ద్వారా ఆర్థిక సమైక్యతను ప్రోత్సహిం చారు. ఆర్టికల్ 370తో రాజకీయ సమైక్యతకు ఉన్న ఆటంకం తొలగిపోయింది" అని స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వాలు తీసుకున్న చర్యల గురించి ప్రస్తావించారు. కాగా.. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వశాఖలు, విభాగాలు, వాటి అనుబంధ కార్యాలయాలు, రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాయి. ఈ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. రాజ్యాంగం అంటే ఒక పుస్తకం కాదని దేశ ప్రజలకు లభించిన వాగ్దానమని పేర్కొన్నారు. దీనిద్వారా ప్రాంతం, మతం, కులం, సంపదతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరికీ న్యాయం, సమానత్వం, గౌరవం లభిస్తుందని, అది పేదలు, అణగారిన వర్గాల రక్షణ కవచం అని రాసుకొచ్చారు.

# అరుణాచల్‌ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే..

జపాన్‌కు వెళుతున్నారు. ఆమె మూడు గంటల పాటు నిర్ణయించిన స్టాప్ ఒక పీడకలగా మారింది. ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆమె పాస్‌పోర్ట్‌ను అరుణాచల్ ప్రదేశ్ ఆమె జన్మస్థలం అని రాసి ఉండటం వల్ల చట్టవిరుద్ధమని ప్రకటించారని పేర్కొన్నారు. థోంగ్‌డోక్‌తో జరిగిన సంఘటన గురించి చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ మాట్లాడారు. ఆమెపై ఎలాంటి నిర్బంధ చర్యలు, నిర్బంధం లేదా వేధింపులు జరగలేదని పేర్కొన్నారు. చైనా సరిహద్దు తనిఖీ అధికారులు చట్టాలు, నిబంధనల ప్రకారం అన్ని ప్రక్రియలను పూర్తి చేశారు. సంబంధిత వ్యక్తి యొక్క చట్టపరమైన హక్కులు, ప్రయోజనాలను పూర్తిగా రక్షించారని తెలుసుకున్నాం" అన్నారు. థోంగ్‌డోక్‌తో చేసిన ప్రవర్తనపై భారతదేశం (అధికారిక దౌత్య నిరసన)పై చైనా మరోసారి రెచ్చగొట్టే ప్రకటన చేసింది. మావో నింగ్ అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా వాదనలను కూడా ప్రస్తావించారు. చైనా వారు జాంగ్‌నాన్ లేదా దక్షిణ టిబెట్ అని ఆ ప్రాంతాన్ని పిలుస్తామని చెప్పారు. "జాంగ్‌నాన్ చైనాలో భాగం. భారతదేశం ద్వారా చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసుకున్న అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా ఎప్పుడూ గుర్తించలేదు" మరోసారి చైనా కయ్యానికి కాలు దువ్వుతోంది. అయితే చైనా తీరును భారత ప్రభుత్వం తీవ్రంగా తప్పుపట్టింది.

## ట్రాఫిక్ చలాన్లపై తరచూ రాయితీలు ఇవ్వడమేంటి?

- డిస్కౌంట్లపై హైకోర్టు ఆగ్రహం
- భయాన్ని బలహీనపరుస్తున్నారు
- హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్(జనంసాక్షి):** ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం ఈ మధ్య వాహనాల రకాన్ని బట్టి.. 75 నుంచి 25 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్న విషయం తెలిసిందే. పేరుకుపోయిన పెండింగ్ చలాన్ల బకాయిలను రికవరీ చేసుకునేందుకు.. ప్రభుత్వం అప్పుడప్పుడు డిస్కౌంట్లు ఇస్తుంటుంది. ఇలా డిస్కౌంట్లు ఇవ్వడం వల్ల చట్టపరమైన పరిణామాల పట్ల ప్రజల్లో ఉన్న భయం, గౌరవం బలహీనపడతాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. ముఖ్యంగా.. రాయితీలు ట్రాఫిక్ క్రమశిక్షణారాహిత్యాన్ని మరింత పెంచుతాయని, ప్రజలు నిబంధనలను ఉల్లంఘించినా ఏదో ఒక దశలో రాయితీ లభిస్తుందనే భావన పెరిగే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది. ఈ-చలానా వ్యవస్థలో మార్పులు చేసి, ఉల్లంఘన వివరాలను స్పష్టంగా పొందుపరచాలని ఆదేశించింది. ఇంటిగ్రేటెడ్ ఈ-చలానా వ్యవస్థను సవాల్ చేస్తూ హైదరాబాద్ తార్నాకకు చెందిన వి. రాఘవేంద్రచారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. ట్రిపుల్ రైడింగ్‌కు 1988 మోటారు వాహనాల చట్టం సెక్షన్ 128 రెడ్‌విత్ 177 ప్రకారం.. రూ. 100 నుంచి రూ. 300 మాత్రమే జరిమానా విధించాలి. కానీ దీనికి విరుద్ధంగా 2019 నిబంధన ప్రకారం.. రూ. 1000 విధిస్తున్నారని.. ఇది చెల్లదని వాదించారు. 2019లో సవరణ నిబంధనలను తెలంగాణ ప్రభుత్వం అన్వయించుకోకపోవడంతో.. 1988 నిబంధనల ప్రకారమే చలానా జారీచేయాల్సి ఉందన్నారు ప్రభుత్వ న్యాయవాది మహేశ్ రాజె తమ వాదనలు వినిపించారు. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 200 కింద ట్రాఫిక్ ఉల్లంఘనలనేవి జరిమానా విధించదగ్గ నేరాలని తెలిపారు. అందుకు సంబంధించిన జరిమానాల వివరాలను వెల్లడిస్తూ ప్రభుత్వం 2007 జీవో 54 జారీ చేసిందని హైకోర్టుకు తెలిపారు. హైకోర్టు సూచనల మేరకు ప్రభుత్వం జరిమానాను పెంచుతూ 2011లో ఉత్తర్వులు జారీ చేసిందని.. ప్రస్తుత చలానా వ్యవస్థలో నిబంధనలన్నీ పొందుపర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ట్రాఫిక్ ఉల్లంఘన జరిగినప్పుడు అది ఏ చట్టంలోని ఏ సెక్షన్ కింద ఉల్లంఘనగా పరిగణించబడిందనే వివరాలను చలానా జారీ సమయంలో స్పష్టంగా పొందుపరచగలిగే వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు తీసుకున్న చర్యలు, వ్యవస్థ అభివృద్ధి ఏ దశలో ఉందో సమగ్ర నివేదికను డిసెంబర్ 9వ తేదీలోగా సమర్పించాలని హైకోర్టు హోంశాఖను ఆదేశించింది. ఈ సాంకేతిక మెరుగుదల కేంద్ర మోటారు వాహన నిబంధన 167 ప్రకారం తప్పనిసరి అని న్యాయమూర్తి గుర్తు చేశారు.

## నేనూ ఢిల్లీ కాలుష్య బాధితుడినే...

**సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుడంతో.. అక్కడ గాలి నాణ్యత బాగా క్షీణించడంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం గంటపాటు వాకింగ్‌కు వెళ్లడంతో తనకు శ్వాస సంబంధిత సమస్యలు ఎదురైనట్లు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు విచారణలను వర్చువల్ మోడ్‌కు మార్చడానికి బార్ అసోసియేషన్ అంగీకరిస్తే.. కోర్టు ఏకరీతి నియమాన్ని రూపొందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## హైదరాబాద్-చెన్నై బుల్లెట్ ట్రైన్

**ప్రాజెక్ట్‌కు త్వరలో కార్యరూపం**

**హైదరాబాద్(జనంసాక్షి):** చెన్నై- హైదరాబాద్ వాసుల బుల్లెట్ రైలు కల త్వరలో సాకారం కానుంది. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైలు మార్గం ప్రాజెక్టు తుది అలైన్‌మెంట్ నివేదికను దక్షిణ మధ్య రైల్వే తమిళనాడు ప్రభుత్వానికి సమర్పించింది. ఇది ఇంటర్ సిటీ ప్రయాణంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి చెన్నైకి రైలు ప్రయాణానికి దాదాపు 12 గంటలు పడుతోంది. కొత్త హైస్పీడ్ మార్గం అందుబాటులోకి వస్తే ఈ సమయం గణనీయంగా తగ్గి కేవలం 2.20 గంటలకు చేరుకుంటుంది. తమిళనాడు ప్రభుత్వం కోరిక మేరకు గతంలో గూడూరు మీదుగా ఉన్న ప్రణాళికను మార్చి తిరుపతిలో స్టేషన్‌ను చేర్చారు. తమిళనాడు రాష్ట్ర పరిధిలో మొత్తం రెండు స్టేషన్లు ప్రతిపాదించారు. తమిళనాడులో చెన్నై సెంట్రల్, చెన్నై రింగు రోడ్డు స్టేషన్ ఉంటాయి. అయితే వాణిజ్య, రవాణా సౌలభ్యం కోసం, రైల్వే శాఖ ప్రతి స్టేషన్ చుట్టూ దాదాపు 50 ఎకరాల స్థలాన్ని కోరింది. సమగ్ర ప్రాజెక్టు నివేదికపై ప్రభుత్వ ఆమోదం లభించిన నెలలోపు తుది నిర్ణయం తీసుకుంటామని చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ తెలిపింది. ఈ హైస్పీడ్ నెట్‌వర్క్ నిర్మాణంలో తమిళనాడు పరిధిలో 12 కి.మీ.ల సొరంగ మార్గం ఉండనుంది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 223.44 హెక్టార్ల భూమి అవసరం కాగా, ఇందులో అటవీ భూమి లేదని రైల్వే అధికారులు ధృవీకరించారు. ఈ మార్గం దాదాపు 65 రోడ్లు, 21 హైటెన్షన్ విద్యుత్తు లైన్లను దాటాల్సి ఉంటుంది. ప్రభుత్వ కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ నిర్వహించిన సర్వేల ఆధారంగా ఈ అలైన్‌మెంట్ రూపొందించారు. దక్షిణాదిన ప్రణాళికలో ఉన్న రెండు హైస్పీడ్ మార్గాలలో ఇది ఒకటి కాగా, రెండోది హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌గా ఉంది.

# రహదారి వెంటున్న గ్రామాలకు 'జనరల్'

- రెండు గ్రామాలు మినహా హైవేలను అనుకొని ఉన్న అన్ని గ్రామాల్లో జనరల్ రిజర్వేషన్లు
- అదాయం ఎక్కువగా ఉన్న పంచాయతీలు అన్ రిజర్వుడ్‌గా కేటాయింపు
- అదాయం వచ్చే గ్రామపంచాయతీలపై పట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్న ప్రధాన పార్టీలు



చాడ వేణుగోపాల్ రెడ్డి (ప్రత్యేక ప్రతినిధి ,జనం సాక్షి) :

సంగారెడ్డి ...రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు దగ్గరగా ఉన్న జిల్లా కేంద్రం. సంగారెడ్డిలో ప్రాంతం నుండి మూడు జాతీయ రహదారులు వెళ్తుంటాయి. హైదరాబాద్ టూ ముంబాయి జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 65), నాందేడ్ అకోలా జాతీయ రహదారి , బెంగుళూరు జాతీయ రహదారి మీదుగా రోజు లక్షలాది వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. ఇలా సంగారెడ్డి నియోజకవర్గంలోని సంగారెడ్డి ,కంది, కొండాపూర్, సదాశివపేట మండలాల పరిధిలోని వివిధ గ్రామాల గుండా జాతీయ రహదారి ఉంటుంది. ముఖ్యంగా ముంబాయి రహదారి వేలాది వాహనాలతో నిత్యం అన్ని సమయాల్లో విపరీతమైన రద్దీగా ఉటుంది. దింతో హైవేకు ఇరువైపులా డాబాలు ,హెటల్స్ , నిర్మాణ రంగంకు చెందిన గోదామ్స్ ...ఇతర వ్యాపారులకు సంబంధించిన కమర్షియల్ షాపులు పెద్దఎత్తున ఉంటాయి. ముంబాయి హైవేకు అనుకొని ఉన్న గ్రామాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు కుడా ఉన్నాయి. హైవేలు ఉండటంతో సంగారెడ్డి ప్రాంతంలో చుట్టుపక్కల గ్రామాల్లో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. దారిపొడవున ఏదో ఒక రియల్ ఎస్టేట్ వెంచర్ కన్పిస్తుంది. దింతో హైవేలకు దగ్గరగా ఉన్న గ్రామాల్లో రెవెన్యూ అధికంగా వస్తుంటుంది. అయితే నిన్న ప్రకటించిన సర్పంచ్ స్థానాల రిజర్వేషన్ల లో సంగారెడ్డి నియోజకవర్గంలోని జాతీయరహాదారులను అనుకొని ఉన్న గ్రామాలు రెండు మినహాయిస్తే సుమారు 20 గ్రామాల వరకు జనరల్ స్థానాలుగా ప్రకటించారు.

ముంబాయి జాతీయ రహదారి( ఎన్ హెచ్ 65) పై ఉన్న కంది మండల పరిధిలోని కవలంపేట ,మామిడి పల్లి ,చేర్యాల్, కంది గ్రామాలు , కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్, గిర్మాపూర్ , సదాశివపేట మండల పరిధిలోని పెద్దపూర్, నందికంది, నాగ్సన్ పల్లి, అరూర్,కోనపూర్ గ్రామాలు ఉన్నాయి. ఒక్క మల్కాపూర్ మినహ మినహ మిగిలిన పది గ్రామాల్లో పంచాయితీలను అన్ రిజర్వుడ్ స్థానాలుగా ప్రకటించారు. అలాగే నాందేడ్ అకోలా హైవే ( ఎన్ హెచ్ 161) వెళ్లే చేర్యాల్ , మామిడి పల్లి , గుడిగడ్డ తండా, ఫసల్ వాడి గ్రామాల్లో జనరల్ స్థానలుగా ప్రకటించారు. సంగారెడ్డి నుండి శంకర్ పల్లి మీదుగా బెంగుళూరు హైవేను( ఎన్ హెచ్ 44 ) కలిపే హైవే పై ఉన్న కంది, కాశీపూర్ , జుల్కల్ గ్రామాలను జనరల్ స్థానలుగా ప్రకటించారు. ఎద్దుమైలారం గ్రామం ఎస్సీ మహిళ కి కేటాయించారు. ఇలా జాతీయ రహదారులను అనుకొని ఉన్న సుమారు 18 గ్రామాల్లో అన్ రిజర్వడ్ కాకుండా లేదా జనరల్ గా ప్రకటించారు. ఎస్సీ లకు రెండు కేటాయించగా, బిసీలకు ఒక్క గ్రామం కుడా రిజర్వ్ చేయలేదు.

### కోట్ల రూపాయలు ఖర్చుకు సిద్ధమౌతున్న అభ్యర్థులు

జనరల్ స్థానంలో అన్ని వర్గాల వారు పోటీ చేసే అవకాశం కన్పిస్తున్న ... ఎవరు ఆర్థికంగా బలంగా ఉంటారో వారే బరి ఉంటారనేది అందరికీ తెలిసిన వాస్తవం. మిగితా పంచాయితీలతో పోల్చితే జాతీయ రహదారులను అనుకొని ఉన్న పంచాయితీలలో సర్పంచులుగా బరిలో ఉండాదల్చిన వారు కోట్ల రుపాయల ఖర్చు పెట్టవలసి వస్తుంది. పేరుకు జనరల్ స్థానంగా ఉన్నప్పటికి కేవలం అర్థిక, అంగ, రాజకీయ బలం ఉన్న వారు మాత్రమే బరిలో నిలిచే అవకాశలు కన్పిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కోట్లు సంపాదించిన వారు , భూ స్వాములకు మాత్మాత్రమే ఎన్నికల్లో నిలబడే అవకాశం ఉంది. సర్పంచ్ గా బరిలో ఉంటే కోట్ల రుపాయలు ,వార్డు మెంబరుగా నిలబడలంటే లక్షల్లో ఖర్చు అయ్యే పరిస్థితి కన్పిస్తుంది. ప్రజా సేవ చేద్దాం అనుకునే ...యువకులు , విద్యావంతులు కోట్లాది రుపాయలు ఖర్చుచేసే స్థాయి లేకపోవడంతో పోటి కి దూరంగా ఉండే అవకాశం ఉంది. కోట్ల రూపాయల ధన ప్రవాహం ముందు పోటీ చేసే దైర్యం చేయడం లేదు. గ్రామల్లో జరిగే రియల్ ఎస్టేట్ వెంచర్లు , సమీప పరిశ్రమల్లో లేబర్ కాంట్రాక్టురులు చేసుకునే అవకాశలు ఉండటం తో పాటు ... గ్రామంలో జరిగే ప్రతి పనికి పంచాయితీ అనుమతి తప్పనిసరి కావడంతో ఎన్ని కోట్లు అయినా పెట్టుబడి పెట్టి రాజకీయాలు చేయడానికి ధనవంతులు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు పంచాయతీ ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు కుడా మేజర్ గ్రామపంచాయితీలతో పాటు వారికి అర్థికంగా అవకాశలను స్రష్టించే గ్రామపంచాయితీలలో తమ అనుచరులు ప్రజాప్రతినిధులుగా ఉండాలని బలంగా కోరుకుంటారు. కమర్షియల్ గ్రామ పంచాయితీలలో పట్టు ఉంటే తమ రాజకీయ అవసరాలకు సర్దుబాట్లు అవుతాయని ప్రధాన పార్టీల నాయకులు నమ్ముతారు. అందుకే మిగితా గ్రామపంచాయితీ విషయంలో ఎలా ఉన్నప్పటికి రెవెన్యూ స్రష్టించే గ్రామపంచాయితీలలో తమ పట్టును నిలుపుకోవాలని బలంగా కొరుకుంటారు. ఇలా ప్రధాన పార్టీలు అయినా కాంగ్రెస్ ,బిఆర్ఎస్ పార్టీలు ఈ జాతీయ రహాదారులను అనుకొని ఉన్న గ్రామపంచాయితీలలో అన్ని రకాలుగా బలమైన అభ్యర్థులకు మద్ధతునిస్తారు.

### అవకాశాలు కోల్పోతున్న యువత, విద్యావంతులు

మరోవైపు వరుసగా హైవేలను అనుకొని ఉన్న గ్రామపంచాయితీలు ,అర్థికంగా బలంగా ఉన్న గ్రామపంచాయితీలను జనరల్ మార్చడం ప్రజల్లో చర్చలు తావిస్తుంది. అదాయం ఎక్కువ ఉండి, కమర్షియల్ ఉండే ఈ తరహ గ్రామాల్లో డబ్బుల ప్రభావం విపరీతంగా పెరుగుతుందని, మంచి వారు, సామన్యులు ,విద్యావంతులు పోటి నిలబడే పరిస్థితులు లేకుండా పోతున్నయని చెప్పుకుంటున్నారు. కోట్లాది రుపాయలు ఖర్చు చేసి గెలిచిన సదరు నాయకులు ..గెలిచిన తర్వాత రియల్ దందాలు, కాంట్రాక్టులు తప్ప ప్రజాసేవ ఏం చేస్తరని వాపోతున్నారు. ఈ డబ్బుల ప్రవాహం కేవలం హైవే వెళ్లే గ్రామాలకే పరిమితం కాకుండా హైవేకు దగ్గరగా ఉన్న గ్రామాల్లో సైతం ఈ డబ్బుల ప్రభావం ఉంటుందని సర్పంచ్ బరిలో నిలిచే అభ్యర్థులు అనుకుంటున్నారు.

# చెక్ డ్యామ్ ధ్వంసంపై విచారణ ముమ్మరం

**జమ్మికుంట, నవంబర్25 (జనంసాక్షి) :** జమ్మికుంట మండలం తనుగుల గ్రామంలోని మానేరు వాగు పై నిర్మించిన కొత్త చెక్ డ్యామ్ ధ్వంసం అయింది. ఇసుక మాఫియా బ్లాస్టింగ్‌తో ధ్వంసం చేసినట్లు ఇరిగేషన్ అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల నిర్మాణం పూర్తయి, ప్రారంభోత్సవానికి ముందే ఈ టన జరిగింది. 90 మీటర్ల పొడవు పగుళ్లు, మూడు చోట్ల బ్రీచ్‌లు ఏర్పడ్డాయి. ప్రభుత్వానికిరూ. 3 కోట్ల ఆస్తి నష్టం జరిగిందని ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన ద్వారా 3,000 ఎకరాల ఆయకట్టు ప్రభావితమవుతుందని, వెంటనే 100 ఎకరాల్లో పంటలు నాశనం కావచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫోరెన్సిక్ టీమ్, నిపుణులు స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారుల ప్రకారం అక్రమ ఇసుక వ్యాపారానికి ఈ చెక్ డ్యాం అడ్డంకిగా మారిందన్న కారణంతో పేల్చేశాని భావిస్తున్నారు రోజుకు 300-400 ట్రాక్టర్లు, ట్రక్‌లతో హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా చేస్తున్న మాఫియా, నీటి నిల్వ కారణంగా ఇసుక తవ్వలేకపోవడంతో జిలెటిన్ స్టిక్‌లు, డిటోనేటర్‌లతో బ్లాస్టింగ్ చేసినట్లు అనుమానిస్తున్నారు. ఇది సహజ కారణాల వల్ల కాదు, ఉద్దేశపూర్వకంగా పేల్చినట్లు కనిపిస్తోంది. మూడు చోట్ల 90 మీటర్ల పొడవు పగుళ్లు, బ్రీచ్‌లు ఏర్పడ్డాయి అధికారులు ప్రకటించారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ దర్యాప్తు కొనసాగుతోందని చెబుతున్నారు. హైదరాబాద్ లోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నుంచి టీమ్ నవంబర్ 24న స్థలాన్ని పరిశీలించింది. సహజ కారణాలా, ఉద్దేశపూర్వక బ్లాస్టింగ్ కావడమా అని నిర్ధారించడానికి సాంపిల్స్ సేకరించారు. కరీంనగర్ కలెక్టర్, పోలీస్ కమిషనర్ కూడా స్థలాన్ని పరిశీలించి, రైతుల ఆందోళనలను విన్నారు. ఈ ఘటనపై రాజకీయ కలకలం రేగింది. బీఆర్ఎస్ మాజీ మంత్రి టి. హరీశ్ రావు, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ కె. సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు డి. మనోహర్ రెడ్డి, ఆర్. బాలకిషెన్, ఎస్. రవి శంకర్‌లు నవంబర్ 25న స్థలాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ ఇసుక మాఫియా పేల్చింది. మేడిగడ్డ బ్యారేజీ డ్యామేజ్‌కు కూడా ఇదే కారణమా అని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేసి, నిందితులపై చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. నిర్మాణ లోపమైతే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌ను బ్లాక్‌లిస్ట్ చేయాలని, టెండర్లు రద్దు చేయాలని కోరారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు.చెక్ డ్యామ్ కూలిపోవడంపై పరిశీలనకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జమ్మికుంటలోని తనుగుల-గుంపుల చెక్ డ్యామ్‌లో విస్తృత నిర్మాణ లోపాలు, చెక్ డ్యామ్‌లు కూలిపోవడం పెద్ద సమస్య అన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకుంది.

# వరంగల్ ఎన్నికల సహాయక కేంద్రం ఏర్పాటు

**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 26 (జనంసాక్షి):** వరంగల్ జిల్లాలో స్థానిక సంస్థల గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, ఏదైనా అసౌకర్యం కలిగితే ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జిల్లాలో సర్పంచ్ లు, వార్డు సభ్యు లకు జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతం చేయడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, ఎన్నికల సంఘం జారీ చేసినటువంటి నియమ నిబంధనలు ఉల్లంఘించిన/ అతిక్రమించిన అనగా డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ వంటివి ఎన్నికల ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సహాయక కేంద్రం టోల్ ఫ్రీ నెంబర్ 18004253424, 9154252936, 0870 2530812 నెంబర్లకు తెలియజేసినచో తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

# అందేశ్రీ జీవితం అందరికీ ఆదర్శం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త




**హైదరాబాద్ (జనంసాక్షి) :** అందే శ్రీ జీవితం అందరికీ ఆదర్శమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. సాయి అలేఖ్య సాంస్కృతిక సంఘ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఉపద్రష్ట అరుణ అశోక్ వ్యవస్థాపకులు, సాయి అలేఖ్య తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో చైతన్య విద్యానికేతన్ హైస్కూల్ జగద్గిరిగుట్ట వారి ఆశిస్సులతో రవీంద్ర భారతిలో జరిగిన అందే శ్రీకి సంగీత నృత్య-స్వరానీరాజనంలో పాల్గొన్నారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ తెలంగాణ ఉద్యమంలో అందే శ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతం రాష్ట్ర ఏర్పాటులో సబ్బండ వర్గాలకు ఒక్కతాటి మీదకు తీసుకొచ్చి ప్రజల్లో స్ఫూర్తిని నింపింది . ఆయన మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు. తెలంగాణ ఉద్యమంలో అందే శ్రీతో కలిసి అనేక వేదికలపై పోరాటం చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందే శ్రీ కి ఇచ్చిన గౌరవం అందరికీ ఆదర్శంగా నిలిచిందని దళిత కవి పాడే మోసి ఘన నివాళి అర్పించిన తీరు అభినందనీయం అని వారు తెలిపారు. 1000 మంది విద్యార్థుల చేత అందే శ్రీ పాటల మీద నృత్యం చేశారు. అనంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్త మాయమయ్యి పోతున్నడమ్మ మనిషన్న వాడు అనే పాట పాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గరపూ దయానంద్ గుప్త , మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణు గోపాల్ చారి సంఘ సేవకులు చిన్న శ్రీశైలం యాదవ్ , మిట్టపల్లి సురేందర్, చక్రి గుప్త, ఆనంద్ గుప్త, దైవ్షశర్మ గారు తదితరులు పాల్గొన్నారు.

# నేటితో ముగియనున్న జేఈఈ మెయిన్ తొలి విడత రిజిస్ట్రేషన్లు

**న్యూఢిల్లీ, నవంబర్ 26 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్, బీఆర్క్ సీట్ల భర్తీకి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ (మెయిన్-2026 తొలి విడత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు నేటితో ముగియనున్నాయి. నవంబర్ 27 రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అదేరోజు రాత్రి 11:50 గంటల్లోగా ఆన్‌లైన్ ఫీజు చెల్లింపులకు అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే డిసెంబర్ 1 నుంచి 2వ తేదీ రాత్రి 11.50 వరకు సవరించుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. జేఈఈ మెయిన్ సెషన్ 1 దరఖాస్తు సమయంలో తప్పుగా నమోదుచేసిన వివరాల సవరణకు గడువు ముగిసిన తర్వాత ఎట్టిపరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వరు. ఒక్కసారి మాత్రమే వివరాలు సవరించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తులో అభ్యర్థి మొబైల్ నంబర్, ఈ-మెయిల్, అడ్రస్, ఎమర్జెన్సీ కాంటాక్ట్ వివరాలు, అభ్యర్థి ఫొటోను మార్చడానికి అవకాశం ఉండదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. అభ్యర్థి పేరు, తండ్రి పేరు,తల్లి పేర్లలో ఏదో ఒకటి మాత్రమే సవరించేందుకు అవకాశం ఇస్తారు. పదో తరగతి, 12వ తరగతి సంబంధిత వివరాలు, పాన్ కార్డు నంబర్, పరీక్ష రాయాలనుకొనే నగరం, మాధ్యమాన్ని మార్చుకొనేందుకు ఛాన్స్ ఉంటుంది. అలాగే అభ్యర్థి పుట్టిన తేదీ, జెండర్, కేటగిరీ, సబ్ కేటగిరీ, సంతకం మార్చుకోవచ్చు. ఆధార్ కాకుండా ఇతర గుర్తింపుతో నమోదు చేసుకున్న అభ్యర్థులకు మాత్రమే తమ గుర్తింపు వివరాలను మార్చడానికి అనుమతి ఉంటుంది. ఆధార్ వివరాలు సవరించుకోవడానికి మాత్రం అవకాశం ఉండదు. ఈ విషయాలను అభ్యర్థులు దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా సవరించుకోవల్సి ఉంటుంది.జేఈఈ మెయిన్ మొదటి విడుత పరీక్ష రోజుకు రెండు సెషన్లలో జనవరి 21 నుంచి 30 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఆయా తేదీల్లో ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు. ఇందులో వచ్చిన స్కోర్ ఆధారంగా ఎన్ఐటీ, ఐఐటీ, జీఎఫ్‌టీఐ వంటి ప్రతిష్టాత్మక ఇంజినిరింగ్, ఆర్కిటెక్చర్, ప్లానింగ్ ఇన్‌స్టిట్యూట్లలో ప్రవేశాలు కల్పిస్తారు. జేఈఈ మెయిన్ పరీక్షలను మొత్తం 13 భాషల్లో నిర్వహిస్తుంది. తెలుగు, ఇంగ్లిష్ సహా హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, ఉర్దూ భాషల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. మొదటి సెషన్‌లో పరీక్షలు రాసిన విద్యార్థులు రెండో సెషన్ పరీక్షలు కూడా రాయవచ్చు. రెండింటిలో బెస్ట్ ర్యాంకును అంతిమంగా పరిగణనలోకి తీసుకుంటారు. ఇక జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్‌లో జరగనున్నాయి. పరీక్షకు వారం ముందు అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ మొదటి సెషన్ ఫలితాలు ఫిబ్రవరి 12న విడుదలకానున్నాయి.

# కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా?

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, నవంబర్ 26 (జనంసాక్షి) :** అధికార కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెలను గ్రామాల్లో కూల్చివేయాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అంశంపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు.పంచాయతీ ఎన్నికల్లో..అన్ రిజర్వుడు స్థానాల్లో అన్ని చోట్లా నామినేషన్లు వేయాలని బీసీలకు ఆమె సూచించారు. 42 శాతం రిజర్వేషన్లలో ప్రధాన దోషి బీజేపీ అని ఆరోపించారు. బీసీలకు మోసం జరుగుతుంటే..ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి రియాక్షన్ లేదని విమర్శించారు. ప్రతిపక్షం గురించి తాను మాట్లాడనని.. మాట్లాడితే బద్నాం చేస్తారన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పోరాటం చేసిందేమీ లేదని కుండ బద్దలు కొట్టారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సరిగ్గా జరగలేదన్నారు. అందుకే బీసీలకు రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరిగిందని తెలిపారు. మంత్రులు,ఎమ్మెల్యేల ప్రమేయంతోనే ఈ రిజర్వేషన్లు ఖరారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని స్వయంగా జిల్లా కలెక్టర్లే చెబుతున్నారన్నారు. బీసీ జనాభాను కావాలని కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ చేసి చూపిందని పేర్కొన్నారు. జిల్లాల వారీగా 5 శాతానికి పైగా బీసీ జనాభా తగ్గించి చూపించారని చెప్పారు.21శాతం మాత్రమే బీసీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. పంచాయతీ ఎన్నికలతో జనం బాట కార్యక్రమంలో స్వల్ప మార్పులు చేశామని చెప్పారు. పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు గ్రేటర్ పరిధిలో జనం బాట కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. తనపై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డి ఎందుకు స్పందిస్తున్నారో అర్థం కాలేదన్నారు. ఏదైనా ఆరోపణలు చేస్తే.. అర్థం పర్థం ఉండాలని పేర్కొన్నారు. తాను ఎవరిపైనో ఆరోపణలు చేస్తే.. మహేశ్వరరెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. తన ఆరోపణలపై స్పందించి.. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మంచి ఒరవడికి శ్రీకారం చుట్టారని అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆక్రమించిన భూమి తనకెందుకని ప్రశ్నించారు. ఆ భూమిని ప్రజలకు ఇస్తే సరిపోతుందని కవిత తెలిపారు.

# నామినేషన్ పత్రాలను ఆర్వోలు సరిచూసుకోవాలి..


### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

### ఎన్నికల సామగ్రిని పరిశీలించిన జిల్లా కలెక్టర్..



హనుమకొండ ప్రతినిధి నవంబర్ 26 (జనం సాక్షి) :సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం నుండి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు అధికారులు చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కమలాపూర్ లోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా క్లస్టర్లకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఎన్నికల సామగ్రి ని పరిశీలించారు. ఎలక్షన్ నోటీసు, ఓటర్ల జాబితా, నామినేషన్ పత్రాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన పత్రాలతో పాటు పోటీ చేసే అభ్యర్థుల కొరకు కరదీపిక ను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలో 10 క్లస్టర్లు, 24 గ్రామ పంచాయతీల సంబంధించిన వివరాలను ఎంపీడీవో గుండె బాబును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాలలో సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థులు సమర్పించే నామినేషన్ పత్రాలు అన్ని సరిగా ఉన్నాయా లేదా అని రిటర్నింగ్ అధికారులు సరిచూసుకోవాలన్నారు. నామినేషన్ పత్రానికి ఏ ఏ పత్రాలను జత చేయాల్సి ఉంటుందో చెక్ లిస్టును ఇవ్వాలన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ సురేష్ కుమార్, ఎంఈఓ శ్రీధర్, ఆర్వోలు,ఏఆర్వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్‌ను కొట్టిన కేసులో ఇద్దరు అరెస్టు



**నర్సంపేట నవంబర్ 26 ( జనం సాక్షి) :** హైదరాబాద్ నుండి మహబూబాబాద్ కు వస్తున్న ఆర్ టి సి బస్సు వరంగల్ చేరుకున్నక తర్వాత ఇద్దరు ప్యాసింజర్ లు దొంతి రాంరెడ్డి, దొంతి లక్ష్మరెడ్డి . పై కేసు నమోదు అయినట్టు నర్సంపేట టౌన్ ఎస్ఐ రవికుమార్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నర్సంపేట కు టికెట్ తీయనుకోని బస్సు ఎక్కారు. నర్సంపేట బస్సు స్టాప్ వచ్చాక డ్రైవర్ కం కండక్టర్ చీకటి వెంకటయ్య పైన పేర్కొన్న ఇద్దరిని బస్సు దిగమని చెప్పక బస్సు దిగాము అని చెప్పడమే కాకుండా డ్రైవర్ వెంకటయ్య ను అసభ్య కరంగా తిట్టి కొట్టడంతో వారిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్టు పేర్కొన్నారు.

# హాంగ్‌కాంగ్‌లోని భారీ అగ్ని ప్రమాదం

### 35 అంతస్తుల భవనంలో మంటలు

### 13 మంది దుర్మరణం



**హాంగ్‌కాంగ్, నవంబర్ 26 (జనంసాక్షి):** హాంగ్‌కాంగ్‌లోని 35 అంతస్తుల హౌసింగ్ కాంప్లెక్స్‌లో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో 13 మంది మృతి చెందారు. మరికొందరు మంటల్లో చిక్కుకున్నట్లు సమాచారం. సంఘటన స్థలంలోనే తొమ్మిది మంది మరణించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం నుంచి బయటపడిన హౌసింగ్ కాంప్లెక్స్‌లోని వందలాది మందిని తాత్కాలిక ఆశ్రయాలకు తరలించారు. థాయ్‌పో జిల్లాలోని ఆకాశహర్మ్యాల్లో బుధవారం మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాప్తి చెంది ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఆ నివాస సముదాయంలో సుమారు 2,000 ఇళ్లు ఉన్నాయని, అందులో కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనను 4వ నెంబరు ప్రమాదంగా అధికారులు ప్రకటించారు. అత్యయిక పరిస్థితి ప్రకటించినప్పుడు భారీస్థాయిలో ఫైరింజన్లు, సిబ్బందిని మోహరించవలసి ఉంటుంది. ఈ నివాస సమదాయంలో దాదాపు 4,800 మంది నివసిస్తున్నారు. 128 అగ్నిమాపక వాహనాలు, 57 అంబులెన్సులను ఘటనా స్థలానికి తరలించారు. మంటల్లో చిక్కుకున్న వారిలో వృద్ధులు అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# మారెడుమిల్లి మావోయిస్టుల మరణశయ్య

ఇద్దరు మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకులు: గాజర్ల రవి, మాడివి హిడ్మాలను మారెడుమిల్లి అడవుల్లో చిత్రహింసలు పెట్టి కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించారు. కానీ ప్రజలు ఎవ్వరు కూడా ఆ ఎన్‌కౌంటర్ విషయాన్ని విశ్వసించడం లేదు. ఎందుకంటే గాజర్ల రవి హత్యను మనం పరిగణలోనికి తీసుకున్నట్లయితే గాజర్ల రవి, అరుణ, అంజులతోపాటు పదుల సంఖ్యలో ఉన్నటువంటి వారి రక్షణ బృందం పోలీసు దాడులను ఎదుర్కొంటూ విడిపోయిందని ఆ క్రమంలోనే ఈ ముగ్గురు గాయాలతో వెళుతూ వెళుతూ ఒక దగ్గర నడవలేని స్థితిలో వారం పది రోజుల పాటు ఇదే మారడుమిల్లి అడవుల్లో ఒక దగ్గర ఉన్న విషయం తెలుసుకున్న పోలీసులు ప్రభుత్వంతో సమాలోచన చేసి చంపడం కన్నా కూడా లొంగుబాటు చూపెట్టడమే వారికి లాభదాయకంగా ఉంటుందనే ప్రయత్నం చేశారు. అందులో భాగంగానే గాజర్ల రవి, అరుణ కుటుంబాల దగ్గరికి వెళ్ళి మీ వాళ్ళు ఎక్కడ ఉన్నారో మాకు తెలుసు, వారి దగ్గరికి మిమ్మల్ని తీసుకెళ్తాం, దారి చూపిస్తాం, ఆర్థిక సహాయం కూడా చేస్తాం. మీరు వాళ్ళు లొంగిపోయేలా ప్రయత్నం చేయాలని ఇద్దరి కుటుంబ సభ్యుల దగ్గరికి వచ్చి ఎన్‌కౌంటర్‌కు రెండు రోజుల ముందు చేసిన ప్రయత్నం ఒక వాస్తవం. కానీ కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పోలీసుల మాటలపై విశ్వాసం ఉంచటేకు మేము చెబితే మాత్రం వాళ్ళు లొంగిపోతారా అని చెప్పి ఊరుకున్నారు. కానీ నిజంగానే వాళ్ళు బందీలుగా పోలీసుల అదుపులో ఉన్నారనేది నిజం. కానీ ఎలాగైనా సరే వీరిని లొంగుబాటు చర్యగా చూపిస్తే ప్రజల్లో వీరి పట్ల మావోయిస్టు పార్టీ పట్ల విశ్వాసం సన్నగిల్లుతుందని తీవ్ర ప్రయత్నమే చేశారు. కానీ ఆ ప్రయత్నం అమలు కాని నేపథ్యంలోనే ఎన్‌కౌంటర్ పేరుతో జరిగిన హత్యలని మనకు స్పష్టమవుతుంది. అదే విధంగా ఈ ఘటన 18 జూన్ 20205 నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మారేడుమిల్లి మండలాల సరిహద్దుల్లో 2025 జూన్ 18 బుధవారం రోజున ముగ్గురు మావోయిస్టు నాయకులు ఎన్‌కౌంటర్‌లో మరణించారని 19వ తారీకు పత్రికలలో వార్త వచ్చింది. కొండమొదలు, కొయ్యలగూడెం, చింతకూరు పరిసర అటవీ ప్రాంతాల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు నాయకుడు కేంద్ర కమిటి సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, స్పెషల్ జోనల్ కమిటి సభ్యురాలు అరుణ అలియాస్ వీఆర్ చైతన్య, ఏవోబి స్పెషల్ జోన్ కమిటి ఏసిఎం అంజు ఉన్నారు. సజీవంగా పోలీసులకు చిక్కినప్పటికి న్యాయస్థానంలో ప్రవేశ పెట్టకుండా ఒక వైపు లొంగుబాటు ప్రయత్నం అది సరికాకపోతే హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించే స్థితిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంలో మోడీషా ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా పనిచేయాల్సిన స్థితిని ఏ విధంగా దాటవేస్తున్నారో మనందరం గుర్తు చేయాల్సిన అవసరం ఉంది. ఒక వైపు గాజర్ల రవి హత్యలో ఇటువంటి స్థితి కొనసాగింది. చివరికి చంపిన తరువాత శవాలను ఇవ్వడానికి కూడా అవి పురుగులు పట్టేంత వరకు చూసి అప్పుడు మాత్రమే కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇది గాజర్ల రవి వరకు అమలైన నిర్బంధమైతే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటి కార్యదర్శి నంబాల కేశవ రావుతో పాటు 27 మందిని కాల్చి చంపిన ప్రభుత్వం ఆదివాసీ శవాలను వారి వారి కుటుంబ సభ్యులకు అప్పగించినప్పటికి నంబాల కేశవరావుతో పాటు మూడు శవాలను వారి వారి కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా కుటుంబ సభ్యులు వారం రోజుల ప్రయత్నం చేసినప్పటికి పోలీసుల చే శవాలను తడులబెట్టించడం బంధువులను బెదిరించడం చివరికి బూడిద కూడా ఇవ్వకుండా బంధువులను చత్తీస్‌ఘడ్ నుండి నెట్టివేయడమంటేనే చత్తీస్‌ఘడ్ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వానికి రాజ్యాంగం పట్ల మృతదేహాల పట్ల ఎటువంటి బాధ్యత గౌరవం ఉందనేది మనకు అర్థమవుతుంది. అందుకే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శవాల స్వాధీన కమిటి బూటకపు ఎన్‌కౌంటర్ల వ్యతిరేక కమిటి ఏర్పడి పోరాటం చేయగలిగాయి. ఆ పోరాటం తోనే చితిపై పేర్చిన శవానికి కూడా తీసుకువచ్చి రీపోస్టు మార్టం నిర్వహించిన స్థితి కూడా మన దగ్గర ఉంది. కానీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు తనను అలిపిరి ఘటనలో చంపే ప్రయత్నం చేశారన్న కోపంతో నంబాల కేశవరావు శవాన్ని వాళ్ళ కుటుంబ సభ్యులకు అందకుండా ఎంత దుర్మార్గంగా ప్రయత్నించాడో మనందరికి అర్థమైన విషయం. ఇలా రాష్ట్రాలకు ముఖ్యమంత్రిగా ఉంటూ దేశానికి ప్రధాన మంత్రిగా ఉంటూ రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని రక్షించకపోతే ప్రజాస్వామ్య విలువల పట్ల రాజ్యాంగ రక్షణ పట్ల ప్రజలు ఏ విధంగా ఉండాలో అర్థం కాని విషయం.

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటి సభ్యుడు ఆదివాసీ నాయకుడు మడివి హిడ్మాను నవంబర్ 18న మారెడ్‌మిల్లి ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఈ రోజు మావోయిస్టు పార్టీ విడుదల చేసి ప్రకటనలను చూస్తే నవంబర్ 15న మడివి హిడ్మాతో పాటు శంకర్, రాజే, చైతు, కమ్లూ, మల్లాల్, దేవేలను పట్టుకొని చిత్రహింసలు పెట్టి కాల్చి చంపినట్లుగా తెలియవస్తున్నది. ఇది మడివి హిడ్మాతో జరిగిన మొదటి ఎన్‌కౌంటర్ కాదు. గత 22 నెలలుగా కగార్ పేరుతో ఎన్‌కౌంటర్ హత్యాకాండను కొనసాగిస్తూ ఇప్పటి వరకు 84 ఎన్‌కౌంటర్లలో సుమారు 780 మందికి పైగా కేంద్ర ప్రభుత్వం హత్య చేసింది. మడావి



హిడ్మా 5వ తరగతి చదువుతూ ఉద్యమంలో చేరిన వ్యక్తి. అప్పటికే ఆదివాసీ జీవితాలు ఏ విధంగా ఆందోళన కరంగా ఉన్నాయో అర్థం చేసుకున్న వ్యక్తి. అతను ప్రాథమిక స్థాయి నుండి ఎదుగుతూ ఉద్యమాన్ని ఎదిగించే ప్రయత్నంలోనే ముందున్నాడు. స్వతహాగా ఆదివాసీ కాబట్టి అడువుల్లో జీవించే విధానంలో ఎన్ని మెలకువలు ఉండాలో అన్నింటిని శతృవుమీద అమలు చేసే ఆలోచనలు చేసి ఉండవచ్చు కాక. కాని అతను ఆ ఉద్యమంలోకి ఎందుకు ప్రవేశించాడనేది ప్రశ్న లేకుండా అతను చురుకైన వాడు, పథకం వేసాడంటే ఎవరూ తప్పించుకోలేడు అంటూ ప్రభుత్వ మీడియా చాలా పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేసింది. చివరికి అతను లొంగి పోవడానికి వస్తే ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించవద్దని కేంద్ర ప్రభుత్వ హుకుంను కూడా రాష్ట్ర ప్రభుత్వాలు పాటించినట్లుగా వినికిడి. అయితే అతన్ని అదుపులోకి తీసుకున్న తరువాతే ఆపరేషన్ కగార్ ప్రారంభించబడి 22 నెలల తరువాత గాని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ పూవర్తిలోని హిడ్మా ఇంటికి వెళ్ళలేదు. ఇతన్ని అదుపులోకి తీసుకున్న తరువాతనే విజయ్ శర్మ హిడ్మా తల్లిని కలిసి భోజనం చేయడం, బ్లాంకెట్ ఇవ్వడం, ఏ విధంగానైనా సరే అతను లొంగిపోయే విధంగా ప్రయత్నం చేయమని గట్టిగా చెప్పి రావడం జరిగింది. కానీ వాళ్ళ ప్రయత్నానికి సమయం లేకుండానే వారం రోజుల లోపే హిడ్మా శవాన్ని తల్లికి పంపించాడంటేనే విజయ్ శర్మ ఎంత చాతుర్యంగా వ్యవహరించాడో మనం అర్థం చేసుకోవచ్చు. కానీ నంబాల కేశవరావును, గాజర్ల రవిని మించిన సానుభూతిని మడివి హిడ్మా అఖిల భారత స్థాయిలో, ప్రపంచ స్థాయిలో సాధించాడనడానికి ఒక ప్రామాణికత. అతను ఒక ఆదివాసీగా బయల్దేరి భారత దేశంలో విప్లవోద్యమంలో ఒక క్రియాశీల వ్యక్తిగా మారడమే ప్రామాణికంగా మారింది. చివరికి వరంగల్ జిల్లా వెలిశాలలో హిడ్మా ను గుర్తిస్తూ పోస్టర్లు వేయడం ప్రచారం చేయడం కూడా నేరంగా మారి వారిపై తీవ్రమైన చిత్రహింసలను తెలంగాణ పోలీసులు అమలు చేస్తున్న వైనం మా దృష్టికి వచ్చింది. అంతేకాక నిన్న ఢిల్లీలో జరిగిన పొల్యూషన్ వ్యతిరేక ర్యాలీలో వివిధ యూనివర్సిటీలకు చెందిన 15 మంది విద్యార్థులు హిడ్మాను సొంతం చేసుకోవడం అతని విప్లవోద్యమాన్ని గుర్తించడం అంతేకాక మావోయిస్టు పార్టీ పర్యావరణ పరిరక్షణలో భాగంగా దండకారణ్యంలో ప్రధానంగా బస్తర్‌లో కొనసాగిస్తున్న విధానాన్ని ఢిల్లీలో కూడా అమలు పరచాలని మాట్లాడడం ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని ప్రభుత్వాన్ని నిందించడంలో భాగంగా చేసిన ప్రయత్నంతో దేశ వ్యాప్తంగా ఒక ఉలికిపాటు వచ్చింది. దీనిని అఖిల భారత స్థాయిలో విద్యార్థులు, బుద్ధిజీవులు, మేధావులు, అందుకోవాలని రాజ్యాంగ పరిధిలోనే ప్రభుత్వాలు పరిపాలన చేయాలనే విదానాలని మరింత ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఈ సంఘటన గుర్తుకు చేస్తున్నాయి. మొత్తంగా మాడివి హిడ్మా మరణం అనేది భారత ప్రజానికేనికే కాదు అఖిల భారత స్థాయిలో ఆదివాసీ ఉద్యమానికి, ప్రపంచ విప్లవోద్యమానికి కూడా తీరని లోటుగా పోరాడే ప్రజలు గుర్తిస్తున్నారు. మొత్తంగా మారెడుమిల్లి అడవి అనేది ఇద్దరి కేంద్ర కమిటి నాయకుల హత్యలతో ప్రభుత్వం దోషిగా సమాజం ముందు నిలబడింది. కాబట్టి ఇప్పటికైన ప్రభుత్వం సాయుధ బలగాల అణచివేతలో ప్రజలను పరిపాలించడం ప్రజాస్వామ్యాన్ని కొనసాగించడం అనేది రాజ్యాంగబద్ద అంశాలుగా కావు, కాబట్టి రాజ్యాంగాన్ని గౌరవించడం ప్రభుత్వాలు నేర్చుకోవాలి, అమలు పర్చాలి, లేకపోతే ప్రజల్లో ఒక గొప్ప మారుపకు అవకాశం వాళ్ళే కల్పించినట్లవుతుంది.



**ఎన్ నారాయణరావు**
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
పౌర హక్కుల సంఘం

---

తెలంగాణ వర్సిటీ అధ్యాపకుల

# సమాన పనికి సమాన వేతనం ఎప్పుడు!




తెలంగాణ రాష్ట్రం విద్యా రంగం ప్రకాశవంతమైన పురోగతిని సాధిస్తున్న ప్పటికీ, అదే విద్యా ప్రపంచం వెనుక మరుగున పడిపోయిన ఒక లోతైన వేదన ఇంకా పరిష్కారం కాని గాయంగా మారింది. రాష్ట్రం లోని మొత్తం 12 విశ్వవిద్యాలయాల్లో 25 సంవత్సరాలుగా సేవ చేస్తున్న 1330 మంది ఒప్పంద అధ్యాపకులు, 800 మంది రోజువారీ వేతన బోధకులు ఈ విద్యా నిర్మాణానికి అడ్డస్తంభాలుగా నిలుస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ సొంత జీవితాలను త్యాగం చేస్తూ నిలబడిన ఈ గురువుల జీవితం మాత్రం అస్థిరత, ఆర్థిక ఇబ్బందులు, నిరాశతో నిండిపోయింది. ఒకే తరగతి గదిలో సమాన బోధన చేస్తున్నప్పటికీ వేతనాల్లో అపార తేడా ఉండటం వారి గుండెల్లో నిత్యబాధగా మారింది. సమాజం విద్యా వెలుగును అభినందిస్తూనే ఆ వెలుగు నింపుతున్న గురువుల జీవితాల్లోని చీకటిని చూడకుండా మౌనంగా మారడం మరింత బాధాకరం. విద్యా రంగం విస్తరిస్తున్నప్ప టికీ, ఈ గురువుల జీవితాలు మాత్రం స్థిరపడకపోవడం రాష్ట్ర అభివృద్ధికి మొండికాయలాగా మారింది.

తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం కొత్త విశ్వవిద్యాల యాలు ఏర్పడుతుండగా కాలేజీలు విస్తరించిపోతున్నాయి. విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం వల్ల విద్యా విప్లవం సాగుతోందని రాష్ట్రం చెప్పుకుంటోంది. సాంకేతిక పరిజ్ఞా నం విస్తరించడంతో ఆన్‌లైన్ బోధన పెరిగి, పరిశోధనలో కూడా రాష్ట్రం ముందంజలో ఉంది. అయితే ఈ విద్యా వెలుగుల వెనుక ఒక ఆవేదన నిండిన చీకటి నీడ కూడా పెరుగుతుంది ‌‌‌‌‌‌– అది వేలాదిమంది ఒప్పంద అధ్యాపకుల ఆగని జీవన పోరాటం.రోజువారీ ఖర్చులను తట్టుకోలేక పలువురు ఒప్పంద బోధకులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు మన మనస్సును మ్రింగేస్తాయి. స్థిరత్వం లేక నిరాశతో కొందరు ఉద్యోగాలు వదిలారు. ఇది ఉద్యోగ సమస్య మాత్రమే కాదు – గురువుల గౌరవాన్ని మన సమాజం ఎంత తక్కువ స్థాయిలో చూస్తుందో తెలిపే చేదు నిజం. విద్యార్థుల విజయం కోసం తమ జీవితాలను త్యాగం చేస్తున్న గురువుల కన్నీరు మన మౌనాన్ని చీల్చాలి. భారత సుప్రీంకోర్టు ఇచ్చిన "సమాన పనికి సమాన వేతనం" తీర్పు అనేక సంవత్సరాలుగా అమలు కాని తీర్పుగా ఉన్నది. ఒకే తరగతి గదిలో ఒకే బోధన చేస్తున్న ఇద్దరి మధ్య వేతనాల్లో విపరీతమైన తేడా రావడం విద్యా వ్యవస్థపై మచ్చ. గురువు గౌరవం గురించి మాట్లాడే మన సమాజం, వేతనాల విషయంలో మాత్రం మౌనం పాటించడం బాధాకరం.

ఈ సమస్యనికి విరుద్ధంగా దేశంలోని అనేక రాష్ట్రాలు తమ ఒప్పంద అధ్యాపకులను గౌరవించే విధానాలను అమలు చేస్తున్నాయి. ఉదాహరణకు కేరళలో గత 10 సంవత్స రాల్లో ఒప్పంద అధ్యాపకుల వేతనాల్లో సగటు 40% పెరుగుదల అమలు చేశారు. వార్షికంగా కనీసం 2 సార్లు వేతన పునఃసమీక్ష చేపట్టే విధానం అమల్లో ఉంది. కర్ణాటకలో గత 7 సంవత్సరాల్లో పనిచేసిన ఒప్పంద బోధకుల్లో 60% మందిని శాశ్వతీకరణ చేశారు. ఇది కేవలం పదవీ భద్రత మాత్రమే కాదు, వారి కుటుంబాలకు స్థిరమైన జీవనాధారాన్ని కల్పించే దీర్ఘకాలిక విధానం.

తమిళనాడులో విశ్వవిద్యాలయాల్లో పనిచేసే ఒప్పంద అధ్యాపకులకు కనీస భద్రత, పదోన్నతి అవకాశాలు మరియు గుర్తింపు పథకాలు లభిస్తున్నాయి. అక్కడ సుమారు 85% ఒప్పంద అధ్యాపకులు సంవత్సరానికి కనీసం ఒక శిక్షణా కార్యక్రమం ద్వారా నైపుణ్యాభివృద్ధి పొందుతున్నారు. మహారాష్ట్రలో ప్రతి 5 సంవత్సరాలకోసారి సేవా ధృవీకరణపత్రం అందించడం ద్వారా వారికి స్థిరత్వం కల్పిస్తున్నారు. ఢిల్లీలో మాత్రం గత 5 సంవత్సరాల్లో ఒప్పంద అధ్యాపకుల వేతనాల్లో 50% పెంపు చేసి వారిని స్థిరీకరణ దిశగా అడుగులు వేశారు.

ఓడిశాలో విశ్వవిద్యాలయాల్లో పనిచేసే ఒప్పంద అధ్యాపకులలో 70% మందికి రాష్ట్ర ప్రభుత్వం బోధన భత్యం, పరిశోధన భత్యం వంటి సౌకర్యాలు అందిస్తోంది. రాజస్థాన్ గత 4 సంవత్సరాల్లో ఒప్పంద అధ్యాపకుల సంఖ్యను తగ్గించి శాశ్వత నియామకాలను పెంచింది. మధ్యప్రదేశ్‌లో మాత్రం 3 దశల్లో శాశ్వత నియామకాలు పూర్తిచేసి విద్యా రంగంలో ఉన్న ఒత్తిడిని తగ్గించారు.

జాతీయ స్థాయిలో చూస్తే సుమారు 50% రాష్ట్రాలు ఒప్పంద అధ్యాపకుల సమస్యను దశలవారీగా పరిష్కరిస్తుండగా తెలంగాణ మాత్రం ఇరవై ఐదు సంవత్సరాలుగా సమస్యను పరిశీలన పేరుతో వాయిదాలు వేస్తూనే ఉంది. వేతనాలు పెరగకుండా, శాశ్వతీకరణ లేకుండా, సేవా భద్రత లేకపోవడంతో రాష్ట్రంలోని వేలాది మంది గురువులు ఆత్మన్యూనతతో బోధిస్తున్నారు.ఇది కేవలం ఉద్యోగ సమస్య కాదు ప్రభుత్వ సామాజిక బాధ్యత. విద్యను వెలిగించే ఈ గురువులను గౌరవించే బాధ్యత ప్రతి ప్రభుత్వానిదే. వీరికి తగిన గౌరవం, సముచిత వేతనం, శాశ్వత నియామకం లభిస్తేనే తెలంగాణ విద్యా సమానత్వాన్ని సాధించగలదు. అస్థిరమైన గురువు స్థిరమైన భవిష్యత్తు నిర్మించలేడు. గురువుల జీవితాలు బలపడితేనే విద్యా రంగం బలపడుతుంది.ప్రతి విద్యార్థి విజయానికి వెనుక ఒక గురువు ఉంటుంది. ప్రతి గురువు వెనుక ఒక సమర్థ ప్రభుత్వం నిలవాలి. విద్యా వెలుగులు నింపే ఈ బోధకుల జీవితాలు చీకటిలో ఉంటే మనం తెలంగాణ విద్యా గర్వం అని చెప్పుకోలేం. వారి కన్నీళ్ల ఎండినపుడే రాష్ట్రం విద్యకు నిజమైన విజయం లభిస్తుంది. గురువులకు న్యాయం చేస్తే అది అధ్యాపకుల గెలుపు మాత్రమే కాదు అది తెలంగాణ సమాజ గౌరవం గెలుపు. విద్యా వెలుగు ఎప్పటికీ ప్రకాశించాలంటే ఈ గురువుల జీవితాల్లోని చీకటిని తొలగించడం అత్యవసరం.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం.

---

# నా నవీన భారత స్వప్నాలు!

ఇవినా ఒక్కడివే కావు, నా లాంటి పౌరుల స్వప్నాలు కూడా. హై స్కూల్ విద్యలో లీనమైన రోజులు.. లోకమంటే తెలియని, అర్థం కాని సమయాల్లో కొన్ని స్వప్నాలుండేవి. వాటికి పునాదులిక్కడే పడ్డాయి. పరిసర ప్రాంతాలు, పెరిగిన వాతావరణం. నా చుట్టూ ఉన్న ప్రపంచం. కౌమార దశలో పలు రకాల ఆలోచనలకి జీవం పోసాయి. అందులో నేనూ, నువ్వూ అందరూ ఉంటారు. తక్షణం నెరవేరే స్వప్నాలు కొన్నైతే, దీర్ఘకాలికంగా ఉండేవి మరికొన్ని, మనం చూడనివీ, భవిష్యత్ తరాలు చూసేవి.. మరెన్నో ఉంటాయి. ఆనాటి బాల్యపు స్వప్నాల్లోని కొన్నింటిని ప్రస్తావిస్తున్నాను.

నేనూ, సగటు జీవి ఈ లోకంలో ఫినిక్స్ పక్షుల్లా స్వేచ్ఛగా విహరించాలి. సహచర మిత్రుల స్వప్నాలు ఫలించాలి. ఎలాంటి కుట్రలు కుతంత్రాల్లేని జీవితాలను పొందాలి. నాదైనా ముద్ర కూడా ఉండాలక్కడ అనుకునేవాడిని. చిరుప్రాయంలోనే అసమానతలను గుర్తించిన నేనూ, నా కుటుంబం, ఇతర కుటుంబాల శ్రమలను పరిశీలించాను. అందుకే శ్రమకు తగ్గ ఫలితముండాలి. ఒకరినొకరు దోపిడీ చేయని, కన్నీళ్లు లేని సమాజం ఒకటుండాలి అని బలంగా కోరుకున్నాను. అది సాధ్యమని విశ్వసించాను. కాస్త వివరంగా చెప్పాలంటే.. అప్పటికే లైబ్రరీకి వెళ్లి పుస్తక పఠనానికి అలవాటు పడిన నాలో కొత్త ఆలోచనలకి ఘర్షణ మొదలైంది. స్వాతంత్ర్య ఫలాలందరికీ అందాలి. విద్యా, ఉపాధి, ఉద్యోగం, సమానత్వం, అసమానతలు లేకుండా జీవించాలి. సంపద అందరికీ దక్కాలి. కుల, మత, ప్రాంతీయ వివక్షలు, హత్యలు, హత్యాచారాలు, దోపిడీ, దొంగతనాలు, నేరాలు లేని సమాజం ఏర్పడాలి. పౌర హక్కులకు రక్షణనుండాలి. లింగ సమానత్వం కావాలి. స్త్రీని పూజించే (గౌరవించే), అలాంటి సమాజం మనదై ఉండాలి. ఇలాంటి ఆలోచనలు ఈ చిన్ని గుండెను మెలిపెట్టేవి. ఇంటి ముందు రాత్రి వేళలో ఆకాశంలోకి చూస్తూ నక్షత్రాలను లెక్కిస్తూ దీర్ఘ ఆలోచనలు చేసేవాడిని. ఆ నక్షత్రాల వెలుగుల వెనుక ఎన్ని చీకట్లున్నాయో అర్థమయ్యేది కాదు. అలాంటి వెలుగులు శ్రామికుల కళ్ళల్లో చూడాలనుకునేవాన్ని.

దేశ విముక్తి కోసం తమ జీవితాలను ధారబోసిన యోధుల పాఠ్యాంశాలు చదివినప్పుడూ.. గుండె మునుపటి కంటే వేగంగా కొట్టుకునేది. వీళ్లంతా నా వాళ్లేనని ఫీలింగ్. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లాంటి అమరవీరుల కలలు సాకారం ఎందుకు కావడం లేదు అనే ప్రశ్న ఉదయించింది. ఆ మహోన్నతుల ఆశయాలు నెరవేరినప్పుడే మన స్వాతంత్ర్యానికి అర్థం పరమార్థం. తెల్ల దొరలు పోయి నల్ల దొరలొచ్చారు. పరిపాలనలోనూ, రాజ్యాంగ వ్యవస్థలోనూ, అభివృద్ధిలోనూ అన్నింటిలోనూ అణగారిన ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలి. శ్రామికుల చెమట రక్తం దేశ పురోభివృద్ధికి పునాదులేయాలి. ప్రతి గంటకు సగటున ఒక రైతు ఆత్మహత్య ఆవేదన కలిగిస్తుంది. రైతు ఆత్మహత్య అనే మాట వినని రోజుండాలి. రైతే రాజుగా విలసిల్లాలి. ఇటీవల కాలంలో 25 శాతం నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ దేశ యువ శక్తి సామర్థ్యాలు నిర్వీర్యం కాకుండా అంతరాల్లేని సమాజం కోసం జవసత్వం కావాలి.

ఇలాంటి ఆలోచనలతో ఆనాడున్న నేనూ, ఈ రోజుకీ అవే ఆలోచనలతో కొనసాగుతుండటం వింతేమి కాదు. ఆ ఆలోచనలు ఇంకా పరిపక్వం చెందాయి. రాజ్యాంగ పీఠిక ఇప్పుడూ రణ నినాదం అవుతుంది. ఎర్రజెండాను సమున్నతంగా నిలిపిన వేలాదిమంది అమరత్వం, కొనసాగించిన యుద్ధం, వారి త్యాగాలు ఇంకా సజీవంగా ఉన్నాయి. దేశ విముక్తి కోసం వివిధ మార్గాల్లో ఈ భూమి పుత్రులు తమ యుద్ధాన్ని నడుపుతున్నారు. రాజ్యాంగ పరిధిలోనూ, రాజ్యాంగయేతరంగా పనిచేస్తున్న విప్లవాత్మక శక్తులున్నాయి. పేరుకే ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. నిరంకుశత్వం పోయి ప్రజాస్వామ్య వాతావరణం ఏర్పడాలి. ఆనాడు భగత్ సింగ్ స్ఫూర్తితో కొనసాగిన తరం ఉంది. నేడు చారు మజుందార్ విప్లవోద్యమ వారసులుగా నడుస్తున్న తరం కండ్లేదుటే ఉంది.

నాటి ఆదిమ సమాజం నుంచి నేటి ఆధునిక సమాజం వరకూ నా స్వప్నాలని ఈ మానవ సమాజం మోసుకొస్తుంది. ఆ స్వప్నాలకి గతముంది, వర్తమానం ఉంది, భవిష్యత్తు ఉంటుంది. ఈ సమాజం ఉన్నంత వరకూ, దోపిడీ పీడన, అసమానతలు ఉన్నంత వరకూ నా స్వప్నాలు పునర్జీవం పొందుతూ ఉంటాయి. గత చరిత్ర అంతా వర్గ పోరాటాలమయమే అన్నది వాస్తవిక చరిత్ర. సంపూర్ణమైన వ్యవస్థను సృష్టించేది మానవ శక్తియే. కనిపించని దైవత్వమేదో దీనికి పూనుకోదు. నేనిప్పుడు ప్రమాదంలో ఉన్నాను. నా స్వప్నాలు సైతం పెద్ద సునామీ లాంటి విపత్తులను ఎదుర్కొంటున్నాయి. నేను నా మాయి ముంతను నిరూపించుకోవాల్సి వస్తోంది. ఏంటి దుస్థితి ? పౌర సమాజం తన పౌరసత్వాన్ని శీల పరీక్షగా ఎదుర్కొంటుంది. ఓటరు సవరణ పౌరుల పౌరసత్వాన్ని నిర్ధారిస్తుందట! నువ్వు ఓటేస్తావు, ఫలితం ఈసీ నిర్ణయిస్తుందట? ఇప్పుడూ నా సహచరులు, ఈ భూమిపుత్రులు శరణార్థులుగా మారుతున్నారు. అంతర్జాతీయంగా భారత ప్రతిష్ఠ మసక బారుతుంది. ఫాసిస్టుల పడగ నీడలో బిక్కు బిక్కు మంటున్న దీనస్థితి ఏం చెబుతోంది. పౌర సమాజం మత రాజకీయాన్ని తిరస్కరించకుంటే మానవ హననం తప్పదు.

ఆకలి సూచిలో 105వ స్థానం. కనీసం రెండు పూటలు తిండి దొరకని పౌరులు కోట్ల మంది ఉన్నారు. గత పదేళ్ళలో నూతనంగా 25 కోట్ల మంది కడుపేదరికంలోకి నెట్టివేయబడ్డారు. 80 కోట్ల మంది ప్రజానీకం రేషన్ బియ్యంపై ఆధారపడి ఉన్నారంటే నేటి భారతం ఎలా వర్ధిల్లుతుందో అర్థం కానిది కాదు. కోటీశ్వరుల సంఖ్య గత నాలుగేళ్లలో 445 శాతం పెరిగింది అనేది ఓ నివేదిక సారాంశం. ఒకవైపు పేదరికం తీవ్రమవుతుండగా మరోవైపు కోటీశ్వరుల సంఖ్య పెరుగుతుంది. రాజ్య ప్రభువులుగా ఎవరున్నప్పటికీ దేశాన్ని నడిపించేది కుబేరులే అన్నది నగ్నసత్యం. ఆదానీ – అంబానీ లాంటి పెట్టుబడిదారులు సగటు మనిషి జీవితాన్ని శాసిస్తున్నారు. మనలా పాలిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న ఆధునిక భారతం వెలుగుల నుంచి చీకట్లోకి పయనిస్తుంది కదూ! అదిగో.. నువ్వు తినే తిండిపై, నేను కట్టే బట్టపై, నడవడిక పై నిఘా ఉంది. నీ ఆలోచనలని, నా ఆలోచనల్ని నియంత్రిస్తున్నదెవరు? ప్రసార సాధనాలు సైతం ఎవరి వైపున ఉన్నాయి? ఎవరి ప్రయోజనాలు కాపాడుతున్నాయి! పౌర సమాజం తప్పక ఆలోచించాలి. వేల ఏండ్లుగా తోటి మనిషి అంటరాని వాడైండు. గుర్తింపు నోచుకోని కాందిశీకుడు ఈ నేల మూలవాసి. మరొక మాట ఇప్పటి వరకూ ఉన్న కార్మిక చట్టాలన్నీ ఖననం చేయబడ్డాయి. కార్మికల శ్రమ దోపిడీకి నాలుగు లేబర్ కోడ్లు ఊపిరి పోసుకున్నయి. ఇక కార్మికుడి ఊపిరి తీయడమే రాజ్యం ఇచ్చే న్యాయం.

చివరగా.. ఒకరి మరణంతో స్వప్నాలు అంతం కావు, నిర్జీవం కావు, వాటికి చివరి రోజూ, మరుసటి రోజంటూ ఉండదు. ఈ భారత సమాజం ఉన్నంతకాలం చిరంజీవులుగా ఉంటాయి. తిరుగుబాట్లు, విప్లవాలు మొదలవుతాయి, నా నవీన భారత స్వప్నాలకు రెక్కలొస్తాయి. ఈ నేలను ఆవహిస్తాయి. మట్టి పొరల్లోంచి ఉద్భవించి నవ లోకానికి దారులేస్తాయి. నవ సమాజ భారతంలో అందరూ సమానమే అవుతారు. అందరికీ కూడు, గూడు, విద్యా, వైద్యం అన్ని వసతులు దొరుకుతాయి. ప్రేమ తత్వ జీవితం, దుఃఖ పెట్టని సమ సమాజం ఒకటి ఆవిర్భవిస్తది. అక్కడ రాజ్యం శ్రామిక రాజ్యంగా రూపు దిద్దుకుంటాది. శ్రామిక జనవాళికి దాసోహం అవుతాది. అలా.. అలా... నాలాంటి పౌరుల స్వప్నాలు, భారత అమరవీరుల కలలు అక్కడ ఫలిస్తాయి. ఆ రోజు కోసం యావత్ భారత్ ఎదురుచూస్తోంది!




**మామిండ్ల రమేష్ రాజా**
రాష్ట్ర కార్యదర్శి
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, తెలంగాణ
78932 30218

---

" పాము చావదు –కట్టె విరుగదు

# ఇదేం తీర్పు?



గవర్నర్ల అధికారాలు –రాజ్యాంగ స్పష్టతకా!, రాజకీయ చేష్టలకా?: సుప్రీంకోర్టు తీర్పు యూటర్న్ తీసుకోవడం దేనికి సంకేతం? ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు దేశంలోని రాజకీయ, న్యాయ నిపుణుల్లో తీవ్ర చర్చను రేకెత్తించింది. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు, రాష్ట్రపతి తీసుకునే నిర్ణయాలకు నిర్దిష్ట కాలపరిమితి విధించలేమని సుప్రీంకోర్టు తీర్పు నిచ్చారు. ఈ తీర్పు రాజ్యాంగంలోని నిబంధనలకు అనుగుణంగా ఉన్నట్టు కనిపించినా, దాని రాజకీయ పరిణామాలు గంభీరమైనవిగా!.రాజకీయ వత్తిడికి లోనైన యూటర్న్ తీర్పుగా ప్రజల్లో అనుమానాలను రేకిత్తుస్తున్నాయి.

**రాజ్యాంగ స్థితి నేపథ్యం:**
రాజ్యాంగం ప్రకారం, రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లును గవర్నర్ ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపవచ్చు. అయితే, ఈ నిర్ణయం తీసుకోవడానికి ఎటువంటి కాలపరిమితి రాజ్యాంగంలో నిర్దేశించ లేదు. ఇదే రాజ్యాంగ శూన్యత (కానిస్ట్యూషనల్ వ్యాక్యూం) ను సుప్రీంకోర్టు తన తీర్పులో సూచించింది.

**కానీ ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది:**
రాజ్యాంగంలో నిర్దేశించని ప్రతి అంశంలోనూ కార్యాచరణ విధానాన్ని న్యాయవ్యవస్థ నిర్దేశించకూడదా? ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో సమయపాలన ఎంతో అవసరం?

**తీర్పుల మార్పిడి: న్యాయ స్థిరత్వంపై ప్రశ్నార్థకాలు:**
2023 నవంబర్ 20న సుప్రీంకోర్టు తీర్పుకు ముందు, 2022 ఏప్రిల్ 8న మరో తీర్పులో సుప్రీంకోర్టే భిన్నమైన స్థితిని తీసుకుంది. ఆ తీర్పులో, రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని నిర్దేశించారు. ఈ రెండు తీర్పుల మధ్య ఉన్న విరోధాభాసం న్యాయవ్యవస్థ అస్థిరత్వం పై (ఊగిసలాట పై) ప్రశ్నలను లేవనెత్తింది.
న్యాయవ్యవస్థలో ఇటువంటి "యు–టర్న్లు" ప్రజల్లో న్యాయం పట్ల ఉన్న విశ్వాసాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి? ఒకే అంశంపై వేర్వేరు సమయాల్లో వేర్వేరు తీర్పులు వెలువడటం న్యాయ వ్యవస్థ యొక్క స్థిరత్వానికి, ప్రజల విశ్వాసం ,నమ్మకానికి భంగకరం కాదా?

**రాజకీయ దుర్వినియోగం: చారిత్రక నేపథ్యం:**
గవర్నర్ పదవి రాజకీయంగా దుర్వినియోగం చేయబడుతున్న ప్రశ్న కొత్తది కాదు. 1960ల నుంచే ప్రతిపక్ష పార్టీలు పాలనలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా ప్రవర్తించడం సాధారణమైంది. ప్రస్తుతం ఈ సమస్య మరింత తీవ్రమైంది.తమిళనాడులో, రాష్ట్ర శాసనసభ ఆమోదించిన అనేక బిల్లులు గవర్నర్ ఆమోదం కోసం చాలా కాలం పాటు నిలిపి వేయబడ్డాయి. ఇదే పరిస్థితి కేరళలోనూ ఉండడం విశేషం. ఈ రాష్ట్రాలు తమ హక్కుల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించవలసి వచ్చింది.

**ప్రజాస్వామ్య సూత్రాలపై దాడి:**
ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ అధికారం. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు శాసనసభలో ఆమోదించిన బిల్లులను, కేంద్ర ప్రభుత్వం నియమించిన గవర్నర్ నిర్ణయం తీసుకోవడానికి ఎంత కాలం అయినా పక్కకు పెట్టవచ్చు... అనే దుస్థితి ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం.
గవర్నర్, రాష్ట్రపతి కేవలం రాజ్యాంగ ప్రతినిధులు (ట్యుటరీ హెడ్స్) మాత్రమే, నిజమైన ప్రజా ప్రతినిధులు (రియల్ ఎక్జిక్యూటివ్స్) కారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు (పార్లమెంటు/రాష్ట్ర శాసనసభ) ఆమోదించిన బిల్లులను ఏకపక్షంగా ఆమోదించకపోవడం లేదా నిలిపి వేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే.

**న్యాయవ్యవస్థపై ఒత్తిడులు /బెదిరింపులు ఉన్నాయా!?**
మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి తీర్పుపై వివరణ ఇస్తూ, రాజ్యాంగంలో కాలపరిమితి నిర్దేశించబడలేదని సూచించారు. కానీ, రాజ్యాంగంలో నిర్దేశించబడని అనేక అంశాల్లో న్యాయవ్యవస్థ తన అధికారాన్ని ఉపయోగించి మార్గదర్శకాలను నిర్దేశిస్తుంది.
పదవీ విరమణ చివరి రోజుల్లో ప్రధాన న్యాయమూర్తి తీర్పులో మార్పు తెచ్చిన ఈ విషయం, న్యాయవ్యవస్థపై ప్రభుత్వ ఒత్తిడుల గురించి అనుమానాలను రేకెత్తించింది. న్యాయవ్యవస్థ స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయడం ప్రజాస్వామ్యానికి అత్యంత అవసరం.

**పజాస్వామ్యానికి రక్షణ అవసరం:**
సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం సరైనది కావచ్చు, కానీ అది రాజకీయంగా దుర్వినియోగానికి దారి తీస్తుందేమోనన్న భయం మేధావుల్లో, న్యాయ నిపుణుల్లో ఉంది. రాష్ట్రాల హక్కులు, ప్రజాస్వామ్య ప్రక్రియలను రక్షించడం న్యాయవ్యవస్థ యొక్క ప్రాథమిక బాధ్యత.
రాజ్యాంగంలో నిర్దేశించబడని అంశాల్లో కూడా, ప్రజాస్వామ్య సూత్రాలు, సమ న్యాయపాలన, న్యాయం/ ధర్మం వంటి మూలభూత అంశాలను పరిగణనలోకి తీసుకోవడం అవసరం. గవర్నర్ల అధికారాలు రాజకీయ ఆయుధంగా మారకుండా చూసుకోవడానికి రాజ్యాంగ సవరణ ద్వారా కాలపరిమితిని నిర్దేశించడం లేదా న్యాయవ్యవస్థ తన అధికారంను ఉపయోగించి మార్గదర్శకాలను నిర్దేశించడం అత్యవసరం. ప్రజాస్వామ్యం అంటే కేవలం నియమాలు మాత్రమే కాదు,అంతకు మించి , ఆ నియమాల వెనుక ఉన్న రాజ్యాంగ ఆదర్శాలు, ప్రజాస్వామ్య సూత్రాలు కూడా. ఈ సూత్రాలు రక్షించబడాలి, లేకుంటే ప్రజాస్వామ్యం అర్థరహితమై, బలవంతుని మెజారిటీ,కార్య నిర్వాహక ఆధిపత్య పాలనగా మారి పోతుంది. రాజ్యాంగం ప్రకారం శాసన నిర్మాణ శాఖ,కార్య నిర్వాహక శాఖ, న్యాయ శాఖ పరస్పర సహకారంతో , "చెక్స్ అండ్ బ్యాలెన్స్"పద్ధతుల్లో భారత రాజ్యాంగం ఉన్నత స్థాయిని, ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద, గణతంత్ర విలువలతో ప్రజాస్వామిక పద్ధతుల్లో దేశ ప్రజలందరికి స్వేచ్ఛ, సమానత్వం, సహుభ్రాతృత్వం, న్యాయం దక్కట మే మనం రూపొందించుకున్న, మనకు...
మనమే అంకితం చేసుకున్న భారత రాజ్యాంగం యొక్క సార్థకతను, విలువను కాపాడి నట్లు.



**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
9849328496.

# రాజ్యాంగ పీటికలు, ప్రాథమిక హక్కులను కాపాడాలి



**యాలాల్, నవంబర్ 26 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా యాలాల మండల కేంద్రం లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు రాజ్యాంగ పీటికను చదివిస్తూ ప్రమాణం చేయిస్తు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల గురించి కేవీపీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ దేశంలో భారత రాజ్యాంగం మరియు మహనీయుల జీవితాన్ని భారతదేశ స్వతంత్ర పోరాటం చరిత్రపట్ల, చదువుకున్న ప్రతీ విద్యార్థులకు,విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించడంతో పాటు కేరళ తరహా పాఠ్యాంశ రూపకంగానే బోధించాలి అన్నారు.గత మూడు సంవత్సరాలుగా దేశంలో ఉన్న ప్రతి భారతీయ పౌరుడికి ప్రాథమికమైన హక్కులను కాపాడడం కంటే హరించే పరిస్థితి ఎక్కువగా ఉన్నదని, అలాగే భారత రాజ్యాంగంలో కల్పించిన 14వ అధికరణం ప్రకారం ఎలాంటి కులం,మతం,ప్రాంతం, భేదాలను లేకుండా చూడాల్సిన రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలనే ఆలోచనతో ఉన్నాయని పురాతన కాలమైన మనుధర్మ పరిపాలించిన రాజ్యాంగాన్ని అమలు చేసే ప్రజల పద్ధతులు మధ్య ప్రాంతం పేరుతో,మతం పేరుతో,అత్యాచారాలు దాడులు దౌర్జన్యాలు అనునిత్యం,వైశాల్యలను తీసుకొస్తున్నారని భారత రాజ్యాంగం మార్చాలని ఆలోచనలు చేస్తున్నారు.లేకుంటే మనిషిని మనిషిగా చూడలేని పరిస్థితిలో ఎదురవుతాయి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అందుకని విద్యావంతులు మేధావులు భారత రాజ్యాంగం పట్ల సరైన అవగాహన కల్పించడంలో ముందు బాగాన ఉండాలని తెలుపుతూ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పల్లె శ్రీనివాస్,నరేందర్, బొక్కెని బాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి

- దళిత సంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం

**వికారాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 26 (జనం సాక్షి) :** రాజ్యాంగ దినోత్సవం వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లిలో అంబేద్కర్ విగ్రహం దగ్గర దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘ నాయకులు మాట్లాడుతూ 1949 నవంబర్ 26 నాడు రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించిందని జనవరి 26 1950 అమల్లోకి వచ్చిందని 2015 సంవత్సరంలో విజిట్ నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నవంబర్ 26 ను రాజ్యాంగ దినోత్సవం గా ప్రకటించిందని వరన్నారు. రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని అప్పుడే విద్యార్థి దశ నుంచి ప్రతి పౌరునికి రాజ్యాంగంపై పూర్తి అవగాహన పెరిగి దేశ శ్రేయస్సు కోసం మానవ విలువల కోసం సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తారని వారన్నారు. సమాజంలో ప్రతి పౌరునికి గౌరవాన్ని పెంచింది రాజ్యాంగమేనని పౌరున్ని పాలకుల్ని చేస్తుందని రాజ్యాంగ నిర్మాణం వలన దేశం ప్రశాంతంగా ఉన్నదని ఏ దేశంలో లేనటువంటి గణనీయమైన రాజ్యాంగం మన దేశంలోనే ఉండడం గర్వకారణమని వారు కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 60 దేశాల రాజ్యాంగాలు చదివి భారత దేశ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని తయారు



చేశారని ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగం మనదేనని ప్రభుత్వాలకు దిశానిర్దేశం చూసేది రాజ్యాంగమేనని సామాజిక న్యాయ స్వేచ్ఛ సమానత్వం రాజ్యాంగం ద్వారానే అందుబాటులోకి వచ్చాయని వారన్నారు. అంబేద్కర్ ఆశయాల కనుగుణంగా ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని చదివి రాజ్యాంగ రక్షణ కోసం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి. రాంచందర్, జర్నలిస్ట్ తంగడపల్లి ఆనంద్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రవీందర్, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఆర్ మహిపాల్, మహనీయుల ఉత్సవాల కార్యదర్శి బి నర్సింలు, బి రవీందర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నవీన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై సతీష్, మాల మహానాడు జిల్లా కోశాధికారి రత్నం, డి.ఎస్.పి నాయకులు మల్లికార్జున్, సిఐటియు నాయకులు చంద్రయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## నిఘా నేత్రాలతోనే నేరాల నియంత్రణ



**తలకొండపల్లి, నవంబర్ 26 (జనంసాక్షి) :** నిఘా నేత్రాలతోనే నేరాలను పూర్తిగా అరికట్టవచ్చని తలకొండపల్లి ఎస్సై కే.శేఖర్ అన్నారు. బుధవారం తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేయాలని బండేలా ప్రవీణ్ కుమార్ రెడ్డి రూ,10 వేలు,ఎన్నెడ్ల రాఘవేందర్ రెడ్డి(పోలీస్ హెడ్ కానిస్టేబుల్) రూ. 5 వేలు ఎస్సై కె. శేఖర్,కు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..నేరాలను నియంత్రించడంతోపాటు,నేరస్తులను త్వరగా గుర్తించడానికి సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని అన్నారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామంలో ఉన్న పెద్దలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏ ఎస్సై విష్ణువర్ధన్ రెడ్డి,కానిస్టేబుల్ జాషువా, శ్రీనివాస్,చంద్రధన శ్రీకాంత్ రెడ్డి,రమేష్, శివాజీ,సత్తయ్య,సుభాష్,తదితరులు ఉన్నారు.

## యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



**తలకొండపల్లి, నవంబర్ 26 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా యువత స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి అన్నారు.బుధవారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రకాష్ గౌడ్ మణికంఠ ఫ్లెక్స్ అండ్ డిజైనింగ్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువత ప్రైవేట్ రంగాల్లో అంది వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ మిట్టపల్లి అంజయ్య గుప్తా,పవన్ వాల్మీకి,గౌస్,ఇంద్రకంటి మల్లేష్,అంతారం రాములు,తదితరులు ఉన్నారు.

# ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



**మల్కాజిగిరి నవంబర్ 26 (జనం సాక్షి) :** ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు విరాళాలు అందజేసి భాగస్వాములు కావాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని న్యూ వెంకటేశ్వర నగర్‌లో కట్ట మైసమ్మ ఆలయంలో బుధవారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి 10000 రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి తోపాటు తాను కూడా తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, నర్సింగ్ రావు, సిద్ధిరాములు అశోక్, రాజా ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, రమేష్, ఆర్ ప్రవీణ్, శ్రీనివాస్, రమేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ముందుకు నడిపిస్తున్న పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం



**చేవెళ్ల, నవంబరు 26 (జనంసాక్షి) :** ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని ముందుకు నడిపిస్తున్న పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం అని బీజేపీ చేవెళ్ల మునిసిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి. బిజెపి జిల్లా సీనియర్ నాయకులు కుంచం శ్రీనివాస్ గుప్తా, జిల్లా యువ నాయకుడు డా.వైభవ్ రెడ్డి తెలిపారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని ముందుకు నడిపిస్తున్న పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 సంవత్సరాల ఈ సందర్భంగాచేవెళ్ల పట్టణ కేంద్రంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం పూలమాలలు ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకి ప్రాణం పోసిన రాజ్యాంగ ముసాయిదా చేపట్టిన చారిత్రాత్మక దినం, జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ని స్మరించుకుంటూ వారికి ఘన నివాళి అర్పిస్తున్నాంఅన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలో మనం రూపొందించుకున్న భారత రాజ్యాంగం, ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలకే దిక్సూచి అవడంలో సందేహం లేదని స్పష్టం చేశారు. భారతదేశంలో ఎన్నో మతాలు, కులాలు, జాతులు కలిసి మనుగడ సాగిస్తున్నాయంటే అది మన రాజ్యాంగం గొప్పతనమే అని తెలిపారు. అంతటి మహత్తరమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన డాక్టర్ అంబేద్కర్ గొప్ప మేధావి అని అన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభసందర్భంలో రాజ్యాంగ నిర్మాతలైన బి.ఆర్.అంబేద్కర్, న్యాయ కోవిదులు, రాజ్యాంగ నిపుణులు, స్వాతంత్ర సమరయోధుల సేవలను స్మరించుకోవడం మన కర్తవ్యం తెలిపారు. దేశంలో భారత రాజ్యాంగం ఆమోదించబడి 75 సంవత్సరాల భారత రాజ్యాంగం పూర్తి స్థాయిలో అమలు చెడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భారత రాజ్యాంగం ఎంతో గొప్పది అని 140 కోట్ల జనాభాకు ప్రజాస్వామ్యం అందించింది అని, భిన్నత్వంలో ఏకత్వం మన రాజ్యాంగం అని అన్నారు. ప్రాథమిక హక్కులు, లౌకిక వాదం మనకు రాజ్యాంగం నుంచి కల్పించబడ్డాయి. మన రాజ్యాంగం ఎన్నో దేశాలకు ఆదర్శమన్నారు. పౌరుల కోసం ఎన్నో హక్కులు కల్పించింది. అన్ని మతాలను ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం ఉన్న మనదేశంలో భిన్నత్వంలో ఏకత్వం, ప్రజల హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్యస్ఫూర్తిని కాపాడడంలో భారత రాజ్యాంగందే కీలక పాత్ర పోషస్తుంది అని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీనివాస్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి



**మల్కాజిగిరి, నవంబర్ 26 (జనం సాక్షి) :** భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మల్లికార్జున నగర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, నర్సింగ్ రావు, సిద్ధిరాములు, నరహరి రావు, కాలనీవాసులు అంబేద్కర్ సంఘాల నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



**మల్కాజిగిరి, నవంబర్ 26 (జనం సాక్షి) :** ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు విరాళాలు అందజేసి భాగస్వాములు కావాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని న్యూ వెంకటేశ్వర నగర్ లో కట్ట మైసమ్మ ఆలయంలో బుధవారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి 10000 రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి తోపాటు తాను కూడా తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, నర్సింగ్ రావు, సిద్ధిరాములు అశోక్, రాజా ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, రమేష్, ఆర్ ప్రవీణ్, శ్రీనివాస్, రమేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి స్కూల్లో రాజ్యాంగ దినోత్సవం

**చేవెళ్ల, నవంబరు 26 (జనంసాక్షి) :** రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి బలమైన స్థిరస్థంభం అని సంస్కృతి స్కూల్ ప్రిన్సిపాల్ రెహానా పేర్కొన్నారు. చేవెళ్ల మున్సిపల్ పామెన వార్డులోని సంస్కృతి స్కూల్లో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రెహానా పాఠశాల విద్యార్థులకు రాజ్యాంగ నిర్మాణ చరిత్రను వివరించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలో దాదాపు మూడు సంవత్సరాలపాటు సాగిన రాజ్యాంగ రూపకల్పన ప్రక్రియ చివరకు 1949 నవంబర్ 26న పూర్తై, 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన విషయాన్ని విద్యార్థులకు తెలియజేశారు. అంబేద్కర్ దూరదృష్టితో రూపొందించిన భారత రాజ్యాంగం సమాన హక్కులు, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సోదరభావానికి పునాది వేసిందని ఆమె తెలిపారు. పౌర హక్కులతో పాటు కర్తవ్యాలను కూడా పాటించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని రెహానా విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో పౌర జాగృతి పెంపొందించే లక్ష్యంతో చట్టపాలన, సమాజంలో బాధ్యతాయుత ప్రవర్తన,



దేశ ఆస్తుల సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలను ప్రసంగాలకు ఆహ్వానించి, రాజ్యాంగ దినోత్సవం నేపథ్యంపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేసేలా అవకాశం కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- రాష్ట్ర మంత్రివర్యులు సీతక్కను కలిసిన గుజ్జుల మహేష్

**కడ్తాల్, నవంబర్ 26 (జనంసాక్షి) :** శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి వెళ్తున్న తెలంగాణ పంచాయితీరాజ్,గ్రామీణ అభివృద్ధి,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు అనసూయ సీతక్కను కడ్తాల్ మండల కేంద్రంలో తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్,కాంగ్రెస్ నాయకులు సాధారంగా ఆహ్వానించి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు సీతక్క కాంగ్రెస్ నాయకులతో కాసేపు ముచ్చటించారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి,త్వరలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా



నాయకులు పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆసిఫ్ అలీ,మండల ఎస్సి సెల్ అధ్యక్షులు చెన్నకేశవులు,పోతుగంటి అశోక్,మాజీ సర్పంచ్ రఘుపతి, గ్రామ పెద్దలు వెంకట్,రాజి రెడ్డి,శ్రీశైలం గౌడ్,నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి శ్రీచైతన్యలో ఘనంగా 'సోషల్ వీక్' కార్యక్రమం

శేరిలింగంపల్లి, నవంబర్ 26 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి శ్రీచైతన్య పాఠశాలలో సోషల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఆయా రాష్ట్రాల వేషధారణ, సంస్కృతి సాంప్రదాయాల విశిష్టతను ప్రతిబింబించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి తోడు నవంబర్ 26 భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయవాదం ప్రతిబింబించేలా, దేశ ఔన్నత్యాన్ని చాటేలా అనేక నినాదాలను విద్యార్థులు నినదిస్తూ పాఠశాల పరిసర ప్రాంతాలలోని పురవీధులలో సంచరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రిన్సిపల్ కె. వాణి ప్రసాద్ మాట్లాడుతూ... నేటి విద్యార్థులే రేపటి పౌరులని, భావి భారత విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ప్రతి పాఠశాల పైన ఉందని, ఆ దిశగా విధిగా ప్రత్యేక కార్యక్రమాలను కొనసాగిస్తూ విద్యార్థులలో నైతిక విలువల పెంపునకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తమ పాఠశాల పరిధిలో కూడా అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని, భవిష్యత్తులో దేశం రక్షణ కోసం, సార్వభౌమత్వం కోసం ప్రతి పిల్లవాడు కృషి చేయడానికి దేశభక్తి



సహిత కార్యక్రమాలను రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఏజీఎం శివరామకృష్ణ, ప్రాంతీయ ఇన్చార్జి హరికృష్ణ, జోనల్ ఇన్చార్జ్ మంగ వేణి, ప్రాథమిక పాఠశాల ఇన్చార్జి మాధవి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లిలో పిస్తా హౌజ్ ప్రారంభం

**శంకర్‌పల్లి, నవంబర్ 26 (జనం సాక్షి) :** ప్రారంభోత్సవం ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు కాలే యాదయ్య,రాంమోహన్ రెడ్డి,మనోహర్ రెడ్డి చేతుల మీదుగా పిస్తా హౌజ్ ప్రారంభం. బుధవారం శంకర్ పల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పిస్తా హౌస్ ను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పిస్తా హౌస్ ఫౌండర్ ఎండీ అబ్దుల్ మజీద్ తొ కలిసి ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రోజు రోజుకు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న శంకరపల్లి పట్టణంలో అంతర్జాతీయంగా పేరున్న సంస్థలు ముందుకు రావడం అభిందయం అని అన్నారు.ఈసందర్భంగా పిస్తా హౌస్ శంకర్ పల్లి బ్రాంచ్ ఏర్పాటు చేసిన క్రిష్ణ రెడ్డి,అభినవ్ రెడ్డి, నితీష్ రెడ్డి,రాకేష్ లకు అభినందనలు తెలిపారు.భారత దేశంతో పాటు ఇతర దేశాల్లో శాఖలు ఉన్న పిస్తా హౌస్ తమ నూతన బ్రాంచ్ శంకర్ పల్లిలో ఏర్పాటు చేయటం గొప్ప విషయం అన్నారు.శంకర్ పల్లి ప్రాంతంలో ఇప్పటికే బ్రాండెడ్ షాప్ లతో పాటు అనేక సంస్థలు వస్తున్నాయని అన్నారు.పిస్తా హౌస్ హలీం కు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని వారు గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చేర్మెన్ కాశెట్టి



చంద్రమోహన్,సోసైటీ చేర్మెన్ బద్దం శశిధర్ రెడ్డి,మండల బీఆర్ఎస్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజె, అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా,మాజీ మార్కెట్ చైర్మన్ ప్రకాష్ గుప్తా,మున్సిపల్ కౌన్సిలర్ చంద్రమౌళి, నరసింహ్మా రెడ్డి, లింగారెడ్డి,మైనారిటీ నాయకులు రఫీయొద్దీన్,బాబా, వసియొద్దీన్, సమీయొద్దీన్, ఫసియొద్దీన్, రజాక్, తదితరులు పాల్గొన్నారు.


# కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే అభ్యర్థుల ఎంపిక

- పార్టీకి ద్రోహం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి
- అభివృద్ధి మనది ప్రారంభం కాంగ్రెస్ పార్టీది.ఓట్ల కోసమే మహిళలకు చీరలు.
- మెజారిటీ సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకోవాలి



**వనపర్తి బ్యూరో, నవంబర్ 26 (జనం సాక్షి) :** బీఆర్ఎస్ కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థుల ఎంపిక చేయాలని, పార్టీకి ద్రోహం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యములో జిల్లా పార్టీ కార్యాలయంలో సర్పంచ్ ఎన్నికల సన్నాహక సమావేశం,దీక్షా దివాస్ ఏర్పాట్ల గూర్చి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి మనది, ప్రారంభం కాంగ్రెస్ పార్టీది. ఓట్ల కోసమే మహిళలకు చీరలు పంచుతున్నారని విమర్శించారు. జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవడానికి ప్రయత్నం చేస్తుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో 42 శాతం బి.సిలకు రిజర్వేషన్లు కల్పిస్తామని, ఆశలు కల్పించి బి.సిలకు నమ్మకద్రోహం చేసిందని, మొత్తంగా బిసిలకు 17శాతం రిజర్వేషన్లు ఇచ్చిందని కొన్ని జిల్లాలలో బి. సిలకు 3 నుంచి 4శాతం రిజర్వేషన్లు అమలు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు కె.సి.ఆర్ హయాములో జరిగిన అభివృద్ధి వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో విఫలమైన విషయాలను స్పష్టంగా వివరించాలని కోరారు. ప్రతి ఓటరును కలసి మహిళకు 2500,వృద్ధులకు 4000పించన్లు,రైతులకు బోనస్, రైతు భరోసా రైతు రుణ మాఫీ,నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు,తులం బంగారం, కె.సి.ఆర్ కిట్టు,ఆటో కార్మికులకు 15000,నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రావడం లేదని ప్రజలకు గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలపట్ల పోరాటం చేస్తున్న నాయకులను అభ్యర్థులుగా ఎంపిక చేయాలని కార్యకర్తల అభిప్రాయం మేరకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని అన్నారు. మహిళకు చీరలు ఇచ్చి ఓటు వేయాలని ప్రభుత్వం అడుగుతుందని ఇట్టి మోసపూర్త మాటలు నమ్మొద్దని హామీలు అమలు చేయాలని కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు.దీక్షా దివాస్ ఘనంగా నిర్వహించాలి. కె.సి.ఆర్ ప్రాణాలు ఫణంగా పట్టి దీక్ష పూనుకున్న 29 నవంబర్ రోజు దీక్షా దివాస్ ఘనంగా నిర్వహించాలి అని తెలంగాణ రాక ముందు జరిగిన ఉద్యమం కె.సి.ఆర్ రాష్ట్రాన్ని సాధించిన విషయాలను ప్రజలకు,నవ యువకులకు తెలిపే విధంగా వేడుకలు ఉండాలని కోరారు.దీక్షా దివాస్ స్ఫూర్తితో స్థానిక సమరానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ గారికి సమావేశంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమములో గట్టు యాదవ్, నాగం తిరుపతి రెడ్డి, వాకిటి శ్రీధర్, కురుమూర్తి యాదవ్, నందిమల్ల అశోక్, పి.రమేష్ గౌడ్, కె.మాణిక్యం, వనం.రాములు, వేణు యాదవ్, వెంకటస్వామి, బి.బాలరాజు, రాళ్ళ. కృష్ణయ్య, మాజీ ప్రజాప్రతినిధులు కృష్ణా నాయక్, రఘుపతి రెడ్డి, సామ్యా నాయక్, కర్రీ స్వామి, దిలీప్ రెడ్డి, సేనాపతి, గంధం పరంజ్యోతి, మాజీ కౌన్సిలర్స్ నాగన్న యాదవ్, కంచ.రవి, ప్రేమ్ నాథ్ రెడ్డి, గులాం ఖాదర్, ఖాన్, స్టార్.రహీమ్, జాత్రు నాయక్, షేక్ జహంగీర్, దేవర్ల నరసింహా, జోహెబ్ హుస్సేన్, చిట్యాల.రాము, చెన్నారం, రమేష్, సాయి యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళిత మేస్త్రీపై జరిగిన దాడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



**చేర్యాల, నవంబర్ 26 (జనంసాక్షి) :** దళిత మేస్త్రి శ్రీనివాస్‌పై జరిగిన దాడి పట్ల తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సీరియస్‌గా తీసుకున్నారు. ఈ దాడి ఘటనపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కమిషనర్ కలిసి సమస్యను వివరించారు. చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన సెంట్రింగ్ మెస్త్రీ ముచ్చాల శ్రీనివాస్ అనే దళితుడిపై గాగిల్లాపూర్ గ్రామం పైసగూడెం కు చెందిన పైస శ్రీనివాస్ అనే వ్యక్తి అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచి కులం పేరుతో దూషించాడని అట్టి విషయమై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరగా ఈ విషయంపై వెంటనే స్పందించిన ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ జరిగిన దాడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందంకు ఆదేశాలు జారీ చేశారు. ఏసీపీ సానుకూలంగా స్పందించి సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి మల్లిగారి యాదయ్య, రాష్ట్ర నాయకులు గడిపే బాల నర్సయ్య, డివిజన్ ఇంచార్జ్ సనవాల ప్రసాద్,నాయకులు బండ అయిలయ్య, బంగారు ప్రేమ్ కుమార్, బాధితుడు ముచ్చాల శ్రీనివాస్, కుటుంబ సభ్యులు ఉన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**గట్టు, నవంబర్ 26 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలో భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనదేనని విద్యార్థులకు భారత రాజ్యాంగం పై అవగాహన కల్పించాలని తెలిపారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు యువత ముందుకు సాగాలని రాజ్యాంగాన్ని గౌరవించి రాజ్యాంగ విలువల పై ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. ఈ కార్యక్రమంలో కేవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారెప్ప, మాజీ ఎంపిటిసి కృష్ణ, మహబూబ్ బాషా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తాం

- నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తాం
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, నవంబర్ 26 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లాలో స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి క్లీన్ స్వీప్ చేస్తామని వనపర్తి డిసిసి నూతన అధ్యక్షుడు శివసేనా రెడ్డి అన్నారు.బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎంబీ గార్డెన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. తనను నూతన అధ్యక్షునిగా నియమించిన పార్టీ అధిష్టానానికి, సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అందరు నాయకులను కలుపుకొని సమన్వయంతో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చిన్న చిన్న విభేదాలు కామనని పార్టీని గెలిపించేందుకు అందరం ఒకే జెండా కింద



పనిచేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వంలో అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే మెగా రెడ్డి మాట్లాడుతూ పార్టీలో ఉన్న చిన్న చిన్న సమస్యలు పరిష్కరించుకొని బిజెపి, బీఆర్ఎస్ పార్టీల పైనే బాణం ఎక్కు పెడతామని అన్నారు. నియోజకవర్గంలో ప్లానింగ్ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఎవ్వరైనా నియోజకవర్గ అభివృద్ధికి పని చేస్తామని చెప్పారు. ప్రజలకు సేవ చేయడమే మా లక్ష్యం అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధికి మరో 15 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందన్నారు. కలిసికట్టుగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డిసిసి మాజీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్,శంకర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతయ్య, ధనలక్ష్మి, చీర్ల జనార్ధన్, కదిరె రాములు, లక్కాకుల సతీష్, బ్రహ్మం, కోళ్ల వెంకటేష్, పెంటయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత నాణ్యత ప్రమాణాలు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 26 (జనం సాక్షి) :** మూసాపేట్, భూత్పూర్ మండలంలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. మూసాపేట మండలంలో పోల్కంపల్లి గ్రామం లో భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామంలలో ఏర్పాటు పి. ఏ .సి.ఎస్. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. మూసాపేట మండలం లో పోల్కంపల్లి గ్రామంలో పి. ఏ.సి.ఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యం వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు తేమశాతం చెక్ చేయాలనీ, ప్రతిరోజూ సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు ఈ సందర్భంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే లోడ్ చేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఏ రైతు మిల్లులకు వెళ్ళవలసిన అవసరం లేదు అని రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు టాబ్ ఎంట్రీ లు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్‌లను వినియోగించు కొంటున్నారా అని అడిగింది. ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ కొద్దిగా మోటర్ రిపేరింగ్ ఉంది అని చెప్పడంతో ఆటోమెటిక్ ప్యాడి క్లీనర్‌ని పరిశీలించింది సంబంధిత అధికారులకు ఆదేశించి వెంటనే ప్యాడి క్లీనర్ రిపేరింగ్ చేపిస్తామని చెప్పారు. అనంతరం భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామం లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం లో రైతులతో మాట్లాడుతూ కొనుగోలులో తలెత్తిన సమస్యలు తెలుసుకున్నారు. నిర్ణీత తేమ శాతం,తాలు,మట్టి లేకుండా నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కలెక్టర్ రైతులకు తెలిపారు.

## ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 26 (జనం సాక్షి) :** త్వరలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్పీ మాట్లాడుతూ... గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అధికారులు సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికలను ప్రభావితం చేసే ఏ ఇతరములు అక్రమ రవాణా జరగకుండా ఎఫ్ ఎస్ టీ, ఎస్ ఎస్ టీ లతో కోఆర్డినేషన్ తో చెక్‌పోస్టులను నిర్వహించాలని అన్నారు. ఎస్.హెచ్.ఓ లు తమ, తమ ఏరియాలో గల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి, సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. అక్కడి పరిస్థితులను సమీక్షించాలని అన్నారు. హిస్టరీ షీటర్లను, గత ఎన్నికలలో అల్లర్లు సృష్టించిన వారిని సత్ప్రవర్తన కోరుతూ.. ముందస్తుగా బౌండ్ ఓవర్ చేయాలన్నా సూచించడం జరిగింది. నామినేషన్ కేంద్రం వద్ద 100 మీటర్ దూరంలో మార్క్ చేయించాలని, వీడియో రికార్డింగ్ చేయించాలని అన్నారు. ఎన్నికల ప్రశాంత వాతావరణాన్ని ప్రభావితం చేసే విధంగా ఇతర వ్యక్తులను గాని, రాజకీయ పార్టీలను గాని కించపరిచే విధంగా సామాజిక మాధ్యమాలలో అనుచిత వ్యాఖ్యలు చేసిన, ఫార్వార్డ్ మెసేజ్ చేసి, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే.. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలియజేశారు. ఎన్నికలకు సంబంధించిన పోలీస్ సిబ్బంది ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు చేపట్టకూడదని హెచ్చరించారు. ఈ కాన్ఫరెన్స్ లో అదనపు ఎస్పీ రఘునందన్ రావ్, సంగారెడ్డి డిఎస్పీ సత్యయ్య గౌడ్, ఎ. ఆర్ డిఎస్పీ నరేందర్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్బీ ఇన్స్పెక్టర్ కిరణ్, ఎలెక్షన్ సెల్ ఇన్స్పెక్టర్స్ ప్రవీణ్ రెడ్డి, సదా నాగరాజు, ఎలెక్షన్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.




## సంస్మరణ సభను విజయవంతం చేద్దాం



**జడ్చర్ల, నవంబర్ 26 (జనంసాక్షి) :** ప్రజా కవి అందెశ్రీ సంస్మరణ సభను విజయవంతం చేద్దామని అందెశ్రీ అభిమానులు, టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. నర్సింలు పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఉదయమిత్ర యాదగిరి నివాసంలో అందెశ్రీ సంస్మరణ సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్. నరసింహులు మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వ పోరులో ఊరూరా జయ జయహే తెలంగాణ గలమై వినిపించి, అక్షర వాహినితో నిప్పుల వాగుపారించి, చివరి శ్వాస వరకు పేదవారి ఆత్మ గౌరవమే ధ్యాసగా నిలిచిన డాక్టర్ అందెశ్రీ సంస్మరణ సభను ఈ నెల 30వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 1 గంటలకు జడ్చర్ల డాక్టర్ బి.ఆర్.ఆర్ డిగ్రీ కళాశాల మీటింగ్ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంస్మరణ సభకు అధిక సంఖ్యలో అందెశ్రీ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ముఖ్య అతిథులుగా సామాజిక ఉద్యమకారుడు, రచయిత, కవి నందిని సిద్ధారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సి. వెంకటయ్య, మల్ల స్వామి, కారెంగి కృష్ణ, పోలే జగన్, ఉదయమిత్ర యాదగిరి, శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ..




**గద్వాల టౌన్, నవంబర్ 26 (జనంసాక్షి) :** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గద్వాల పట్టణంలో భీమ్ ఆర్మీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మాచర్ల ప్రకాష్,గద్వాల జిల్లా అధ్యక్షులు వర్షిత్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బుధవారం అంబేద్కర్ చౌక్ నందు ప్రజా సంఘాల నాయకులు, అఖిలపక్ష కమిటీ నాయకులతో కలసి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ నాయకులు ప్రజా సంఘాల నాయకులు, అఖిలపక్ష కమిటీ నాయకులతో కలసి పట్టణ పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం యొక్క విలువలను అంబేద్కర్ ఆశయాలను యువత ముందుకు తీసుకుపోవాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వక్తలు నేడు భారత రాజ్యాంగం దినోత్సవం దేశ ప్రజలందరికీ న్యాయం స్వేచ్ఛ సమానత్వం సౌభ్రతృత్వలను అందిస్తూ రూపొందించబడిన మన భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదించబడినది అని అన్నారు. ఈ సందర్భంగా వారు అందరూ కలిసి దేశ ప్రజలందరికీ భారత రాజ్యాంగం దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# స్థానిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

**టేక్మాల్, నవంబర్ 26 (జనం సాక్షి) :** రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయాల్లో నామినేషన్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 27వ తేదీ ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించి గ్రామ పంచాయతీ కార్యాలయం, గ్రామపంచాయతీ ప్రధాన కూడళ్లలో ప్రదర్శింపచేయాలని అన్నారు. అలాగే ఓటరు జాబితా కూడా ప్రదర్శింపజేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ ఉదయం 10:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని ఈనెల 29వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. 30వ తేదీన నామినేషన్లు పరిశీలన, డిసెంబర్ 1వ తేదీన అప్పీళ్లు, 2వ తేదీన డిస్పోజల్, 3వ తేదీన ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. నామినేషన్లు స్వీకరణకు 147 మంది రిటర్నింగ్ అధికారులను



నియమించామని తెలిపారు. ప్రతి రిటర్నింగ్ అధికారుల కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఒక వ్యక్తి గరిష్టంగా నాలుగు సెట్లు నామినేషన్ సెట్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. నామినేషన్ లో ఖచ్చితంగా తేదీ, సమయం, క్రమ సంఖ్య నమోదు చేయాలని సూచించారు. నామినేషన్లలో అభ్యర్థి సంతకం, ధ్రువీకరణ ప్రతిపాదకుని సంతకం ఉండాలని తెలిపారు. జిల్లాలో మొదటి విడతలో160 గ్రామపంచాయతీలలో 1402 వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణకు చేసిన హెల్ప్ డెస్క్ లు, ఇతర ఏర్పాట్లను పరిశీలించామని వివరించారు. ఇప్పటికే ఎన్నికల నేపథ్యంలో ఆర్ఓ, ఏఆర్ఓలకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, జోనల్, మండల ఆఫీసర్లు, ఎంసీసీ నోడల్ ఆఫీసర్లు, ఎఫ్ ఎస్ టీ, ఎస్ఎస్ టీ టీంలను నియమించి శిక్షణ పూర్తి చేశామని పేర్కొన్నారు. ఎఫ్ ఎస్ టీ, ఎస్ఎస్ టీ టీంలను విధులు నిర్వర్తిస్తున్నాయని తెలిపారు. అన్ని ఆర్ఓ కార్యాల యాల్లో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని, ఎన్నికకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో పెట్టాలని, నామినేషన్ల స్వీకరణ ఇతర వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు జిల్లాలో మొదటి రెండు, మూడో విడతలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలాల ఎంపీడీఓ రియాజుద్దీన్,తహసీల్దార్ తులసి రామ్, తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారావుపేటలో చోరీ!

- శ్రీ సిద్ధేశ్వరాలయంలో రూ.4.15 లక్షల బంగారం, వెండి వస్తువుల అపహరణ
- బెల్టు షాపులో రూ. 19 వేల మద్యం బాటిల్లు, రూ.7 వేల విలువచేసే టేకు టీపాయి మాయం..



చెన్నారావుపేట, నవంబర్ 27 (జనం సాక్షి): చెన్నారావుపేటలో చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని శ్రీ సిద్దేశ్వర ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి వేళలో ఆలయం తాళాలను పగలగొట్టి గుర్తుతెలియని దుండగులు లోనికి చొరబడ్డారు. గుడి లోపల ఉన్న భ్రమరాంబిక దేవి అమ్మవారి 18 బిళ్ళల బంగారు కాసుల పేరం(చంద్రహారం) 1 తులం, మంగళసూత్రం 1 తులం, 1 గ్రాము బంగారు హారం, 1 కేజీ వెండి కిరీటం, నెలవంక సుమారు రూ. 4.15 లక్షల విలువచేసే బంగారం, వెండి వస్తువులను దోచుకెళ్లారు. అంతేకాక ఆలయం పక్కనే ఉన్న ముదురుకోళ్ల చిన్న సాంబయ్య తన ఇంటి ఆవరణలో ఉన్న రూ.7 వేల విలువచేసే టేకు టీపాయి, గడ్డపారను దొంగిలించుకుపోయారు. అదేవిధంగా చెన్నారావుపేట ప్రధాన రహదారిలో ఉన్న గుగులోతు రవికి చెందిన బెల్టు షాపు షట్టర్ తాళాలు పగలగొట్టి లోనికి చొరబడ్డారు. అందులో ఉన్న 48 ఐబి క్వార్టర్ల కాటన్ బాక్స్ రూ.9 వేల 150, రాయల్ స్టాగ్ 48 క్వార్టర్ల కాటన్ బాక్స్ రూ.10 వేల 560 విలువగల మద్యం బాటిల్లను అపహరించుకుపోయారు. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి చోరీ జరిగినట్లు గుర్తించి ఈ మేరకు శ్రీ సిద్దేశ్వర ఆలయం ఆలయ అర్చకులు బిక్షమయ్య శాస్త్రి, ముదురుకోళ్ల చిన్న సాంబయ్య, బెల్ట్ షాపు నిర్వాహకుడు గుగులోతు రవిలు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలతో అసమానతలు

- రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన
- వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా




**వరంగల్ బ్యూరో, నవంబర్ 26 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వ వినాశనకర విధానాలతో రైతులు కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారుతున్నదని ఇలాంటి పద్ధతులను మానుకోకపోతే తీవ్రమైన ప్రతిఘటన తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ హెచ్చరించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం పిలుపులో భాగంగా రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏకశిలా పార్కు నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి కలెక్టర్ గేటు ముందు ధర్నా చేపట్టి పెద్ద ఎత్తున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్కేయం జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో పెద్దారపు రమేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం చారిత్రాత్మక ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి రాతపూర్వక హామీలు ఇచ్చి ఆందోళన నిర్మింప చేసి ఆచరణలో అమలు చేయడం లేదని పైగా రైతులను దివాలా తీయించే విధంగా విధానాల రూపకల్పన చేస్తూ విదేశీ పత్తి దిగుమతులపై 11% సుంఖాన్ని ఎత్తివేసిందని అలాగే దేశీయ రైతులు పండించిన పత్తికి కనీస మద్దతు ధర అమలు కాకుండా పరోక్షంగా ప్రయత్నిస్తూ సీసీఐ ద్వారా అనేక షరతులు పెట్టి రైతుల పత్తి కొనకుండా తన బాధ్యతల నుంచి తప్పుకుంటున్నదని పంటల కొనుగోలు సంస్థలైన నాఫెడ్, మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయ్ లాంటి వాటిని నిర్వీర్యపరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల మద్దతు ధర, రుణ విముక్తి చట్టాలు చేయడానికి సిద్ధంగా లేకపోవడం అన్యాయమన్నారు. కార్మిక సంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు కాసు మాధవి, ముక్కెర రామస్వామి, ఎలకంటి రాజేందర్ మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాలు కాపాడే 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చే విధంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచడం దారుణం అన్నారు. ఎస్ కె ఎం రాష్ట్ర నాయకులు చిన్న చంద్రన్న జిల్లా కన్వీనర్లు ఈసంపెల్లి బాబు రాచర్ల బాలరాజు సోమిడి శ్రీనివాస్ చుక్క మొగిలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రావలసిన యాసంగి వరి ధాన్యం బోనస్ రైతు భరోసా డబ్బులను తక్షణమే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు గోనె కుమారస్వామి నర్రా ప్రతాప్ ఆరూరి కుమార్ ఎండి బషీర్ బోడేపల్లి సాయిలు రాజారాం మైదం పాణి ఓదెల రాజన్న ముకిడే పీరయ్య చిర్ర సూరి మోహన్ రావు మహమ్మద్ ఇస్మాయిల్ మాలోత్ సాగర్ సుంచు జగదీశ్వర్ మంద రవి రఘుసాల సుమన్ బండి కుమార్ గోనె రామచందర్ ఇనుముల శ్రీనివాస్ గున్నాల ప్రభాకర్ ప్రకాష్ ఐతం నాగేష్ వీరబోని శంకరయ్య కత్తి సుధాకర్ ఎగిరి మల్లికార్జున్ తదితరులతోపాటు అనేకమంది పాల్గొన్నారు.

## ఇన్స్పెక్టర్‌తో పాటు కానిస్టేబుల్ సస్పెండ్

**వరంగల్ ఈస్ట్, నవంబర్ 26 (జనం సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అవినీతికి పాల్పడిన సంఘటనలో ఇన్స్ స్పెక్టర్ తో పాటు ఒక కానిస్టేబుల్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు బుధవారం వరంగల్ సిపి సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. మామూనూరు పోలీస్ స్టేషన్ నుండి కంట్రోల్ రూమ్ కు ఇటీవల బదిలీ అయిన స్పెక్టర్ ఓ. రమేష్ తో పాటు, మామూనూర్ కానిస్టేబుల్ జి. రఘును సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన ఇరువురు మామూనూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించే సమయంలో వీరిపై అవినీతి ఆరోపణలు రావడంతో అధికారుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావడంతో పాటు వచ్చిన ఆరోపణలు నిర్ధారణ కావడం సీపీ వీరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# పైప్ లైన్ లీకేజీతో బురదమయంగా రోడ్డు

**ఇబ్బందులు పడుతున్న రైతులు**



**మల్హర్, నవంబర్ 26(జనంసాక్షి) :** మండలంలోని మానేరు నది నుండి వల్లెంకుంట వరకు ఉన్న మంచినీటి పైప్ లైన్ కి బారీ స్థాయిలో లీకేజి లతో ఏర్పడటం తో నీరు వృథాగా రోడ్ పైకి చేరడంతో మానేరు నుండి వల్లెంకుంట వరకు గల మట్టి రోడ్ బురద మయంగా మారడంతో స్థానికులు ,రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లీకేజి వాటర్ రోడ్ పైకి చేరడంతో రోడ్ మొత్తం కనీసం నడవడానికి వీలు లేకుండా మారింది అని , వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్ళే ట్రాక్టర్ లు బురద రోడ్ లో దిగబడి పోతున్నాయి అని వరి కోతల సమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైప్ లైన్ లీకేజి ల వల్ల తాగు నీరు సైతం కలుషితం అవుతుంది అని ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్ లైన్ కి మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజలు, రైతులు కోరుతున్నారు.



## సైకిల్ యాత్రికులకు అభినందన

**నిర్మల్ బ్యూరో, నవంబర్26 జనంసాక్షి) :** లోక కళ్యాణార్థము ప్రపంచ శాంతి కొరకు కాలుష్యరహిత సమాజం కొరకు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర యాత్రికులను బుధవారం నిర్మల్ చెందిన ఉపాధ్యాయులు అభినందించారు. మహారాష్ట్ర వాసులను జిల్లా ఉపాధ్యాయులు తోడిశెట్టి రవికాంత్ ,తోడిశెట్టి చంద్రయ్య ,పోతుగంటి సాయన్న, మారుపాక శ్రీనివాస్, సేర్బూర్ సత్యనారాయణలు గంజాల్ టోల్ ప్లాజా వద్ద స్వాగతం పలికారు. మహారాష్ట్ర లోని పూణేకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు దత్త ,విశ్రాంత బ్యాంకు మేనేజర్ అవినాష్ చౌహాన్ లు నవంబర్ 12వ తేదీ సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర 25 రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు.

# ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కగా అమలు చేయాలి

- జిల్లాలోని 09 మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు
- నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




**ములుగు ప్రతినిధి, నవంబర్ 26(జనంసాక్షి) :** రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా, నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ దివాకర టిఎస్ తన ఛాంబర్ నుండి గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణపై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డిపిఓ శ్రీధర్, ఎంపిడిఓ లు, ఎంపిఓ లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 27వ తేదీ ఉదయం 10.30 గంటల లోపు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించి గ్రామ పంచాయతీ కార్యాలయం, గ్రామపం చాయతీ ప్రధాన కూడళ్లలో ప్రదర్శింపచేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితా కూడా ప్రదర్శింపజేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాలని, పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్ట ర్లను, ప్రభుత్వ కార్యాల యాలు, సంస్థల గోడలపై రాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఏ దశలోనూ అలసత్వానికి తావు ఇవ్వకూడదని, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగరూకతతో వ్యవ హరించాలని సూచించారు. నిఘా బృందాలను నియ మించి, పకడ్బం దీగా కోడ్ అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ తదితర అన్ని ప్రక్రియలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణతో ముడిపడిన అంశాలపై, నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను గడువు లోపు పరిష్కరించాలని అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున అందరూ పాటించాల్సిన నిబంధనలను గుర్తుచేశారు.

# మేయర్ మనుషులా మజాకా..!!



సీజ్ ను తొలగించి పూర్తి దశలో నిర్మాణం చేపట్టిన అక్రమ భవనం



సీజ్ ను తొలగించి అక్రమ నిర్మాణం చేపడుతున్న భవనం

- డబ్బులు తీసుకుని సీజింగ్ తెరిచారు
- సర్కిల్ 18లో 'అక్రమాల' బాగోతాలు
- కాసులిచ్చాం.. బాజాప్తా కట్టుకుంటామంటున్న నిర్మాణదారులు
- క్రిమినల్ కేసులకు సిద్ధమవుతున్న అధికారులు

**ఖైరతాబాద్, నవంబర్ 26 (జనంసాక్షి) :** అక్రమ నిర్మాణాలను అడ్డుకట్ట వేస్తున్న అధికారులకు ప్రజాప్రతినిధులే సంకెళ్లు వేస్తున్నారు. జిహెచ్ఎంసి ఖైరతాబాద్ జోనల్ పరిధిలోని సర్కిల్-18లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలను అధికారులు అక్రమాలని తేల్చి సీజ్ చేస్తున్నారు. సర్కిల్ -18లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లో గోవిందరాజు అనే నిర్మాణదారుడు జిహెచ్ఎంసి నుండి సిల్ట్ ప్లస్ రెండంతస్తుల అనుమతులు పొంది, మరో నాలుగంతస్తులను అనుమతుల్లేకుండా నిర్మించాడు. వీటితోపాటు సమీపంలోని ఆర్కే అగర్వాల్ అనే నిర్మాణదారుడు నిబంధనలకు విరుద్ధంగా భవనాన్ని నిర్మిస్తున్నాడని తెలుసుకుని అధికారులు నోటీసులు జారీచేశారు. నిర్మాణదారులు అధికారులకు సరైన పత్రాలు చూపించకపోవడంతో జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు ఇరువురికీ రెండు దఫాలుగా నోటీసులు ఇచ్చి గత మూడు నెలల క్రితం ఉప కమిషనర్ సమ్మయ్య ఆదేశాల మేరకు అప్పటి ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సెక్షన్ అధికారులు సురేష్, సాయికిరణ్‌లు రెండు భవనాలను సీజ్ చేశారు. సీజ్‌ను విడిపించాలని నిర్మాణదారులు అధికారుల చుట్టూ తిరిగినా అక్రమ నిర్మాణం తొలగిస్తేనే సీజ్ తీసేస్తామని చెప్పడంతో వెనుదిరిగారు. భవన యజమానులు మేయర్ దగ్గరి వ్యక్తులైన శ్రీనివాస్ గౌడ్, విజయ్‌లు డబ్బులు తీసుకొని హామీలు ఇచ్చారు. దీంతో మేయర్ మనుషులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చినా టౌన్ ప్లానింగ్ అధికారులు న్యాయపరంగా వెళ్లాలని సూచించారు. ఇదేమీ పట్టనట్టు చట్టాన్ని తమ చేతిలోకి తీసుకొని సీజ్‌ను భవన నిర్మాణదారునితో తీసి వేయించారు. న్యాయపరంగా నిర్మాణదారులు వెళ్లకుండా అడ్డదారిలో సీజ్‌ను తొలగించడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారులు వీళ్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మందలించారు. జిహెచ్ఎంసి అధికారులు ఈ సంఘటనపై క్రిమినల్ కేసులు పెట్టడానికి సిద్ధమవుతున్నారు. నగర ప్రజలకు సేవలందిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేరుని భ్రష్టు పట్టించేలా చేస్తున్నారని మేయర్ డివిజన్‌లోని కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు వాపోతున్నారు. అధికారులు ఈ సీజింగ్ సంఘటనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో మరి..!

### డబ్బులిచ్చాం.. బాజాప్తుగా కట్టుకుంటాం

జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేసిన వాటిని భవన నిర్మాణదారులు తొలిగించిన విషయమై 'జనంసాక్షి' వివరణ కోరింది. ఈ మేరకు భవన నిర్మాణదారులను అడిగితే 'మేం మేయర్ మనుషులకు డబ్బులిచ్చాం. బరాబర్ కట్టుకుంటాం' అంటూ దురుసుగా సమాధానమిచ్చారు.



బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 12 లో గతంలో సీజ్ చేసిన భవనం



బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 12 లో గతంలో సీజ్ చేసిన అక్రమ నిర్మాణ భవనం

# పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

- మూడు దశల్లో ఎన్నికలు : జిల్లా కలెక్టర్



**నిర్మల్ బ్యూరో, నవంబర్ 26 (జనంసాక్షి) :** ప్రశాంతంగా, పారదర్శకంగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలో మూడు దశల్లో ఎన్నికలు జరుగనున్నాయని పేర్కొన్నారు. పోలింగ్ బూత్‌లు, సిబ్బంది నియామకం, భద్రతా చర్యలు, పోలింగ్ సామగ్రి పంపిణీ వంటి ఏర్పాట్లను మండల వారీగా సమీక్షిస్తున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా పోలీసు శాఖతో సమన్వయం పెంచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఎఎస్పీ అవినాష్ కుమార్, డీపీఓ శ్రీనివాస్, డీపీఆర్ఓ విష్ణు వర్ధన్ పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా ప్రశాంతంగా నిర్వహించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 26(జనంసాక్షి):** రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా, నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా కలెక్టర్ గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ పై అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిపిఓ కల్పన లతో కలసి ఆర్డీఓ లు, ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైనందున జిల్లాలోని 11 మండలాల్లోని 317 గ్రామ పంచాయతీ సర్పంచ్ లు, 2754 వార్డు సభ్యుల ఎన్నికలకు 3 విడతల్లో ఈ నెల 27, 30 మరియు డిసెంబర్ 3 తేదీల్లో నామినేషన్ స్వీకరణ ఉంటుందని, నామినేషన్ పత్రాల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల హ్యాండ్ బుక్ లోని ప్రతి అంశంపై సంపూర్ణ అవగాహన తెచ్చుకోవాలన్నారు. పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని.. అనుమానాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా అన్ని జాగ్రత్తలతో సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఇతర వస్తువుల సీజ్ చేసిన సందర్భాలలో అన్ని బృందాలు సమన్వయం చేసుకోవాలని సూచించినారు. , జిల్లాలోని చెక్ పోస్టులలో వాహనాల తనిఖీలు నిష్పక్షపాతంగా, పకడ్బంధీగా జరిగేలా చూడాలని అన్నారు. నోడల్ అధికారులు ప్రతి రోజు రిపోర్ట్ లు నిర్ణిత ఫార్మాట్ లో సమర్పిచాలని తెలిపారు. జిల్లాలో మాన్ పవర్ మేనేజ్మెంట్, బ్యాలెట్ బాక్సుల మేనేజ్మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్మెంట్, శిక్షణా కార్యక్రమాల నిర్వహణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్‌లైన్, కంప్లైంట్స్ రెడ్రెస్సల్, తదితర విభాగాల వారీగా నోడల్ అధికారులను నియమించామని, జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎలాంటి అంతరాయం లేకుండా జరిగేందుకు నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా ఎన్నికల నిర్వహణ జరగాలి. శాంతియుత, స్వేచ్ఛాత్మక మరియు పారదర్శక ఎన్నికలకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని స్పష్టం చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున అందరూ పాటించాల్సిన నిబంధనలను గుర్తుచేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగుతూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లా ప్రజలందరూ ఎన్నికల నియమావళిని పాటించి, శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ సమావేశం లో ఆర్డీఓ లు సుమా రెడ్డి, ఉమారాణి, ఎన్నికల ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు ఎంపిడివోలు, ఎంపిఓ లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి



**మణుగూరు, నవంబర్ 26 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. బుధవారం ఐడిఓసి సమావేశ మందిరం నుండి డీ.ఎల్.పీ.ఓలు, ఎం.పీ.డీ.ఓలు, ఎం.పీ.ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లను, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై రాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఏ దశలోనూ అలసత్వానికి తావు ఇవ్వకూడదని, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. నిఘా బృందాలను నియమించి, పకడ్బందీగా కోడ్ అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను ఎక్కడికక్కడ నిరోధించాలని, మద్యం, డబ్బు పంపకాలు, ఇతర ప్రలోభాలకు గురి చేసే వస్తువుల పంపిణీపై నిఘా ఉంచాలన్నారు. ఓటరు జాబితాను మరోమారు నిశితంగా పరిశీలించాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లు గమనిస్తే తమ దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమిస్తూ, ఎన్నికల విధుల పట్ల పరిపూర్ణ అవగాహన కల్పించేలా శిక్షణ తరగతులను ఇప్పటికే నిర్వహించడం జరిగిందన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని జాగ్రత్తగా సరి చూసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ఎక్కడైనా సదుపాయాలు లేకపోతే యుద్ధప్రాతిపదికన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, టాయిలెట్స్, ఫర్నీచర్, విద్యుత్, లైటింగ్ వంటి వసతులు ఉండేలా చూసుకోవాలని అన్నారు. సర్పంచ్, వార్డు స్థానాల రిజర్వేషన్ల జాబితాను మరోమారు పరిశీలించుకోవాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ తదితర అన్ని ప్రక్రియలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణతో ముడిపడిన అంశాలపై, నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను గడువులోపు పరిష్కరించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, డిప్యూటీ కలెక్టర్ మురళి, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డిపిఓ సుధీర్,అనూష, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



**తలకొండపల్లి, నవంబర్ 26 (జనంసాక్షి) :** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల కేంద్ర సమీపంలోని ఎక్స్ రోడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు జినుకుంట్ల భాస్కర్ మాట్లాడుతూ..భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దాదాపు మూడు సంవత్సరాలు కష్టపడి నిర్మాణాత్మక రాజ్యాంగాన్ని అందించారని కొనియాడారు.నవంబర్ 26,1949 న రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించగా,అది జనవరి 26,1950 నుంచి అమల్లోకి తెచ్చి దేశాన్ని సార్వభౌమ ప్రజాస్వామ్య గణతంత్రంగా మార్చిందని గుర్తు చేశారు.భారత రాజ్యాంగం కేవలం చట్టపరమైన పత్రం మాత్రమే కాకుండా బిలియన్ల మంది ప్రజల ఆశయాలను ప్రతిబింబించే గొప్ప స్ఫూర్తినిచ్చే కావ్యం అని పేర్కొన్నారు.భారత రాజ్యాంగం మహోన్నతమైనదని, పౌరులందరూ రాజ్యాంగానికి లోబడి జీవించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి వినోద్.దేవేందర్, విజయ్, మహేష్, గణేష్,రాజు,వాసు,రాహుల్,నవీన్,తదితరులు ఉన్నారు.

## జిల్లాలో ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 26 (జనంసాక్షి) :** గ్రామ సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చిన సందర్భంగా జిల్లాలో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తామని జిల్లా ఎస్పీ కె.నరసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలు, నియమనిబంధనల మేరకు సూర్యాపేట జిల్లాలో ఎన్నికల కోడ్ ను పటిష్టంగా అమలు చేస్తామన్నారు.ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున జిల్లా ప్రజలు, పౌరులు,రాజకీయ పార్టీలు అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలిగించవద్దని కోరారు. అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు. మద్యం అమ్మకాలపై నిఘా ఉంచామన్నారు.రహదారుల వెంట హొటల్స్, డాబాల్లో మద్యం అమ్మవద్దన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక పండుగలాగా జరగాలని, అందరూ చట్టాన్ని గౌరవిస్తూ శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని అన్నారు.జిల్లాలోకి అక్రమ రవాణా జరగకుండా అక్రమ మద్యం ,ఇతర వస్తువులు రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిఘా పెడుతున్నామని,రౌండ్ ది క్లాక్ పెట్రోలింగ్ కొనసాగుతుందని చెప్పారు. ప్రజలు ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని,డయల్ 100కు, పోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 8712686057, సోషల్ బ్రాంచ్ కంట్రోల్ రూం నెంబర్ 8712686026 కు సమాచారం ఇవ్వాలని అన్నారు.

## సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం



**హుస్నాబాద్, నవంబర్ 26 (జనం సాక్షి) :** హుస్నాబాద్ మండలం పోట్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపిస్తారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల్లో అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు గడిచినా, ఇప్పటికీ ఆ హామీలను నెరవేర్చలేకపోయిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గ్రామ సర్పంచ్ ఎన్నికలను కూడా ప్రభుత్వం నిర్వహించలేకపోయిందని తెలిపారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో అధికార బలంతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ దీనిని ప్రజా మద్దతుగా చూపించుకోవడం సమంజసం కాదన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ హామీలను నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఈసారి జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులనే ప్రజలు విజయం సాధింపజేస్తారని అయిలేని మల్లికార్జున రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ నాయకత్వంలో దాదాపు 90 శాతం సర్పంచ్ స్థానాలను గెలుచుకునేలా పార్టీ కట్టుబడి ఉందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మల్కిరెడ్డి, మోహన్ రెడ్డి, కొమ్మెర నర్సింహారెడ్డి, పాకాల శ్యామ్ సుందర్ గౌడ్, నాంపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధం



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 26 (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ బుధవారం కలెక్టరేట్ లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డిసెంబరు 11, 14, 17వ తేదీల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించుటకు జిల్లా యంత్రాంగం సర్వసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.మొదటి విడత ఎన్నికలకు నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు.మొదట ఎనిమిది మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో మంగళవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని చెప్పారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం ఓటర్లు 694815 ఉండగా, అందులో 340743 పురుషులు, 354050 మంది మహిళలు, ఇతరులు 22 ఉన్నట్లు తెలిపారు.మూడు విడతలలో ఎన్నికలు జరగనున్నాయని మొదటి, రెండు విడతల్లో ఎనిమిది మండలాల చొప్పున, మూడో విడత ఏడు మండలాల్లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. డిసెంబరు 11, 14, 17వ తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అనంతరం ఓట్ల లెక్కింపు చేసి ఫలితాలు వెల్లడించనున్నారు.మొదటి విడతలో ఆత్మకూరు(ఎస్), అర్వపల్లి, మద్దిరాల, నాగారం, నూతనకల్, సూర్యాపేట, తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లోని 159 గ్రామాల్లో 1442 వార్డుల్లో ఎన్నికలు నిర్వహిస్తారు.అనంతగిరి, చిలుకూరు, చివ్వెంల, కోదాడ, మోతె, మునగాల, నడిగూడెం, పెన్ పహాడ్ మండలాల్లోని 181 గ్రామాల్లో 1628 వార్డుల్లో ఎన్నికలు నిర్వహిస్తారని తెలిపారు. మూడో విడతలో గరిడేపల్లి, హుజూర్ నగర్, మఠంపల్లి, మేళ్లచెర్వు, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లోని 146 గ్రామాల్లో 1318 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని 23 మండలాల్లోని 486 గ్రామపంచాయతీలతో పాటు 4388 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిపిఓ యాదగిరి, డిఆర్డిఏ పిడి వివి.అప్పారావు, డివిజనల్ పిఓ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచర్‌ను అరెస్ట్ చేసిన మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులు



**మిర్యాలగూడ, నవంబర్ 26 (జనం సాక్షి) :** బైక్‌పై తిరుగుతూ మహిళల మెడలో బంగారు గొలుసులు అపహరిస్తున్న చైన్ స్నాచర్ ని మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో డీ ఎస్పీ కె. రాజశేఖర్ రాజు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణానికి చెందిన మందడి వినోద్ ఈ నెల 14న మిర్యాలగూడలోని బంగారుగడ్డ కాలనీలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను బైక్ పై అనుసరించి ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. బుధవారం మిర్యాలగూడ కి వచ్చిన వినోద్ వాహనాన్ని పోలీసులు రౌండ్ దగ్గర నిలిపి విచారించగా పారి పోయెందుకు యత్నించగా అదుపులోకి తీసుకొని విచారించడం తో నేరం ఒప్పుకున్నట్లు డిఎస్పీ తెలిపారు. వినోద్ వద్ద 3.2 తులాల బంగారం, సెల్ ఫోన్,బైక్ స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఆతని స్నేహితురాలు నజ్మాని కూడా అదుపులోకి తీసుకొని కోర్టు కు రిమాండ్ కి తరలించినట్లుపేర్కొన్నారు. కేసు చేదనలో ప్రతిభచూపిన టూ టౌన్ సీఐ జెట్టి సోమనర్సయ్య, ఎస్సై రాంబాబు, ఏ ఎస్సై చంద్రయ్య, స్వర్ణ, అక్బర్, రామకృష్ణ, లక్ష్మయ్య లను డీ ఎస్పీ ప్రత్యేక కంగా అభినందించారు.

## దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**నిజాంపేట్, నవంబర్ 26 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మ లోని తెలంగాణ భవన్ లో ఈనెల 29వ తేదీన నిర్వహించనున్న దీక్షా దివాస్ కార్యక్రమ విజయవంతంపై మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ తో పాటుగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి , ఎమ్మెల్సీ నవీన్ రావు , ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి , బండారి లక్ష్మారెడ్డి , పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి హాజరై దీక్షా దివాస్ కార్యక్రమ నిర్వహణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న వివక్షత తొలగాలంటే కేవలం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే మార్గమని గుర్తించి తెలంగాణ రాష్ట్ర సాధనకై బిఆర్ఎస్ అధినేత, పెద్దలు కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన 29, నవంబర్ 2009 రోజు "దీక్షా దివాస్" అని అన్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న "దీక్షా దివాస్" ప్రాముఖ్యతను నాయకులు, కార్యకర్తలు నేటి తరానికి తెలియజేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనేది ఎవరి బిక్షో కాదని, అమరవీరుల త్యాగం, కేసీఆర్ మొక్కవోని దీక్షతోనే తెలంగాణ రాష్ట్ర స్వప్నం సాకారమైందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా జీహెచ్ఎంసీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా నాయకురాలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 17 వరకు ఎన్నికల కోడ్ అమలు


- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 26 (జనం సాక్షి) :** జిల్లాలో జరిగే స్థానిక సంస్థల గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాధ్యత తో పని చేయాలనీ, వారికీ సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.బుధవారము ఐ డి ఓ సి వీడియో కాన్ఫరెన్సు హాలు నందు నోడల్ అధికారులు ,మండల ఎం పి డి ఓ లు , తహసిల్దార్ల తో జూమ్ సమావేశం నిర్వహించి ఎన్నికల విధు లపై దిశా నిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 25 న విడుదల అయినందున, అప్పటి నుండి డిసెంబర్ 17 వరకు ఎన్నికల కోడ్ ,నిబంధనలు అమల్లోకి వచ్చినందున ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. జిల్లా లో మూడు విడతలలో ఎన్నికలు జరుగనున్నాయని, మొదటి విడత లో 8 మండలాలలో 262 గ్రామ పంచాయతీలు,2198 వార్డులు ,2198 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, రేపటి నుండి నామినేషన్లు మొదలు పెట్టాలని , స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను తొలగిస్తూ గెజిట్ జారి అయినదని తెలిపారు. అధికారులకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (%వీ జజ%) నిబంధనలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలేయన్స్ టీంల ఏర్పాటు చెయడం జరిగిందని తెలియజేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రతి ఒక్కరికి సమానంగా వర్తిస్తుందని సూచించారు.నామినేషన్లు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు తీసుకోవాలని, ఎక్కడ ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా స్థానిక పోలీస్ సిబ్బంది తో సమన్వయ పరుచుకొని సజావుగా జరిగేలా చూడాలన్నారు. పౌరులు ఎవరైనా ఎన్నికలపై తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి 8416235291 హెల్ప్ లైన్ 24/7 అందుబాటులో ఉంటుందని అన్నారు. కల్లెక్టేట్ కార్యాలయం లో 08416235291 కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలం వారిగా సంబంధిత అధికారులతో ఎన్ని క్లస్టర్ లు ఉన్నాయి, నామినేషన్ల ఏర్పాట్ల పై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్ పి .స్నేహ మెహ్రా మాట్లాడుతూ ఎన్నికల నియమావళి పై పూర్తి అవగాహనా కలిగి ఉండాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వేలెన్సులు లోకల్ అధికారులతో సమన్వయ పరుచుకొని ఎన్నికలు సజావుగా జరిగేల చూడాలన్నారు. అక్రమంగా డబ్బు, మద్యం సరఫరా, ప్రలోభాలు, బహుమతులు ఇవ్వడం వంటి వాటిని పకడ్బందీగా నియంత్రించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు

## జిల్లాలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 26 (జనంసాక్షి) :** జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ లో గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మొదటి విడత నామినేషన్లు స్వీకరించనున్న సూర్యాపేట డివిజన్ కు సంబంధించిన ఆర్వోలు, ఏఆర్వోలు, ఎంపీడీవోలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మొదటి విడతలో 8 మండలాలలోని 159 గ్రామపంచాయతీలు, 1442 వార్డులకు 44 నామినేషన్ కేంద్రాల ద్వారా నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలను అధికారులందరూ సీరియస్ గా తీసుకోవాలని ఆదేశించారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నామినేషన్ల స్వీకరణ సందర్భంగా పాటించాల్సిన అన్ని నియమాలను తప్పకుండా పాటించాలని అన్నారు. సమయపాలన పాటించాలని, నామినేషన్ల కేంద్రం వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.తగినన్ని నామినేషన్ ఫారాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.ఎన్నికల నియమ నిబంధనలను తప్పకుండా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎంపీడివోలు ఎన్నికల ప్రవర్తనా నియామావళిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిపిఓ యాదగిరి, డిఆర్డిఏ పిడి వివి.అప్పారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, నవంబర్ 26 (జనం సాక్షి) :** జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా పరిధిలో 566 గ్రామ పంచాయతీ సర్పంచ్, 566 ఉప సర్పంచ్, 5168 వార్డు సభ్యుల ఎన్నిక 3 విడతల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడత డిసెంబర్ 11న 7 మండలాల్లోని 192 గ్రామాలు, 1740 వార్డులకు, రెండవ విడత డిసెంబర్ 14న 6 మండలాల్లోని 183 గ్రామాలు, 1686 వార్డులకు, మూడవ విడత డిసెంబర్ 17న 7 మండలాల్లోని 191 గ్రామాలు, 1742 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పోలింగ్, కౌంటింగ్ ఒకే రోజు జరుగుతాయని, ఉదయం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత అక్కడే కౌంటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మొదటి విడత పంచాయతీలకు నవంబర్ 27న, రెండవ విడత పంచాయతీలకు నవంబర్ 30న, మూడవ విడత పంచాయతీలకు డిసెంబర్ 3న నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి 3 రోజుల పాటు నామినేషన్లకు, తర్వాతి రోజు నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామినేషన్ల ప్రకటన ఉంటుందని, మరుసటి రోజు అప్పీళ్లను స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని అన్నారు. నామినేషన్ల ఉపసంహరణ మొదటి విడత పంచాయతీలకు డిసెంబర్ 3, రెండవ విడత పంచాయతీలకు డిసెంబర్ 6, మూడవ విడత పంచాయతీలకు డిసెంబర్ 9 మధ్యాహ్నం మూడు గంటల వరకు సమయం ఉంటుందని, అదే రోజున పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ ఖరారు చేసామని అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి కోసం 166 ఎస్టి (మహిళలు 75, జనరల్ 91), 110 ఎస్సీ (మహిళలు 48, జనరల్ 62), 54 బీసి (మహిళలు 24, జనరల్ 30), 236 అన్ రిజర్వ్డ్ క్యాటగిరి (మహిళలు 112, జనరల్ 124) లుగా రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని అన్నారు. ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 7 లక్షల 95 వేల 138 మంది ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకుంటా రని, 708 పోలింగ్ లొకేషన్ లలో 5168 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, సర్పంచ్ ఎన్నికలకు 9 లక్షల 51 వేలు, వార్డు సభ్యుల ఎన్నికలకు 9 లక్షల 51 వేల బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేశామని, 4894 జంబో, 852 మీడియం బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.




# HR88B8888

## ఇండియాలోనే ఖరీదైన నెంబరు ప్లేట్

## ధర రూ.1.17 కోట్లు

**న్యూఢిల్లీ:** తమకెంతో ఇష్టమైన కార్లకోసం అంతకంటే ఇష్టమైన, నచ్చిన నంబర్లతో నంబర్ ప్లేట్లను దక్కించుకోవడం చాలామంది అలవాటు. వీటినూ వీఐపీ లేదా ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లు అని పిలుచుకుంటారు. అలా భారతదేశంలోనే అత్యంత ఖరీదైన కార్ రిజిస్ట్రేషన్ నంబర్‌గా నిలిచింది. తాజా వేలంలో ఫలితంగా రికార్డు బద్దలైంది. పదండి ఈ వివరాలేంటో తెలుసుకుందాం. హర్యానాలో వీఐపీ లేదా ఫ్యాన్సీ నంబర్ ప్లేట్ల కోసం వారానికి ఆన్‌లైన్ వేలం జరుగుతుంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల నుండి సోమవారం ఉదయం 9 గంటల మధ్య, బిడ్డర్లు తమకు నచ్చిన నంబర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆపై బుధవారం సాయంత్రం 5 గంటలకు ఫలితాలు ప్రకటించే వరకు బిడ్డింగ్ ఆట ప్రారంభమవుతుంది. వేలం పూర్తిగా ఆన్‌లైన్‌లో అధికారిక పోర్టల్‌లో జరుగుతుంది. ఈ వారం, బిడ్డింగ్ కోసం వచ్చిన అన్ని నంబర్లలో, హెచ్‌ఆర్88బీ8888 రిజిస్ట్రేషన్ నంబర్ అత్యధిక సంఖ్యలో దరఖాస్తులను అందుకుంది . మొత్తం 45 అభ్యర్థనలొచ్చాయి. మొత్తానికి అమ్ముడైంది! బేస్ బిడ్డింగ్ ధరను రూ. 50,000గా నిర్ణయించారు. ఇది ప్రతి నిమిషం పెరుగుతూ సాయంత్రం 5 గంటలకు రూ. 1.17 కోట్లకు స్థిరపడింది. బుధవారం హర్యానాలో రూ.1.17 కోట్లకు అమ్ముడైంది. ప్రస్తుతం అధికారికంగా భారతదేశంలోనే అత్యంత ఖరీదైన కార్ రిజిస్ట్రేషన్ నంబర్‌గా మారింది. 8888 అనేది వాహనానికి కేటాయించిన ప్రత్యేకమైన, నాలుగు అంకెల రిజిస్ట్రేషన్ నంబర్. ఈ నంబర్ ప్లేట్ ప్రత్యేకత ఏమిటంటే, 'బీ' ని పెద్ద అక్షరంలో పరిగణనలోకి తీసుకుంటే ఎనిమిది నెంబరు లానే కనిపిస్తుంది ఒకే అంకె 8 పునరావృతమవుతుంది. గతంలో కేరళకు చెందిన వ్యక్తి రూ. 46 లక్షల విలువైన నంబర్ ప్లేట్‌ను కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం ప్రారంభంలో, ఏప్రిల్‌లో, కేరళకు చెందిన టెక్ బిలియనీర్ వేణు గోపాలకృష్ణన్ తన లంబోర్గిని ఉరుస్ పెర్ఫార్మంటే "%ఖూ 07 ఇ+% 0007" కోసం రూ. 45.99 లక్షల ఖర్చుతో లైసెన్స్ ప్లేట్‌ను కొనుగోలు చేశారు..

# పసిడి ధరల తుపాను..



**న్యూఢిల్లీ:** దేశంలో బంగారం, వెండి ధరలు మళ్లీభగ్గుమన్నాయి. పసిడి ధరలు వరుసగారెండోరోజూభారీగాపెరిగాయి. ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు మదుపరులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. మంగళవారంతో పోలిస్తే బుధవారం బంగారం ధరలు భారీగాఎగిశాయి. వెండి ధరలు కూడా గణనీయంగాపెరిగాయి.

# బంగారు నగలపై ఓవర్‌డ్రాఫ్ట్..

**న్యూఢిల్లీ:** కొంతకాలంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో అనేక మందికి బంగారం కేవలం ఆభరణంగా కాకుండా అత్యంత విశ్వసనీయమైన పెట్టుబడి సాధనంగా మారింది. అత్యవసర ఆర్థిక అవసరాల కోసం తమ బంగారాన్ని అమ్మివేయడం లేదా తాకట్టు పెట్టడం సర్వసాధారణం. అయితే అత్యవసరంగా డబ్బు అవసరమైనప్పుడు బంగారాన్ని సాధారణ పద్ధతిలో తాకట్టు పెట్టకుండా, అమ్ముకోకుండానే దాన్ని ఉపయోగించుకునే అద్భుతమైన మార్గం ఉంటే అవును, అదే బంగారు నగలపై ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం. పెరుగుతున్న బంగారం ధరల నేపథ్యంలో అనేక ప్రముఖ బ్యాంకులు తమ వినియోగదారులకు ఈ ప్రత్యేక సౌకర్యాన్ని అందిస్తూ వారి ఆర్థిక అవసరాలకు భరోసా కల్పిస్తున్నాయి. బంగారు నగలపై ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం అనేది ఒక రకమైన సురక్షితమైన రుణం ఇది వ్యక్తిగత రుణం లాంటిది కాకుండా, ఒక క్రెడిట్ లైన్‌లాగా పనిచేస్తుంది. సాధారణంగా గోల్డ్ లోన్‌లో ఒకేసారి మొత్తం డబ్బు తీసుకుని దానిపై వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయంలో మీ బంగారు ఆభరణాల విలువను బట్టి బ్యాంక్ నిర్దిష్ట పరిమితితో రుణాన్ని మంజూరు చేస్తుంది. వినియోగదారుడు ఈ పరిమితి నుంచి అతనికి అవసరమైన మేరకు ఎప్పుడైనా, ఎంతైనా డబ్బును డ్రా చేసుకునే సౌలభ్యం ఉంటుంది. మీరు డ్రా చేసుకున్న అసలు మొత్తంపై మాత్రమే వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. మంజూరైన మొత్తం పరిమితిపై కాదు. ఈ సౌకర్యం సాధారణంగా ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు చెల్లుబాటు అవుతుంది.



మీ సౌలభ్యాన్ని బట్టి క్రమానుగతంగా రుణం తిరిగి చెల్లించవచ్చు. బంగారు నగలపై ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం ద్వారా వినియోగదారులకు కీలక ప్రయోజనాలు ఉన్నాయి. యూజర్లు డ్రా చేసుకున్న మొత్తానికే వడ్డీ లెక్కిస్తారు. ఉదాహరణకు, మీకు రూ.5 లక్షల పరిమితి మంజూరైతే అందులో రూ.2 లక్షలు మాత్రమే వాడుకుంటే ఆ రూ.2 లక్షలపై మాత్రమే వడ్డీ చెల్లించాలి. ఓవర్‌డ్రాఫ్ట్ ఖాతాలో నిధులు జమ చేయడం ద్వారా తీసుకున్న రుణాన్ని ఎప్పుడైనా, ఎన్నిసార్లైనా పాక్షికంగా లేదా పూర్తిగా తిరిగి చెల్లించవచ్చు. నెలవారీ ఈఎంఐ లాంటి కఠిన నిబంధనలు ఉండవు. వ్యాపార అవసరాలు, వైద్య ఖర్చులు లేదా ఇతర అత్యవసరాల కోసం తక్షణమే నిధులు పొందవచ్చు. గోల్డ్ లోన్ లేదా గోల్డ్ ఓవర్‌డ్రాఫ్ట్‌లకు వ్యక్తిగత రుణాల కంటే వడ్డీ రేట్లు సాధారణంగా తక్కువగా ఉంటాయి. బంగారు ఆభరణాలు సురక్షితంగా బ్యాంకు వాల్ట్‌లో ఉంటాయి. వాటిని అమ్ముకోవాల్సిన అవసరం లేదు.

బంగారం విలువను ఎలా లెక్కిస్తారు..

బంగారు నగలపై ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని పొందడానికి వినియోగదారులు సాధారణంగా కొన్ని అర్హతలు కలిగి ఉండి ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. సాధారణంగా 18 క్యారెట్ల నుంచి 24 క్యారెట్ల మధ్య స్వచ్ఛత కలిగిన బంగారు ఆభరణాలపై బ్యాంకులు ఓడీ ఇస్తాయి. వినియోగదారుడికి కావలసిన పరిమితిని బట్టి తగినంత బరువున్న బంగారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. బ్యాంక్ నియమించిన వాల్యుయేటర్ బంగారు ఆభరణాల స్వచ్ఛతను, బరువును నిర్ధారించి వాటి ప్రస్తుత మార్కెట్ విలువను లెక్కిస్తారు. ఈ విలువలో 70% నుంచి 75% వరకు ఓవర్‌డ్రాఫ్ట్ పరిమితిని మంజూరు చేస్తారు.

ఛార్జీలు

బంగారు నగలపై ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని వినియోగించుకునేటప్పుడు వినియోగదారులు చెల్లించాల్సిన ప్రధాన ఛార్జీల్లో వడ్డీ రేటు ముఖ్యమైనది. ఓడీ పరిమితి నుంచి తీసుకున్న అసలు మొత్తానికి మాత్రమే లెక్కిస్తారు. ఈ వడ్డీ సాధారణంగా రోజువారీగా లెక్కిస్తారు. బ్యాంకును అనుసరించి సంవత్సరానికి 8% నుంచి 15% మధ్య మారుతూ ఉంటుంది. కొన్ని బ్యాంకులు ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేస్తున్నాయి. ఇది బ్యాంక్ ఓవర్‌డ్రాఫ్ట్ దరఖాస్తును ప్రాసెస్ చేయడానికి, అకౌంట్‌ను సెటప్ చేయడానికి వసూలు చేసే ఏకమొత్తం ఛార్జీ. ఈ ఫీజు సాధారణంగా మంజూరైన మొత్తం ఓవర్‌డ్రాఫ్ట్ పరిమితిలో 0.5% నుంచి 1.5% వరకు ఉంటుంది. వాల్యుయేషన్ ఛార్జీలు.. బ్యాంక్ నియమించిన వాల్యుయేటర్ బంగారు ఆభరణాల స్వచ్ఛతను, బరువును తనిఖీ చేసి దాని ప్రస్తుత మార్కెట్ విలువను నిర్ణయిస్తారు. ఈ సర్వీసు కోసం వసూలు చేసే ఫీజునే వాల్యుయేషన్ ఛార్జీలు అంటారు. అలాగే రుణ ఒప్పందాలను చట్టబద్ధం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు స్టాంప్ డ్యూటీ ఛార్జీని వినియోగదారులే భరించాల్సి ఉంటుంది.

ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాన్ని అందిస్తున్న బ్యాంకులు

1. ఫెడరల్ బ్యాంక్: డిజి గోల్డ్ ఓవర్ డ్రాఫ్ట్ పథకం
2. సీఎస్‌బీ బ్యాంక్: ఓవర్ డ్రాఫ్ట్ గోల్డ్ లోన్ స్కీమ్
3. తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ : టీఎంబీ గోల్డ్ ఓవర్ డ్రాఫ్ట్ స్కీమ్
4. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా : బంగారు ఆభరణాలపై ఎస్‌ఓడీ



## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.50 | ₹ 6.52 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,17,250 | ₹ 1,27,910 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,76,000

# సెన్సెక్స్ 1000 పాయింట్లు పైకి

## రూ.6 లక్షల కోట్ల ర్యాలీ.. లాభాల్లో మార్కెట్లు



**ముంబయి:** దేశీయ స్టాక్‌మార్కెట్‌లో చాలా రోజుల తర్వాత మంచి ర్యాలీ కనిపించింది. వరుసగా మూడు రోజుల నష్టాల అనంతరం నేడు దూసుకెళ్లిన సూచీలు.. భారీ లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్ల నుంచి పాజిటివ్ సంకేతాలు, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు ఈ ర్యాలీకి ప్రధాన కారణం. సెన్సెక్స్ వెయ్యి పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 26,200 మార్కును దాటింది. ఈ క్రమంలోనే సూచీలు ఆల్‌టైమ్ గరిష్ఠాలకు కాస్త దూరంలో నిలిచాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ (%దీూజు ఝతీనెవ్ ఝజూ%) ఒక్క సెషన్‌లో రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.475 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 84,503.44 పాయింట్ల (క్రితం ముగింపు 84,587.01) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభాల బాట పట్టింది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,644.19 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1022 పాయింట్ల లాభంతో 85,609.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 320.50 పాయింట్ల లాభంతో 26,205.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.25గా ఉంది. గతేడాది సెప్టెంబర్ 27న సెన్సెక్స్ 85,978 వద్ద, నిఫ్టీ 26,277 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాలను తాకాయి. రెండు సూచీలూ కాస్త దూరంలో నిలిచాయి. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ మినహా మిగిలిన అన్ని కంపెనీల షేర్లు లాభాల్లో ముగిశాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, రిలయన్స్, సన్‌ఫార్మా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 62.21 డాలర్ల వద్ద, బంగారం ఔన్సు 4159 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. డిసెంబర్ నెల పాలసీ మీటింగ్‌లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించొచ్చన్న అంచనాలు బలపడ్డాయి. రేట్ల కోతను బలపరిచేలా డేటా రావడంతో వడ్డీ ఈసారి రేట్లు తగ్గిస్తుందని 85 శాతం మంది అనలిస్టులు అంచనా వేస్తున్నారు. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే మనలాంటి వర్ధమాన దేశాల మార్కెట్లకు పెట్టుబడులు తరలివచ్చే అవకాశం ఉంటుంది. దీనికితోడు ఆర్‌బీఐ కూడా దేశీయంగా వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉండడం సూచీలు రాణిస్తున్నాయి. వాల్‌స్ట్రీట్‌లో నిన్న కొనుగోళ్ల మద్దతు కనిపించింది. దీనికి కొనసాగింపుగా అంతర్జాతీయ మార్కెట్లు కూడా లాభాల్లో కొనసాగుతున్నాయి. వాటితో పాటు మన మార్కెట్లూ భారీ లాభాల్లో ట్రేడవుతున్నాయి.



# హాంకాంగ్ భారీ అగ్నిప్రమాదం

– ప్రమాదంలో నలుగురు మృతి.. నలుగురికి గాయాలాఉ

హాంకాంగ్ లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. తాయ్ జిల్లాలోని నూతనంగా నిర్మిస్తున్న ఒక బహుళ అంతస్థుల భవన సముదాయంలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందగా మరో నలుగురు గాయపడ్డారు. మరి కొంతమంది మంటలలో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక దళాలు వెంటనే అక్కడికి చేరుకొని మంటలను ఆర్పే యత్నం చేస్తున్నాయి. కాగా గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించామని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్లు సమాచారం. నిర్మాణంలో ఉ?న్న భవంతి కావడంతో వెలుపలి భాగంలో వెదురుబొంగులను అమర్చారు. మంటలు వాటికి అంటుకోవడంతో పెద్దఎత్తున అగ్నిజ్వాలలు ఎగిసిపడి దట్టమైన పొగ కమ్ముకుంది. మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు భయానకంగా ఉన్నాయి. తాయ్ పో నగరం హాంకాంగ్ ఉత్తర భాగంలో ఉంటుంది. హాంకాంగ్‌లో భవన నిర్మాణరంగంలో వెదురు బొంగుల వాడకం అనేది సర్వసాధారణం. వీటి వల్ల భద్రతా సమస్యలు ఏర్పడుతున్నాయని ప్రభుత్వానికి ఇది వరకే అక్కడి అధికారులు నివేదించినట్లు తెలుస్తోంది. దానిపై స్పందించిన అక్కడి ప్రభుత్వం నిర్మాణం రంగంలో వెదురుబొంగుల వాడకం దశలవారీగా తొలిగిస్తామని ఈ ఏడాది ప్రారంభంలో తెలిపినట్లు సమాచారం.

# పాక్ జైల్లో ఇమ్రాన్ ఖాన్ మృతి?

కార్యకర్తలు ఆందోళనకు దిగారు. అఫ్ఘాన్ న్యూస్ వెబ్‌సైట్ 'అఫ్ఘానిస్తాన్ టైమ్స్' మంగళవారం రాత్రి సంచలన ప్రకటన చేసింది. "పాకిస్తాన్‌లోని విశ్వసనీయ మూలాలు తెలిపిన సమాచారం ప్రకారం, పీటీఐ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలులో రహస్యంగా చంపేశారు. అతని శవాన్ని జైలు నుంచి బయటకు తరలించారు" అని ఆ వార్తలో పేర్కొన్నారు. ఈ ఆరోపణలు 'కాబుల్ ఫ్రంట్‌లైన్' వంటి ఇతర అఫ్ఘాన్ మీడియా ఔట్‌లెట్లలో కూడా విస్తృతంగా ప్రచారం అయ్యాయి. 'పాకిస్తాన్ సైన్యంలోని రహస్య వ్యక్తులు' ఇచ్చిన సమాచారం అని చెప్పుకున్నారు. కానీ ఎలాంటి ఆధారాలు లేవు. పాకిస్తాన్ అధికారులు ఈ ఆరోపణలను 'తప్పుడు వార్త'గా ఖండించారు. "ఇమ్రాన్ ఖాన్ క్షేమంగా ఉన్నాడని.. అతనికి ఎలాంటి హాని జరగలేదు. ఈ రూమర్‌లు ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించడానికి ఉద్దేశించినవి" అని పాకిస్తాన్ సమాచార మంత్రిత్వ శాఖ అధికారులు ప్రకటించారు. అడియాలా జైలు సూపరింటెండెంట్ కూడా ఖాన్ ఆరోగ్యం బాగుందన్నారు. అతను తన ట్విట్టర్ ఖాతాను కూడా జైలు నుంచి నిర్వహిస్తున్నాడనే ఆరోపణలు తప్పు అని ఇస్లామాబాద్ కోర్టులో సోమవారం స్పష్టం చేశారు. పాకిస్తాన్ మొబైల్ ఆపరేటర్లు కూడా ఈ రూమర్‌లు 'ఫేక్ న్యూస్'గా గుర్తించి, వాటిని అడ్డుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ రూమర్ వల్ల పీటీఐ కార్యక్రతలు మండిపడ్డారు. మంగళవారం అడియాలా జైలు వద్ద వేలాది మంది సమావేశమై, ఖాన్ ఆరోగ్యం గురించి సమాచారం కోరుతూ నిరసనలు చేశారు. ఖాన్ సోదరి అలీమా ఖాన్, డాక్టర్ ఉజ్మా, నూరీన్ నియాజీలు జైలు గేటు వద్ద కూర్చుని ధర్నా చేశారు. అయితే, పోలీసులు వారిని బయటకు తీసుకెళ్లారు.

# వణికిస్తున్న విస్ఫోటనాలు

**న్యూఢిల్లీ:** భూమి ఉపరితలం కింద నిద్రాణంగా దాగివున్న శక్తి ఒక్కసారిగా పైకి ఉబికి వచ్చి, ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. అనేక వేల సంవత్సరాల పాటు నిశ్శబ్దంగా ఉన్న నాలుగు అగ్ని పర్వతాలు ఈ ఏడాది(2025)తమ ప్రతాపాన్ని చూపాయి. ఈ విస్ఫోటనాలు ప్రపంచవ్యాప్తంగా విమానయానం, వ్యవసాయం, స్థానిక కమ్యూనిటీల భద్రతపై గణనీయమైన ప్రభావాన్ని చూపాయి. ఈ అనూహ్య ఘటనలు అగ్నిపర్వత శాస్త్రవేత్తలు, విపత్తు నిర్వహణ బృందాలకు నిరంతర హెచ్చరికగా నిలిచాయి.



**హేలీ గుబ్బి (ఇథియోపియా)**

2025 నవంబర్ 23న సంభవించిన ఇథియోపియాలోని హేలీ గుబ్బి విస్ఫోటనం అత్యంత భీకరమైనది. దాదాపు 10,000 నుండి 12,000 సంవత్సరాల నిద్రాణస్థితి తర్వాత ఈ అగ్నిపర్వతం బద్దలయ్యింది. ఈ భారీ విస్ఫోటనం కారణంగా బూడిద ధూళి ఏకంగా 14 కిలోమీటర్ల ఎత్తు వరకు వాతావరణంలోకి ఎగసిపడింది. ఈ బూడిద ప్లూమ్ పశ్చిమం నుండి తూర్పుకు ప్రయాణించి, ఎర్ర సముద్రం మీదుగా దాటుకుని దక్షిణ ఆసియా వరకు వ్యాపించింది. ఫలితంగా భారతదేశంలో 28 విమానాలను దారి మళ్లించ వలసి వచ్చింది. ఢిల్లీ, హర్యానా, యూపీలోప్రాం తాలలో గాలి నాణ్యతపై హెచ్చరికలు జారీ చేశారు.

**కాన్లాన్ అగ్నిపర్వతం**

ఫిలిప్పీన్స్‌లోని కాన్లాన్ అగ్నిపర్వతం 2025 ప్రారంభంలో తీవ్ర విస్ఫోటనాలకు గురైంది. దీని ప్రభావంతో నీగ్రోస్ ద్వీపం నుండి వేలాది మందిని తక్షణమే తరలించవలసి వచ్చింది. దీని నుంచి వెలువడిన బూడిద వర్షం స్థానిక వ్యవసాయాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. మెక్సికోలోని 'పోపోకాటెపెట్ల్' తన కార్యకలాపాలలో భాగంగా బూడిద ఉద్గారాలను విడుదల చేసింది. ఈ బూడిద మేఘాలు విమాన రాకపోకలకు అంతరాయం కలిగించాయి. సమీపంలోని పట్టణాలను దట్టంగా కమ్మేశాయి. ప్రజల రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేశాయి.

**మౌంట్ ఎట్నా (ఇటలీ)**

యూరప్‌లో, సిసిలీ ద్వీపంలో ఉన్న మౌంట్ ఎట్నా అగ్నిపర్వతం స్వల్ప నిశ్శబ్ద దశ తర్వాత 2025లో మళ్లీ విస్ఫోటనాలతో యాక్టివ్‌గా మారింది. ఈ విస్ఫోటనాలలో ప్రత్యక్ష లావా ప్రవాహాలను వెదజల్లే అరుదైన హార్నిటో వెంట్స్ కనిపించాయి. అద్భుతమైన లావా ఫౌంటెన్లు ప్రమాదకరంగా పరిణమించాయి. ఈ సమయంలో వెలువడిన బూడిద సిసిలియన్ పట్టణాలపై పడి, స్థానిక అధికారులకు పలు సవాళ్లను సృష్టించింది.

**తాజాగా.. మెరాపి అగ్నిపర్వతం**

ఇండోనేషియాలోని మెరాపి అగ్నిపర్వతంలో నవంబర్ 21, 2025 (స్థానిక కాలమానం ప్రకారం) నుంచి విస్ఫోటనం కొనసాగుతోంది. సెంటర్ ఫర్ వోల్కనాలజీ అండ్ జియోలాజికల్ హజార్డ్స్ నివేదిక ప్రకారం, అగ్నిపర్వతానికి సంబంధించిన హెచ్చరిక స్థాయి ఇప్పటికే లెవల్ 3వద్ద ఉంది. ఇది ఈ ప్రాంతంలో ప్రమాదా న్ని సూచిస్తున్నది. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# భారత్‌లోని మా వారిని తీసుకెళ్తాం

- ఐదేళ్లలో 5,800 మంది యూదులను తీసుకెళ్లాలని ఇజ్రాయెల్ ప్రణాళిక
- 2026లో 1,200 మంది వలసకు అవకాశం



జెరూసలేం: ఈశాన్య భారతంలో ఉన్న 5,800 మంది యూదులను రాబోయే ఐదేళ్లలో ఇజ్రాయెల్‌కు తీసుకెళ్లే ప్రతిపాదనకు ఆ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాంతంలో ఉన్న బ్నీ మెనాషే కమ్యూనిటీ వలసలకు ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని యూదు ఏజెన్సీ తెలిపింది. '2030 నాటికి 5,800 మంది కమ్యూనిటీ సభ్యులను ఇజ్రాయెల్‌కు తీసుకొస్తుంది. 2026లో 1,200 మంది ఇజ్రాయెల్‌కు రానున్నారు'అని వెల్లడించింది. ప్రీ ఇమ్మిగ్రేషన్ ప్రక్రియకు ఒక యూదు ఏజెన్సీ నాయకత్వం వహించడం ఇది మొదటిసారి. వీరు ఇజ్రాయెల్ చీఫ్ రబ్బినేట్, కన్వర్షన్ అథారిటీ, పాపులేషన్–ఇమిగ్రేషన్ అథారిటీతో కలిసి అర్హత ఇంటర్వ్యూలు నిర్వహించడం, అర్హత ఉన్న వారిని తీసుకెళ్లడానికి విమానాలను నిర్వహించడం, ఇజ్రాయెల్‌లో వారు కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేయడం ఈ ఏజెన్సీనే చేస్తుంది. వలసదారుల విమాన ఖర్చులు, వారి మత మార్పిడి, గృహ నిర్మాణం, హిబ్రూ పాఠాలు చెప్పడంతోపాటు ఇతర ప్రయోజనాలను కల్పించడానికి 90 మిలియన్ షెకెల్స్ బడ్జెట్‌ను అంచనా వేసింది. దీనిని ఇమ్మిగ్రేసన్, ఇంటిగ్రేషన్ మంత్రి ఓఫిర్ సోఫర్‌మంత్రి వర్గానికి సమర్పించారు. ఈ ప్రక్రియ నిర్వహణ కోసం రబ్బీల ప్రతినిధి బృందం రాబోయే రోజుల్లో ఇండియాకు రానుంది. ఇలా వసల వెళ్లినవారికి ప్రారంభంలో వెస్ట్‌బ్యాంక్‌లో పునరావాసం కల్పించారు. ఇటీవల వారిని ఇజ్రాయెల్‌లోని నజరేత్‌కు చాలా దగ్గరగా ఉన్న అరబ్ నగరం నోఫ్ హగలిల్ పట్టణానికి పంపారు. రాబోయే ఐదేళ్లలో షెడ్యూల్ చేసిన వారిని కూడా అక్కడే స్థిరపడేలా చేయాలని కేబినెట్ నిర్ణయించింది. గతంలో బ్నీ మెనాషే యూదుల గురించి అనేక చర్చలు జరిగాయి. మెనాషే అనేది మణిపూర్, మిజోరాంలలో ఉన్న యూదు కమ్యూనిటీ. ఇజ్రాయెల్ నుంచి వెళ్లిపోయిన 12 తెగలలో ఒక తెగకు చెందినవారుగా భావిస్తారు. 2005లోఎ అప్పటి చీఫ్ రబ్బీ వారిని ఇజ్రాయెల్ వారసులుగా గుర్తించి వారి ఇజ్రాయెల్ వలసలకు మార్గం సుగమం చేశారు. ఇప్పటికే బ్నీ మెనాష్‌లో దాదాపు సగం మంది ఇజ్రాయెల్‌కు వలస వెళ్లి ఆ దేశ పౌరులుగా స్థిరపడ్డారు.



# రైలు పట్టాలపై సవారీ చేసే బస్సు

**న్యూఢిల్లీ:** సాధారణంగా మనం ఊహించని పనులను చేసే కొన్ని వాహనాలు మనల్ని ఆశ్చర్యపరుస్తుంటాయి. అలాంటి ఒక వినూత్న వాహనాన్ని జపాన్‌లో ఆవిష్కరించారు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి డ్యూయల్ మోడ్ వెహికల్‌గా రికార్డు సృష్టించింది. ఇది బస్సు మాదిరిగా సాధారణ రోడ్లపై, రైలులాగా రైల్వే ట్రాక్‌పై పరుగులు పెడుతుంది. చిన్న బస్సు రూపంలో కనిపించే ఈ డ్యూయల్ మోడ్ వాహనం దాని డిజైన్, ప్రత్యేకతలతో వాహనదారులను ఆకర్షిస్తోంది. దీనికి ప్రత్యేకమైన పేరు లేనప్పటికీ దీని పనితీరు అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ వాహనం జపాన్‌లోని షికోకు ద్వీపంలోని కొచ్చిని టోకుషిమా మధ్య నడుస్తోంది. ఈ డ్యూయల్ మోడ్ వాహనాన్ని ఆసా కోస్ట్ రైల్వే అనే ఒక ప్రైవేట్ పబ్లిక్ రైల్వే సంస్థ నిర్వహిస్తోంది.

15 సెకన్లలో మోడ్ ఛేంజ్..

ఈ వాహనం రోడ్డు మోడ్ (బస్సు) నుంచి రైలు మోడ్‌కు లేదా రైలు మోడ్ నుంచి రోడ్డు మోడ్‌కు చాలా త్వరగా మారగలదు. మోడ్‌ల మధ్య సెటప్‌ను మార్చుకోవడానికి డీఎంవీకి కేవలం 15 సెకన్లు మాత్రమే పడుతుంది. ఈ వాహనం 21 మందిని మోసుకెళ్లగలదు. రోడ్డుపై వేగం గంటకు 100 కిలోమీటర్ల వరకు చేరుకోగలదు. రైలు పట్టాలపై గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. ఈ డీఎంవీ జపాన్‌లో అవాకైనాన్, కైఫు, షిషికుయి, కన్నోరా, ఉమినోకి టోయో టౌన్, మిచినోకి షిషికుయి ఒన్సెన్‌ను కలుపుతూ నడుస్తుంది. ఈ మార్గంలో ప్రయాణించే దూరాన్ని బట్టి ఛార్జీలు 200 యెన్ల నుంచి 800 యెన్ల వరకు (సుమారు రూ.100 నుంచి రూ.450) ఉంటాయి.

# ఇండియాలో 'గూగుల్ మీట్' డౌన్



ప్రపంచవ్యాప్తంగా వృత్తిపరమైన, వ్యక్తిగత కమ్యూనికేషన్‌కు కీలకంగా ఉన్న ఆన్‌లైన్ వీడియో కాలింగ్, మీటింగ్ ప్లాట్‌ఫామ్ గూగుల్ మీట్ సర్వీసుల్లో అంతరాయం ఏర్పడింది. బుధవారం భారతదేశంలో చాలా మంది వినియోగదారులు గూగుల్ మీట్ సేవలు సరిగా పని చేయడంలేదని తెలిపారు. రిమోట్ వర్క్, ఆన్‌లైన్ సమావేశాల్లో పాల్గొనే వినియోగదారులు ఈ అంతరాయం వల్ల సమస్యలు ఎదుర్కొన్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ సేవల అవుటేజ్ మానిటరింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్ డిటెక్టర్ ప్రకారం, మధ్యాహ్నం 12:29 గంటల వరకు కనీసం 1,760 మంది వినియోగదారులు గూగుల్ సమస్యల ఎదుర్కొన్నట్లు చెప్పారు. చాలా మంది వెబ్‌సైట్ ద్వారా ముఖ్యమైన సమావేశాల్లో జాయిన్ అవ్వలేకపోయామని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎర్రర్ ఇదే..

ఆన్‌లైన్ కాల్స్‌లో చేరడానికి ప్రయత్నించిన వినియోగదారులకు స్క్రీన్‌పై ఒక ఎర్రర్ మెసేజ్ దర్శనమిచ్చింది. '502. దిస్ ఈస్ యాన్ ఎర్రర్. మీ రిక్వెస్ట్‌ను యాక్సెప్ట్ చేయడానికి దయచేసి 30 సెకన్లలో మళ్లీ ప్రయత్నించండి. మాకు తెలిసింది అంతే' అనే మెసేజ్ చూపించింది.

నెటిజన్ల స్పందన

గూగుల్ మీట్ అంతరాయంపై నెజినట్లు ఎక్స్ ప్లాట్‌ఫామ్ వేదికగా స్పందించారు. 'పని చేయడానికి ఎంతో ఆశగా ఉన్న నాకు గూగుల్ మీట్ చుక్కలు చూపించింది' అని ఒక నెటిజన్ రాశారు. మరొక వినియోగదారు స్పందిస్తూ.. 'మా సంస్థలో గూగుల్ మీట్ అందరికీ డౌన్ అయింది' అని రాశారు. కొంతమంది యూజర్లు మాత్రం టీమ్ సభ్యుల మధ్య సమస్యలు వేర్వేరుగా ఉన్నాయని తెలిపారు. 'గూగుల్ మీట్ నాకు సరిగానే ఉంది. కానీ మా బృందంలో ఇతర సభ్యులు సమస్యలు ఎదుర్కొన్నట్లు చెప్పారు' అని రాసుకొచ్చారు.

తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో పల్లె పోరుకు ఆశావాహులు సై అంటున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం మూడు విడతల్లో నిర్వహించనున్నది. మొదటి విడత డిసెంబర్ 11, రెండో విడత డిసెంబర్ 14, మూడో విడత డిసెంబర్ 17 నిర్వహించడంతో పాటు ఫలితాలను అదే రోజు ప్రకటించి ఉప సర్పంచి ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయనున్నారు.దీంతో అదే రోజు పల్లెల్లో ప్రజాస్వామ్య పండుగ జరగనుంది.




# పంచాయతీ పోరుకు

## ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు

### కుల, యువజన, మహిళా సంఘాలతో సమావేశాలు..

- విందు,మందు పార్టీలతో బిజీ బిజీ..
- తాయిలాలతో ఏకగ్రీవాలపై దృష్టి
- వచ్చే నెల 11,14,17 న మూడు విడుతాలలో పోలింగు..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 26 (జనంసాక్షి) :**

ప్రతి గ్రామంలో ప్రచారతంతు మొదలై అభ్యర్థులు ఇంటింటికి తిరుగుతూ ఓట్ల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. సర్పంచ్, వార్డ్ సభ్యుల పదవుల కోసం పోటీ మరింత హెూరా హెూరీగా మారనుంది. ముఖ్యంగా పలు గ్రామాల్లో స్థానిక రాజకీయ సమీకరణాలు ఎన్నికలను మరింత ఆసక్తికరంగా మార్చాయి. యువత, మహిళలు కూడా భారీ సంఖ్యలో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆశావహులు తమ మద్దతు దారులతో మంతనాలు జరుపుతున్నారు. మరో వైపు వివిధ కులసంఘాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇంకో వైపు మందు, విందు పార్టీలకు తెర లేపారు. మరోవైపు ఏక గ్రీవం చేసేందుకు నజరాన ఇస్తామంటూ తిరుగుతున్నారు. బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే రూ 10 లక్షల నిధులు ఇస్తామని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. కాగా గతంలో ఏకగ్రీవ పంచాయతీలకు నేటికి నిధులు రాలేదు..

**గ్రామ పంచాయితీ ఎన్నికలలో అధికారులకు ఎంసీసీపై శిక్షణ**

గ్రామ పంచాయితీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ)పై వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రాజన్న సీరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన క్రమంలో ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు,సిబ్బంది పాల్గొనకూడదని స్పష్టం చేశారు. విధుల్లో భాగంగా ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీలు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించ వద్దని సూచించారు.ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన క్రమంలో రూ 50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని, పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలన్నారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వ డం, వాటిని పరిశీలించడంపై తెలియజేశారు. ఆయా మండలాల నోడల్ ఆఫీసర్లు తమ నివేదికను ప్రతి రోజు పంపించాల్సి ఉంటుం దని తెలిపారు. ఎంసీసీ నోడల్ ఆఫీసర్ గా డీఆర్డీఓ శేషాద్రి నియ మించారు. జిల్లా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఉంటాయన్నారు.

**అధికారుల ఏర్పాట్లు వేగవంతం..**

పోలింగ్ నిర్వహణకు సంబంధించి జిల్లా,మండల అధికారులు సమావేశాలు ప్రారంభించారు. సిబ్బంది నియామకాలు, పోలింగ్ కేంద్రాల సన్నాహాలు, భద్రతా చర్యలు, సామాగ్రి పంపిణీ వంటి అంశాలపై ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రజాస్వామ్య ఎన్నికలకు సిద్ధం అవుతున్న పల్లెలు ఈ ఎన్నికలు స్థానిక పాలన, గ్రామాభివృద్ధిలో కీలక ప్రభావాన్ని చూపనున్నాయి. ప్రజలు కూడా ఉత్సాహంగా బరిలోకి దిగే అభ్యర్థులను పరిశీలిస్తూ చర్చలు ముమ్మరం చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి విడతలో వేములవాడ డివిజన్ పరిధిలో రుద్రంగి, వేములవాడ, వేములవాడ రూరల్, చందుర్తి, కోనరావుపేట మండలాల్లో పోలింగ్ జరగనుండగా, రెండో విడతలో.. వేములవాడ డివిజన్ పరిధిలోని బోయినపల్లి, సిరిసిల్ల డివిజన్ పరిధిలోని ఇల్లంతకుంట, తంగలపల్లి, మూడవ విడుతలో.. సిరిసిల్ల డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట, గంబీరావుపేట, వీర్నాపల్లి, ముస్తాబాద్ మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలలో పోటీ చేసే ఆశావాహులు ఇప్పటికే సర్వం సిద్ధం చేసుకోగా ఎలాగైనా ఎన్నికల్లో గెలిచి పట్టు సాధించాలని అధికార కాంగ్రెస్ పార్టీ,ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి,తదితర పార్టీలు బరిలోకి దిగనున్నాయి.





# బ్రాహ్మణపల్లి అంగన్వాడి కేంద్రానికి తాళం

**ఎడపల్లి, నవంబర్ 25 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రానికి గత 15 రోజుల నుండి తాళం వేశారు. దాంతో అంగన్వాడి పరిధిలోని గర్భిణీలు, బాలింతలకు, చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం అందడం లేదు. ఈ విషయంలో ఐసిడిఎస్ ఉన్నతాధికారులు సైతం స్పందించకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే గత 12 సంవత్సరాల నుండి ఈ సెంటర్‌కు పర్మినెంట్ అంగన్వాడి టీచర్ లేకపోవడంతో ఇంచార్జీ టీచర్లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. అయితే గ్రామానికి చెందిన మహిళ గత కొన్ని సంవత్సరాల నుండి గ్రామస్తులు అందించిన చిన్నపాటి పారితోషికంతో పనిచేసింది. గ్రామస్తులు అందిస్తున్న పారితోషికం సరిపోకపోవడంతో ఆమె కూడా గత రెండు నెలల నుండి సెంటర్ కు రావడం లేదు. దాంతో అధికారులు పక్క గ్రామం టీచర్ కు ఇంచార్జి బాధ్యతలను అప్పగించారు. సదరు టీచర్ సైతం అనారోగ్య కారణా లతో రాకపోవడంతో బ్రాహ్మణపల్లిలోని అంగన్వాడి సెంటర్ మూతపడింది. ఇక అప్పటి నుండి ఇప్పటి వరకు గర్భిణీ, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం నుండి అందించే పౌష్టికాహారం అందడం లేదు. అయితే ఇక్కడ విధులు నిర్వహించే అంగన్వాడి హెల్పర్ ను వేరే సెంటర్‌కు బదిలీ చేయడంలో గల ఆంతర్యం ఏమిటో ఐసీడీఎస్ అధికారులకే తెలియాలి. సదరు హెల్పర్ తో ఇక్కడి సెంటర్ ను నడిపించాల్సిన కనీస బాధ్యత ఉన్నప్పటికీ ఆమె విధులు సక్రమంగా నిర్వహించడం లేదనే సాకుతో ఆమెను ఇక్కడి నుండి బదిలీ చేయడం వారి పనితీరుకు అద్దం పడుతుందని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కిందిస్థాయి సిబ్బందితో పని చేయించుకొని అధికారులు మిగతా అంగన్వాడి టీచర్, ఆయాల పనితీరును ఎలా పర్యవేక్షిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో కొన్ని అంగ న్వాడి కేంద్రాలు సరైన రీతిలో నడిచిన దాఖలాలు లేకపోయినప్పటికీ అధికా రులు పర్యవేక్షించిన పాపాన పోలేదనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఏదీ ఏమైనా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఎడపల్లి మండలంలోని అంగన్వాడి కేంద్రాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని మండల ప్రజలు బాహాటంగా ఆరోపిస్తున్నారు. అయితే బ్రాహ్మణపల్లి గ్రామంలోని సెంటర్ ను నడిపించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

**సెంటర్ తెరిపించేందుకు చర్యలు : సీడీపీఓ**

ఈ విషయమై ఐసిడిఎస్ సిడిపిఓ పద్మను వివరణ కోరగా, త్వరలో అంగన్వాడి సెంటర్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# రుద్రంగి మండలంలో తొలి పంచాయతీ ఏకగ్రీవం

- రోప్ల తండాలో సర్పంచ్‌తోపాటు 8 వార్డు సభ్యులూ పోటీలేకుండా ఎన్నిక
- ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే గెలుపు సంబరాలు
- జిల్లాలోనే మొదటి ఏకగ్రీవ గ్రామ పంచాయతీగా రికార్డు
- కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ

రుద్రంగి నవంబర్ 26 (జనం సాక్షి) : తెలంగాణ తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని చాలామంది ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. స్థానిక సంస్థల నోటిఫికేషన్ కోసం గల్లి లీడర్లు ఆశగా చూస్తున్నారు. స్థానికంగా అందుబాటులో ఉంటూ గ్రామాల్లో ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే రుద్రంగి మండలం ఉమ్మడి మానాల గ్రామం రూప్ల తండా లో మాత్రం సర్పంచ్ తోపాటు 8 వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా పూర్తయింది. పోటీ లేకుండా ఏకగ్రీవంగా సర్పంచును ఎన్నుకోవడమే కాదు గెలుపు సంబరాలు కూడా చేసుకున్నారు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం రోప్లా తండా గ్రామంలో సుమారు 390 మంది జనాభా ఉంటారు.అయితే నిధుల సమస్యలు లేకుండా తండాను అభివృద్ధి చేసి చూపిస్తానని గ్రామానికి చెందిన జవహర్లాల్ నాయక్ తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా పార్టీలకు అతీతంగా జవహర్లాల్ నాయక్ ను అందరి సమస్యలు తెలిసిన వ్యక్తిగా ఉన్నందున ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తాండవాసులు తెలిపారు. జిల్లాలోనే మొదటి ఏకగ్రీవ పంచాయతీగా రూపొందా పంచాయితీ నిలిచింది. సర్పంచ్‌గా ఎన్నికైన జవహర్‌లాల్ నాయక్‌ను పంచాయతీ ప్రజలు అభినందించారు. పంచాయతీ పరిధిలోని అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారంలో తన వంతుగా కృషి చేస్తానని ఏకగ్రీవంగా ఎన్నికైన ఆ గ్రామ నూతన సర్పంచ్ జవహర్ లాల్ నాయక్ తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో తండావాసులు పెద్దమనుషులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే మరింత అభివృద్ధి సాధ్యం

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 26 (జనంసాక్షి) :**

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా వేములవాడ లోని ఫంక్షన్ హాల్ లో బుధవారము వేములవాడ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశము నిర్వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా అందరూ కలసి కట్టుగా పని చేయాలన్నారు. ప్రతి గ్రామంలో అభ్యర్థి ఎంపిక సెలెక్ట్ అండ్ ఎలెక్ట్ పద్ధతిలో ఉంటుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లలని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మంచి వాతావరణం ఉందన్నారు.దానికి నిదర్శనం మొన్నటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అన్నారు. దేశంలో బడుగు బలహీనవర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లపుడు అండగా ఉంటుందని,ఎంపిక కాబడిన ఏక అభిప్రాయం వచ్చిన చోట నామినేషన్ వేయాలన్నారు.ఆలా వేస్తే అందరికీ గౌరవం దక్కుతుందన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పతకాలను ప్రతి గడపకూ చేరవేయాలని ఆయన నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ప్రజల మద్దతు పొంది



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తే మీకు అండగా నేను ఉంటానని భరోసా ఇచ్చారు.గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే మరింత అభివృద్ధి సాధ్యమన్నారు.గత ఎన్నికల్లో ఇతర ప్రాంతాల్లో నుండి వచ్చి పోటీ చేసిన వారికి ప్రజలు బుద్ధి చెప్పారని,మనం ఎల్లపుడు ప్రజల మధ్య ఉంటున్నమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్షులు, నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనమును ఢీ కొట్టిన లారీ..

# భార్యాభర్తలు మృతి

**చిన్నారికి తీవ్ర గాయాలు**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :**

వేములవాడ మండలం ఆరేపల్లి వద్ద ద్విచక్ర వాహనంను లారీ ఢీ కొట్టడంతో భార్యాభర్తలు అక్కడిక్కడే మృతి చెందారు. రెండేళ్ల లోపు ఉన్న చిన్నారికి కాలు విరగడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ కామారెడ్డి వైపు ద్విచక్ర వాహనంపై చిన్నారితో పాటు వెళ్తున్న భార్యాభర్తలు వెళుతుండగా లారి డి కొట్టడంతో భార్య భర్తలు అక్కడికక్కడే మృతిచేందరని తెలిపారు. మృతులు కామారెడ్డికి చెందిన వసీం (27) ఐఫా (22)గా గుర్తించారు. పాపను కరీంనగర్ ఆసుపత్రికి తరలించి లారి డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## బాక్స్ డ్రెయిన్ సమస్యలు పరిశీలించిన కార్పొరేటర్

**అల్వాల్:** మచ్చబొల్లారం డివిజన్ గంగా అవెన్యూ కాలనీలోని బాక్స్ డ్రెయిన్ సమస్యలను కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ బుధవారం పరిశీలించారు. ఇంజినీర్ రవలి బృందంతో కలిసి స్థలాన్ని పరిశీలించిన ఆయన అవసరమైన పనుల అంచనాలు, ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇదే సందర్భంగా అధికారులు ధర్మారెడ్డి కాలనీ నివాసితులు ఇటీవల సమర్పించిన వినతిపత్రాన్ని కూడా పరిశీలించినట్లు కార్పొరేటర్ వెల్లడించారు. పరిశీలనలో లక్ష్మీకాంత్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అంజన్‌కుమార్

- పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ చేతులమీదుగా నియామకపత్రం
- కార్పొరేషన్‌లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడిస్తాం
- కార్యకర్తలతో కలిసి పార్టీని బలోపేతం చేస్తా




**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 26 (జనంసాక్షి):**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వైద్యుల అంజన్ కుమార్ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్‌లో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతులమీదుగా నియామక పత్రం అందుకున్న ఆయన... మధ్యాహ్నం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ప్రత్యేక పూజల అనంతరం తన చాంబర్‌లో పదవీ బాధ్యతల స్వీకరణ పత్రంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ మాట్లాడుతూ... కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని, అందుకోసం కార్యకర్తలంతా ఏకమై సమన్వయంతో పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు. "కార్యకర్త స్థాయి నుంచి జిల్లా అధ్యక్ష స్థాయి వరకు ఎదగడం కేవలం కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యం. బడుగు, బలహీన, మైనారిటీ, దళిత వర్గాలకు అవకాశాలు కల్పించే ఏకైక పార్టీ కాంగ్రెస్" అని కొనియాడారు.

ఈ అవకాశం కల్పించిన ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం తదితరులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో పదవిలో పనిచేసిన నాయకులు, కష్టకాలంలో పార్టీ కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తనూ గౌరవిస్తూ... వారితో కలిసి పనిచేస్తానని హామీ ఇచ్చారు. "మున్సిపల్ ఎన్నికలు వచ్చేసరికి కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడేలా చేస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు. పదవి స్వీకారోత్సవంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి రహమత్ హుస్సేన్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, సీనియర్ నాయకులు పొన్నం సత్యనారాయణ గౌడ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎండి తాజ్, సిరాజ్ హుస్సేన్, మడుపు మోహన్, చర్ల పద్మ, బోనాల శ్రీనివాస్, లింగంపల్లి బాబు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, రోళ్ల సతీష్, అబ్దుల్ రెహమాన్, కామ్ రెడ్డి రామ్ రెడ్డి, సాయిని తిరుపతి, చారగొండ బుచ్చిరెడ్డి, సరిల్ల ప్రసాద్, మల్లికార్జున రాజేందర్, ఆకుల ప్రకాష్, గంట కళ్యాణి శ్రీనివాస్, పడిశెట్టి భూమయ్య, ఇమ్రాన్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

# చెక్‌డ్యాములు కూల్చివేతలేదు... కూలిపోతున్నాయి

- బీఆర్ఎస్ పాలనలో నాణ్యత లేకుండా నిర్మితం
- 3 వందల కోట్లతో చెక్ డ్యాములు నిర్మాణం చేపడితే మూనాళ్ళ ముచ్చటగా మారాయి.
- పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 26 (జనంసాక్షి):**

కరీంనగర్ జిల్లా కేంద్రంలో బుధవారం రోజున ఆర్, బి గెస్ట్ హౌస్‌లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వోడితల ప్రణవ్, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కోట్లాది రూపాయలతో కరీంనగర్ నుండి మంథని, ముత్తారం వరకు నిర్మాణం చేపట్టిన 8 చెక్ డ్యాం లలో నాణ్యత లేక కూలిపోతుంటే బిఆర్ఎస్ నాయకులు అసత్యపు ప్రచారాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. వాగులపై చెక్ డ్యాములు నాణ్యత లేకుండా కట్టారని మంథని నుండి కరీంనగర్ వరకు నిర్మించిన చెక్ డ్యాములలో నాణ్యత లేదని డిజైన్ కరెక్టు లేదని మలహర్, మండలం నుండి శ్రీరాంపూర్, ముత్తారం, ఓదెల, సుల్తానాబాద్, కరీంనగర్ వరకు నిర్మించిన చెక్ డ్యాములు డిజైన్ చేసి కాంట్రాక్టు పిలిచి నిర్మాణం చేపట్టింది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని అవి కూలిపోవడంతో బావా, బామ్మర్దులు ఇద్దరు అబద్ధాలు నెత్తినెత్తుకొని రోజు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎనిమిది చెక్ డ్యాములు నిర్మాణం చేపడితే గుంపుల, తనుగుల, జమ్మికుంట మధ్యలో ఉన్న డ్యాం 2020లోనే కూలిపోయాయని అప్పుడు భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నది హరీష్ రావు కాదని అన్నారు. రైతుల కోసం కట్టింది కాదని కేవలం ఇసుక దొంగలుగా మారేందుకు బిఆర్ఎస్ వారేనని ఏంమానాలు చేశారని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ మండలం మీర్జాంపేట(పోచంపల్లి)లో నిర్మాణం చేసిన చెక్ డ్యామ్ నాలుగు సంవత్సరాల క్రితమే కూలిపోయిందని పేర్కొన్నారు. రూపు నారాయణపేట, వీణవంక చెక్ డ్యాంలు సైతం కూలిపోయాయని పేర్కొన్నారు. మడక, మల్లారెడ్డిపల్లె లో ఉన్న చెక్ డాం కూలిపోయిందని




సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి, నీరుకుల్ల, గొల్లపల్లి,ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లిలోనివి సైతం కూలిపోయిందని పేర్కొన్నారు. సిరిసిల్లలో దళితులను కొట్టి జైలులో పెట్టించి ఇసుకను ఎత్తుకుపోయింది మీ కుటుంబమేనని ఆరోపించారు. కాలేశ్వరం నిర్మాణం అద్భుతమని చెప్పుకుంటున్న మీరు టూరిజం ప్లాంట్ అంటూ చెప్పుకొచ్చారని అది ప్రస్తుతం కూలిపోయిందని పేర్కొన్నారు. చెక్ డాం పేల్చి వేశారని మీరు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని నిరూపించకుంటే హరీష్ రావు రాజకీయాల నుండి తప్పుకుంటావా అని సవాల్ విసిరారు. హుసేనియా వాగులో నిర్మించిన చెక్ డ్యాములు సైతం మూడు కూలిపోయాయని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న 2009 -14 లో గంగారం దగ్గర 14 కోట్లతో నిర్మాణం చేసిన చెక్ డాం ఎన్ని వరదలు వచ్చినా అలాగే ఉందని అన్నారు. 9 ఏళ్ల బి.ఆర్.ఎస్ పాలనలో ప్రజలకు చేసింది ఏమి లేదని ప్రజలు అంతా గమనిస్తున్నారని రానున్న రోజుల్లో కర్ర కాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్, పెద్దపల్లి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపల ప్రకాష్ రావు, కర్ర రాజశేఖర్, ఆకుల నర్సన్న, గోపగాని సరయ్య గౌడ్, మూల ప్రేమ్ సాగర్, ఆళ్ల సుమన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాబితాలో అనర్హులు ఉంటే ఫిర్యాదు చేయాలి


- ఈనెల 29న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు డ్రా
- దరఖాస్తులలో 1,212 మంది అర్హులతో జాబితా
- ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు వెల్లడి

**ఆర్మూర్, నవంబర్ 26 ( జనంసాక్షి):**

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులను ఈనెల 29న మధ్యాహ్నం 12 గంటలకు బాలాజీ ఫంక్షన్ హాల్ లో ఓపెన్ లక్కీ డ్రా ద్వారా ఎంపిక ఉంటుందని,జాబితాలో అనర్హులు ఉంటే ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ రాజు చెప్పారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్మూర్ పట్టణంలోని పోచమ్మ గల్లి వద్ద ప్రభుత్వం 136 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించిందన్నారు. కోటార్మూర్ లో 200 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించినట్లు వివరించారు. ఆర్మూర్, కోటార్మూర్ లలో కలిపి 336 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో 50 ఇండ్లు అసైన్మెంట్ స్థలాలు, పట్టా స్థలాలు కోల్పోయిన వారికోసం రిజర్వు చేయడం జరిగిందన్నారు. మిగతా 19 ఇండ్లను పారిశుద్ధ్య కార్మికుల కోసం రిజర్వ్ చేయడం జరిగిందన్నారు. రిజర్వ్ చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల జాబితాలో అర్హులకు మాత్రమే ఎంపిక చేస్తామన్నారు. ఇందులో అనర్హులు ఉంటే తొలగిస్తామన్నారు. 336 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో 69 ఇండ్లను రిజర్వ్ చేశామని, మిగతా 267 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఓపెన్ డ్రా పద్ధతి ద్వారా జాబితాలో పేర్లు ఉన్న



వారి సమక్షంలో ఓపెన్ డ్రా తీయడం జరుగుతుందన్నారు. ఆర్మూర్ పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం 6,625 మంది దరఖాస్తు చేసుకోగా అధికారులతో ఇంటింటి సర్వే చేయించి అర్హులైన 1,212 మందితో జాబితాను సిద్ధం చేశామన్నారు. ఈ 1,212 మందితో ఉన్న జాబితాలో అనర్హులు ఉన్నట్లయితే శుక్రవారం సాయంత్రం 5 గంటలలోగా ఆధారాలతో మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ జాబితాలో అనర్హులు ఉంటే తొలగిస్తామని పేర్కొన్నారు. అన్ని పరిశీలించి విచారణ జరిపి జాబితాను తయారు చేయడం జరిగిందని, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల జాబితాను మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు కార్యాలయం బోర్డుపై 1212 మంది లబ్ధిదారుల పేర్లను పొందుపరిచారు.



# పాలమూరువాలా.. పాన్ మసాలా

## యథేచ్ఛగా పొగాకు ఉత్పత్తుల విక్రయాలు

- గుట్కాలో టుబాకో, షాపుల్లో తోరణాలుగా వేలాడదీసి అమ్మకాలు
- చోద్యంచూస్తున్న అధికారులు.. జిల్లాలో విచ్చలవిడిగా వ్యాపారం

**రాయచూర్ టు మహబూబ్ నగర్**

కర్ణాటకలోని రాయచూర్ నుంచి మహబూబ్ నగర్ వరకు రోజుకో మినీట్రక్ లో నిషేధిత ఉత్పత్తులు సంచుల్లో తరలిస్తున్నారు. రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తుల నిషేధం ఉన్నప్పటికీ గుట్కా మాఫియా ఇంత బరితెగించి మహబూబ్ నగర్ కు రోజుకో ఒక ట్రక్లో తీసుకు వస్తుండటం గమనార్హం.

**15 నుంచి 35 ఏళ్లవారు..**

రోజురోజుకూ అనేక మంది యువకులు మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. ముఖ్యంగా 15 నుంచి 35 ఏళ్లవారు మాదకద్రవ్యాలతో చెడు వ్యసనాల బారిన పడుతున్నారు. గుట్కా, ఖైనీ, సిగ రెట్, మద్యం వంటి హానికర, మత్తు పదార్థాలకు బానిసలు కావడం వల్ల ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన రోగాల బారినపడి నాశనమవుతున్నారు. వీరికి 40 నుంచి 50 ఏళ్లు వచ్చేసరికి ఆరోగ్యం పూర్తిగా పాడైపోతుంది. కాలక్షేపానికి కొందరు, వినోదానికి మరికొందరు వీటికి అలవాటుపడ్డారు. మహబూబ్ నగర్ జిల్లాలోనే రోజుకు 35 లక్షల నుంచి 40 లక్షల వరకు వ్యాపారాం జరుగుతున్నాయని సమాచారం.

**మహబూబ్ నగర్ బ్యూరో, (జనంసాక్షి):**
పాలమూరు జిల్లాలో యథేచ్ఛగా పొగాకు ఉత్పత్తుల విక్రయాలు కొనసాగుతున్నాయి. బానిసలైన యవకులు తమ జీవితాలను నిర్వీర్యం చేసుకుంటున్నారు. లైమ్, ప్రాపిన్, సింథటిక్ తదితర విష పూరిత రసాయనాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. ఖైనీ తినడం వల్ల పెదవులు పొక్కిపోయి, కొంతకాలానికి దంతాలు, చిగుళ్లు పూర్తిగా పాడవుతాయని హెచ్చరిస్తున్నారు.
ప్రతి చిన్న, పెద్ద దుకాణాల్లో కూడా ఖైనీ, గుట్కా అందుబాటులో ఉండటం వల్ల చిన్న వయసు వారు కూడా వీటికి ఆకర్షితులవుతున్నారు. వీటి అమ్మకాలపై నిషేధం ఉన్నా ఇవి మార్కెట్లో విచ్చలవిడిగా లభిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గుట్కా, పాన్ మసాలా వంటి కొన్ని హానికరమైన పొగాకు ఉత్పత్తులపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధాన్ని విధించింది. కానీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో నిషేధిత పొగాకు ఉత్పత్తులు (గుట్కా) యథేచ్ఛగా అమ్ముతున్నారు. పొగాకు ఉత్పత్తులతో మనుషులు క్యాన్సర్ వంటి ప్రాణాంతక జబ్బుల బారిన పడుతున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వం వాటి అమ్మకాలను పూర్తిగా నిషేధించింది. ఇటువంటి నిషేధిత, ప్రాణాంతకమైన ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి జిల్లాలో అమ్మకాలు సాగిస్తున్నప్పటికీ ఈ అక్రమ దందాను అరికట్టాల్సిన ప్ర భుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**రెట్టింపు ధరకు విక్రయం**

నిషేధం సాకు చూపుతూ గుట్కా మాఫియా రిటేల్ షాపులకు రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. గుట్కాతో క్యాన్సర్ వంటి ప్రాణాంతకర వ్యాధులు వస్తాయని చెబుతున్నా వాటికి అలవాటుపడ్డవారు మానుకోలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పట్టణాలు, గ్రామాలు అని తేడా లేకుండా పాన్ షాపులు, కిరాణషాపుల్లో గుట్కాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. నియంత్రించాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఏ పాన్ షాప్, కిరాణం షాపు చూసినా గుట్కా పాకెట్లు వేళాడుతూ దర్శనమిస్తాయి. రెండు రూపాయలకు లభించే గుట్కా ప్యాకెట్ ప్రస్తుతం మార్కెట్లో 10 నుంచి 15 రూపాయలకు విక్రయిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నిషేధిత గుట్కా విక్రయాలను అరికట్టడానికి ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# ఉద్యోగాల పేరుతో భారీ టోకరా...

### సైబరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు

**శేరిలింగంపల్లి, నవంబర్ 26 (జనంసాక్షి) :**
సాంకేతిక పరిజ్ఞానంతో టీ హబ్‌గా మారిన హైదరాబాదు మాదాపూర్‌లో ప్రైవేటు ఉద్యోగాల పేరుతో కోట్లాది రూపాయలను వసూలు చేస్తూ బోర్డు తిప్పేస్తున్న సంస్థల ఉదంతం తరచుగా వినిపిస్తూనే ఉంది, కనిపిస్తూనే ఉంది. ఈ క్రమంలోనే ఎన్ఎస్ఎన్ ఇన్ఫోటెక్ పేరుతో నగరంలో పుట్టుకొచ్చిన ఓ ప్రైవేటు ఐటి సంస్థ ఈ మధ్యనే ఉద్యోగాల పేరుతో దాదాపు 400 మంది నిరుద్యోగుల వద్ద నుండి ఒక్కొక్కరి చొప్పున 3 లక్షల రూపాయలు వసూలుచేసినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే డబ్బులు వసూలు చేసిన నిరుద్యోగులకు ముందుగా శిక్షణ ఇచ్చి తదనంతరం ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నమ్మబలికించి దాదాపు 12 కోట్ల రూపాయలను దండుకొని నిండా ముంచి రాత్రికి రాత్రే బోర్డు తిప్పేయడంతో విషయం తెలుసుకున్న సదరు నిరుద్యోగులంతా లబోదిబోమని నెత్తి నోరు కొట్టుకొని సంస్థ వద్దకు వెళ్లి చూడగా అక్కడ వారికి ఎలాంటి అనువైన పరిస్థితులు కనిపించకపోవడంతో వారంతా బుధవారం సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయానికి విచ్చేసి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ‘రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని’

# కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

**కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 26 (జనంసాక్షి):**
కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం బుధవారం రోజు కరీంనగర్ లోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ కమీషనర్‌కు స్వాగతం పలికారు. కమీషనర్ సాయుధ దళ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కమీషనర్ గౌష్ ఆలం పోలీస్ స్టేషన్ సిబ్బంది పరేడ్‌ను, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి అందించిన కిట్లను తనిఖీ చేసి, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలోని స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించిన విధులు, రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్ లో నమోదైన కేసుల వివరాలను సక్రమంగా పొందుపరచాలని సూచించారు.
తెలంగాణ రాష్ట్ర పోలీసులు వినియోగించే సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఈ-సమన్ల జారీ, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక, ఆర్థికేతర నేరాలు, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, బాడీ వార్న్ కెమెరాలు వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలని ఆదేశించారు. ఎఫ్.ఐ.ఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష జరిపి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నమోదైన సైబర్ నేరాల గురించి తెలుసుకొని, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కరీంనగర్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని వార్డులు,



గ్రామాలను సెక్టార్లుగా, సబ్-సెక్టార్లుగా విభజించి, వాటికి గ్రామ పోలీస్ అధికారులను కేటాయించాలని ఆదేశించారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు పోలీస్ స్టేషన్‌లో అన్ని రకాల విధులను నేర్చుకోవాలని, రికార్డు నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్లు వంటి విధులను సీనియర్ల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరని తెలిపారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెలా వారికి సంబంధించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో రికార్డుల మెయింటనెన్స్ , పోలీస్ స్టేషన్ పర్యవేక్షణ బాగుందని ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ మరియు అతని సిబ్బందిని పోలీస్ కమిషనేర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఎస్సైలు సాంబ మూర్తి, చీనా నాయక్, సంజీవ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు

### పంచాయితీ ఎన్నికల నిర్వహణ కోసం

# అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి ఆర్డీఓలు, ఎంపీడీఓ లు, ఎంపీఓలతో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తుచ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని అన్నారు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలన్నారు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లను, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై రాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఏ దశలోనూ అలసత్వానికి తావు ఇవ్వకూడదని, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు నిఘా బృందాలను నియమించి, పకడ్బందీగా కోడ్ అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను ఎక్కడికక్కడ నిరోధించాలని, మద్యం, డబ్బు పంపకాలు, ఇతర ప్రలోభాలకు గురి చేసే వస్తువుల పంపిణీపై నిఘా ఉంచాలన్నారు. ఓటరు జాబితాను మరోమారు నిశితంగా పరిశీలించాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లు గమనిస్తే తమ దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమిస్తూ, ఎన్నికల విధుల పట్ల పరిపూర్ణ అవగాహన



కల్పించేలా శిక్షణ తరగతులను ఇప్పటికే నిర్వహించడం జరిగిందన్నారు బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని జాగ్రత్తగా సరి చూసుకోవాలన్నరు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ఎక్కడైనా సదుపాయాలు లేకపోతే యుద్ధప్రాతిపదికన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, టాయిలెట్స్, ఫర్నీచర్, విద్యుత్, లైటింగ్ వంటి వసతులు ఉండేలా చూసుకోవాలని అన్నారు. సర్పంచ్, వార్డు స్థానాల రిజర్వేషన్ల జాబితాను మరోమారు పరిశీలించుకోవాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ తదితర అన్ని ప్రక్రియలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణతో ముడిపడిన అంశాలపై, నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను గడువు లోపు పరిష్కరించాలని అన్నారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, నోడల్ అధికారులు, ఆర్డీఓలు, ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవ పంచాయతీలకు రూ.20 లక్షల నజరానా

- ఏకగ్రీవాలపై దృష్టి సారించండి .. కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి పిలుపు.

**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 26 (జనంసాక్షి):**
వచ్చే నెల రెండో విడుతలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పంచాయతీల అభివృద్ధికి రూ.20 లక్షలు ప్రోత్సాహంగా అందజేస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటించారు. బుధవారం ఎల్ఎండీ కాలనీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షతవహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలపైననే దృష్టి సారించాలని ఆయన కోరారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తానని, ఆ నిధులతో ఆయా గ్రామాలకు అవసరమైన పనులు చేపట్టవచ్చన్నారు. మెజార్టీ సంఖ్యలో సర్పంచులుగా గెలిపించుకోవడం ద్వారా పంచాయతీలపై పట్టు సాధించాలన్నారు. పంచాయతీ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని, సర్పంచులుగా మనవారిని గెలిపించుకోవడానికి అందరూ కష్టపడి పని చేయాలన్నారు. ఎన్నికలంటేనే ప్రత్యర్థులతో పోటపడటమని, అలాంటప్పుడు గెలుపు అవకాశాలు ఉన్నవారిని మాత్రమే పోటీకి నిలపాలే తప్ప అందరూ పోటీపడకూడదన్నారు. ఎన్నికల సమీపంలో ఉన్నందున పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో ఏమాత్రం జాప్యం జరగొద్దని, అందరి సమన్వయంతో అభ్యర్థుల జాబితా ఖరారు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు, శంకపట్నం



మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటకుంటే ప్రతిపక్షాల ముందు పలచనవుతామన్నారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపు మనందరి లక్ష్యం కావాలని, అభ్యర్థుల ఎంపిక విషయంలో వివాదాలకు తావివ్వొద్దన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధగోని లక్ష్మినారాణ గౌడ్, ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షులు గోపగోని బస్వయ్య గౌడ్, నందగిరి రవీంద్రచారి, బండారి రమేశ్, ముక్కిస రత్నాకర్ రావు, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి, బి.రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీలు ఊట్కూరి వెంకట రమణారెడ్డి, గుడిసె అయిలయ్య యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, పార్టీ నాయకులు ఉప్పుగళ్ల మల్లారెడ్డి, బండారి తిరుపతి, గట్టు తిరుపతి, చింతిరెడ్డి పద్మ, మొలంగూరి సదానందం, నేరెళ్ల సంతోష్,ఎగ్గని రమేశ్, రాయిని రమేశ్, గాజుల శ్రీనివాస్, మహేశ్, పవన్ కుమార్, జంపయ్య, దశరథం తదితరులు పాల్గొన్నారు.

# కులాంతర హత్యలకు వ్యతిరేకంగా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి

- నిజనిర్ధారణలో చైతన్య మహిళా సంఘం బృందం డిమాండ్
- ఎల్లంపల్లి ఘటనపై కరపత్రం విడుదల
- కరపత్రాలను పంపిణీ చేసిన చైతన్య మహిళా సంఘం నాయకులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :**
రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో జరిగిన ఎర్ర రాజశేఖర్ హత్య ఘటనపై చైతన్య మహిళా సంఘం బృందం బుధవారం నాడు ఎల్లంపల్లి గ్రామాన్ని సందర్శించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు పోలీసుల నిర్లక్ష్యంపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై వెంటనే ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేయాలని కులాంతరహత్యలకు వ్యతిరేకంగా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని గ్రామాల్లో మహిళా సంఘాలకు సర్పంచ్ లకు ఎంపిటిసిలకు కులాంతర వివాహల పట్ల అవగాహన కల్పించాలని కులాంతర వివాహేల హత్యలకు పాల్పడే వారికి కఠినమైన శిక్షలు పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కులాంతర వివాహల గురించి అవగాహన కార్యక్రమాలలో భాగంగా పోలీస్ స్టేషన్లో ప్రత్యేకమైన కౌన్సిలింగ్ సెంటర్లు ఏర్పాటు



చేయాలని కులాంతర వివాహేలు చేసుకున్న వారికి కచ్చితంగా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కోకన్వీనర్ శ్రీదేవి రంగారెడ్డి జిల్లా కన్వీనర్ ప్రేమలత కోకన్వీనర్ శైలజ సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు..

# అనుమతులు లేకుండానే వెంచర్లు

- వ్యవసాయ భూములలో వెంచర్లు
- నాలా కన్వర్షన్ గా మార్చకుండానే వెంచర్లు
- తుమ్మలూరులో సర్వే నంబర్ 247లో అక్రమ వెంచర్లు

**మహేశ్వరం, నవంబర్ 26, (జనంసాక్షి):**
మహేశ్వరం నియోజకవర్గంలో బహుళ స్థాయి కంపెనీలు రావడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం మహేశ్వరం నియోజకవర్గంలో ఉండటంతో మహేశ్వరం,కందుకూరు మండలాలలో రాజకీయ పార్టీల నాయకులు,రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు,అక్రమార్కులు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే వ్యవసాయ భూములలోనే ఫామ్ ల్యాండ్, వెంచర్లు, విల్లాల నిర్మాణం విచ్చలవిడిగా జరుగుతున్నాయి. అధికారుల తీరు చూస్తుంటే పేదవాళ్లకు ఒక న్యాయం, పెద్దోళ్లకు ఒక న్యాయం అనే విధంగా అధికారుల తీరు ఉందని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామంలోని సర్వే నంబర్ 247లో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చకుండానే వెంచర్ నిర్మాణం వందల ఎకరాలలో చేశారు.మరో ప్రక్క 247 సర్వే నంబర్ లో గతంలో జీపీ లే అవుట్ చేశారు. జీపీ లే అవుట్ కు ప్రభుత్వం నుంచి,గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోలేదు.ఒకవేళ అనుమతులు తీసుకుంటే గ్రామ పంచాయతీ కార్యాలయానికి రావాల్సిన 10 శాతం భూమి వివరాలు ఉండాలి. ఎల్ఆర్ఎస్ కట్టకుండానే ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేశారు.అనుమతులు లేని వెంచర్లకు మహేశ్వరం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏ విధంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయో సబ్ రిజిస్టర్ కార్యాలయం అధికారులే సమాధానం తెలపాలి.అందరి కన్ను 247 సర్వే నంబర్ మీదనే పండింది.247 సర్వే నంబర్ శ్రీశైలం జాతీయ రహదారి ప్రక్కనే ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు గతంలో చేసిన జీపీ వెంచర్లలలో హెచ్ఎండీఏ వెంచర్ లో



ఉన్న మౌలిక సదుపాయాలు,సౌకర్యాలు మా వెంచర్ లో ఉన్నాయని నమ్మ బలుకుతూ కస్టమర్లకు బురిడీ కొడుతున్నారు. సర్వే నంబర్ 247 ఉన్న వెంచర్లకు రైతు భరోసా డబ్బులు పడ్డాయి.వెంచర్లకు రైతు బంధు ఏ విధంగా వేశారో వ్యవసాయ అధికారులకే తెలియాలి.247లో జరిగే అక్రమ వెంచర్ల నిర్మాణ పనులను ఆపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**కనిపించని నిబంధనలు...!**


ఏదైనా వెంచర్ చేయాలంటే 40 శాతము భూమిని ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలి.10 శాతం భూమిని పార్కుకు,30 శాతం భూమిని రోడ్లకు కేటాయించాలి.ప్రభుత్వానికి చేయాల్సిన మార్ట్ గేజ్ ను కూడా వెంచర్ నిర్వాహకులు చేయకుండానే అమ్మకాలు జరుపుతున్నారు. వెంచర్లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 30 ఫీట్ల రోడ్డు,విద్యుత్ సౌకర్యం,పార్కు స్థలాలు, మౌలిక సదుపాయాలు కల్పించకుండానే వెంచర్ నిర్మాణం చేపడుతున్నారు. తుమ్మలూరు గ్రామంలో అక్రమ వెంచర్లు,విల్లాల నిర్మాణాలు జరుగుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.మరో ప్రక్క జీపీలే అవుట్లకు కొత్త రంగు వేసి అమ్మకాలు జరుపుతున్నారు.

### కమిషనర్ చర్యలు తీసుకునేలోపు..

# కళ్ళముందే గృహ ప్రవేశాలు..?

- అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారా?
- నోటీసులతోనే సరిపెడుతున్న వైనం
- అంతస్తులపై అంతస్తుల నిర్మాణాలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో గోరంత అనుమతులు తీసుకొని కొండంత నిర్మాణాలు సాగుతున్నాయి. అంతస్తులపై అంతస్తులు నిర్మాణాలు జరుగుతున్న గృహ నిర్మాణాలకు అనుమతులు తీసుకొని వ్యాపార నిర్మాణాలు ఏర్పాట్లు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వైనంపై మున్సిపల్ కమిషనర్ కు లిఖితపూర్వకంగా పలువురు ఫిర్యాదు చేశారు. ఐనప్పటికీ మున్సిపల్ అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూనే ఉంది. పట్టణంలో వేరువేరు అనుమతులు తీసుకొని ఒకే ఇంటి నిర్మాణాన్ని కూడా కొనసాగిస్తూన్న దుస్థితి నెలకొంది. ఇక అనుమతి లేకుండా నిర్మాణాలు కొనసాగుతున్న వాటిపై నోటీసులు ఇచ్చామని, మున్సిపల్ శాఖ అధికారులు చెబుతున్న మున్సిపల్ అధికారుల కళ్ళముందే ఆ ఇంటి నిర్మాణాలతో పాటు ఆ ఇంటి గృహప్రవేశాలు కూడా జరిగేటట్టు ఉన్నాయనే విమర్శలు కూడా పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా మున్సిపల్ కమిషనర్ అక్రమ కట్టడాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.






**కమిషనర్‌పై టిపిఓ.. టిపిఓపై కమిషనర్**

ఈ అక్రమ నిర్మాణాల కట్టడాలపై మున్సిపల్ కమిషనర్ సునితను వివరణ కోరగా.. అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్న వాటిపై ఇప్పటికే మూడు బిల్డింగులకు నోటీసులు ఇచ్చామని, చర్యలు టిపిఓ తీసుకుంటుందని చెప్పగా టిపిఓను వివరణ కోరగా కమిషనర్ అలా ఎందుకు చెప్పిందో నేను కనుక్కుంటానని టిపిఓ చెప్పడం గమనార్హం. కమీషనర్ టిపిఓ చర్యలు తీసుకునేలోపు నిర్మాణాలు జరిగి గృహప్రవేశాలు కూడా జరిగే అవకాశాలు లేకపోలేదనే మాటలు పట్టణం మొత్తం వినిపిస్తున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
27 నవంబర్ 2025

# హుజూర్ నగర్‌కు మణిహారంలా ఔటర్ రింగ్ రోడ్

- రాష్ట్రంలోనే మొదటి సారిగా ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్ నగర్ నవంబర్ 26 (జనంసాక్షి):** హుజూర్ నగర్ పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్ మణిహారం లా ఉంటుందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్ నగర్ మున్సిపాలిటీలో 6.0 కోట్ల రూపాయలతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఔటర్ రింగ్ రోడ్డు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2013 లో 22 కోట్ల రూపాయలతో పట్టణానికి ఒక వైపు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించగా, తిరిగి ఇప్పుడు 6 కోట్ల రూపాయలతో రెండు కిలోమీటర్లను పూర్తి చేసి హుజూర్ నగర్ పట్టణానికి చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా బయట నుండే వెళ్లడంతో పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా ఉంటుందని, ఔటర్ రింగ్ రోడ్డుపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం రూ. 7.5 కోట్లతో నిర్మాణం జరుగుతున్న జూనియర్ కాలేజీ, 4.5 కోట్లతో నిర్మాణం జరుగుతున్న డిగ్రీ కాలేజీ, 8.0 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న డివిజనల్ కార్యాలయం, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నిర్మాణం పనులను మంత్రి పర్యవేక్షించారు. పనులలో నాణ్యత పాటిస్తూ, మే నెల చివరి నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకు తీసుకొని రావాలని ఆదేశించారు. అనంతరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్రములోనే మొదటి సారిగా ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణను మరింత సమర్ధవంతంగా చేపట్టేందుకు ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ లను నిర్మించి పబ్లిక్ లీజ్ పద్ధతి ద్వారా అద్దెకు ఇవ్వాలని తద్వారా లభించే అద్దె ఆదాయాన్ని కార్యాలయ భవనం లో మెరుగైన సౌకర్యలతో మౌలిక వసతుల అభివృద్ధి చేసుకోవచ్చు అని తెలిపారు. ఇరిగేషన్ డివిజన్ కార్యాలయ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్ బి ఈఈ సీతారామయ్య, డి ఈ రమేష్, టి జి ఈ డబ్ల్యూ ఐ డి సి డి ఈ రమేష్, ఇరిగేషన్ ఈ ఈ రామ కిషోర్, డి ఈ సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది తదితరులు హాజరైనారు.

# డీజీపీ కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**హైదరాబాద్, నవంబర్ 26 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది భారత రాజ్యాంగం పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం.భగవత్, మల్టీ జోన్ -2 అడిషనల్ డీజీపీ డిఎస్ చౌహన్ తదితరులు పాల్గొన్నారు. కార్యాలయ సిబ్బంది అందరిచేత అడిషనల్ డీజీపీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ప్రవేశికను గౌరవంగా పఠింపజేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. "భారత ప్రజలు భారతదేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్రంగా నిర్మించుటకు... ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, భావ వ్యక్తీకరణ, విశ్వాసం, ఆరాధనలో స్వేచ్ఛ, సమాజంలోని వారందరికీ సమానత్వం, సౌభ్రాతృత్వం, దేశ సమైక్యతను మరియు సమగ్రతను కాపాడడం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని... తేదీ 26 నవంబర్ 1949న, ఈ రాజ్యాంగాన్ని మాకు మేమే ఇచ్చుకొనుచున్నాం" అని ప్రతిజ్ఞ చేశారు. పోలీస్ కార్యాలయ సిబ్బంది అందరూ భారత రాజ్యాంగ విలువలు, పౌర హక్కులు, బాధ్యతలు, నైతిక ధర్మాలను కాపాడేందుకు కృషి చేస్తామని సంకల్పం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐజి (శాంతిభద్రతలు) రమణ కుమార్, పోలీసు అధికారులు, డిజిపి కార్యాలయ మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మొరాయించిన గూగుల్ మీట్..


- దేశవ్యాప్తంగా నిలిచిపోయిన సేవలు

**న్యూఢిల్లీ, నవంబర్26 (జనంసాక్షి) :** ప్రముఖ వీడియో కాన్ఫరెన్సింగ్ ప్లాట్‌ఫాం గూగుల్ మీట్‌లో బుధవారం మధ్యాహ్నం నుంచి తీవ్ర అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా వేలాది మంది వినియోగదారులు ఆన్‌లైన్ సమావేశాల్లో చేరలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లాగిన్ సమస్యలతో పాటు, చాలామందికి "502 ఎర్రర్" అనే సందేశం కనిపిస్తుండటంతో గందరగోళం నెలకొంది. ఔటేజ్ ట్రాకింగ్ వెబ్‌సైట్ 'డౌన్‌డిటెక్టర్' నివేదిక ప్రకారం, సుమారు 65 శాతం మంది యూజర్లు వెబ్‌సైట్‌ను యాక్సెస్ చేయలేకపోతున్నారు. మరో 33 శాతం మంది సర్వర్ కనెక్షన్ సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. ఈ సమస్య ప్రధానంగా భారత్‌లోని వినియోగదారులపై ప్రభావం చూపుతున్నప్పటికీ, ఇతర దేశాల నుంచి కూడా కొందరు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ అంతరాయంపై గూగుల్ స్పందించింది. తమ సర్వీసుల్లో సమస్య తలెత్తినట్లు కంపెనీ స్టేటస్ డ్యాష్‌బోర్డులో నిర్ధారించింది. అయితే, సమస్యకు గల కారణాలు, పరిష్కారానికి పట్టే సమయంపై స్పష్టత ఇవ్వలేదు. ఈ సాంకేతిక లోపం కారణంగా ఆఫీస్ మీటింగ్‌లు, ఆన్‌లైన్ క్లాసులు, ఇతర వర్చువల్ కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం కలిగింది. దీంతో చాలామంది ఇతర ప్రత్యామ్నాయ ప్లాట్‌ఫామ్‌ల వైపు చూడాల్సి వచ్చింది.

# రిజర్వేషన్లలో వివక్ష


- 10 వార్డులు 482 దళితుల ఓట్లు
- ఒక్క వార్డులో కూడా రిజర్వేషన్ దక్కని వైనం
- జనాభా లెక్కలో అధికారుల లెక్కే వేరు
- హైకోర్టును ఆశ్రయించిన రంగారెడ్డి జిల్లా కౌకుంట్ల దళితులు




STATEMENT SHOWING THE RESERVATION FOR SARPANCHES AND WARD MEMBERS FOR 2nd ORDINARY ELECTIONS TO GRAM PANCHAYATS-2025 OF CHEVELLA MANDAL OF RANGA REDDY DISTRICT



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఏర్పడిన నాటినుండి ఆ గ్రామానికి ఇప్పటి వరకు 11సార్లు ఎన్నికలు జరిగాయి. 6సార్లు జనరల్ 5సార్లు బీసీ రిజర్వేషన్లు ఖరారయ్యాయి తప్ప ఒక్కసారి కూడా ఎస్సీ రిజర్వేషన్ ఖరారు కాలేదు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో మొత్తం 10 వార్డులు ఉన్నాయి. గ్రామంలో 2060 మంది ఓటర్లు ఉన్నారు. దీంట్లో 482 మంది ఎస్సీ కమ్యూనిటీకి చెందిన వారే ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. అధికారులు కేవలం ఆ గ్రామంలో 36 మంది మాత్రమే దళితులు ఉన్నారని, జనాభా లెక్కలు తప్పుగా చూపించారు. దీంతో గ్రామస్తులు అప్పట్లోనే ఆర్డీవో కు జిల్లా కలెక్టర్ పంచాయతీరాజ్ శాఖలో కూడా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా గ్రామంలో 3 వార్డులలో దళితులే 75%శాతానికి పైగా ఓటర్లు ఉన్నారు. అయినా ఒక్క వార్డు కూడా దళితులకు రిజర్వేషన్ ప్రకారం ఖరారు కాలేదు. 10 వార్డులలో ఐదు జనరల్, ఐదు బీసీలకు మాత్రమే రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. ఇదిలా ఉంటే ఈ మధ్యకాలంలో విడుదల చేసిన మొదటి విడతలో 10 వార్డులలో ఒక్క వార్డు కూడా దళితులకు రిజర్వేషన్ ఖరారు కాలేదు. దీంతో కావాలనే


Through Emai
Government of India, Ministry of Home Affairs
Directorate of Census Operations, Telangana
1st Floor, Kendriya Sadan, Sultan Bazaar, Koti, Hyderabad – 500 095
Telangana State
(Website : www.censusindia.gov.in)
No. 8325/TS-DATA/2016-Vol-II
Date: 20-07-2022
To
Prashanthkumar99@gmail.com

Sub: Supply of 2001-2011 Census Schuduled Caste population of Kowkuntla Revenue village Chevella Mandal RR Dist – reg.

Ref: Your Lr. No. Nil, dated.:04-07-2022,

Sir,

With reference to above cited subject, it is to inform that :

1). Census taking is a respondent based operation. In this exercise the Respondent (i.e. every person to whom question are asked) bound to answer Census Questions to the best of his/her knowledge or belief, as per the provision mentioned under the sub section -8(1) of the Census Act, 1948. During population enumeration of 2011 Census, in the case of the question on Scheduled Caste (SC) and Scheduled Tribe (ST), in the Household (HH)

ఉద్దేశపూర్వకంగా తమ గ్రామంలో ఉన్న దళితులపై వివక్ష చూపుతున్నారనే అనుమానంతో కౌకుంట్ల గ్రామానికి చెందిన కొందరు దళితులు హైకోర్టును ఆశ్రయించారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని, లేదంటే ఎన్నికలు నిలిపివేయాలని హైకోర్టులో పిటిషన్ వేశారు.

# సంక్రాంతి వరకు ఆప్కో వస్త్రాలపై రిబేటు

**అమరావతి, నవండర్26 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రజలకు ఆప్కో షోరూమ్‌లలో చేనేత వస్త్రాలపై 40 శాతం రాయితీని సంక్రాంతి వరకూ అమలు చేయనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ప్రవేశపెట్టిన రాయితీని ప్రజలు, వినియోగదారుల నుంచి వచ్చిన స్పందన నేపథ్యంలో సక్రాంతి వరకూ కొనసాగించాలని నిర్ణయించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయితీ అమ్మకాలతో ప్రజలకు చేనేత వస్త్రాలను మరింత చేరువ చేసే అవకాశం కలుగుతుందన్నారు. అలాగే వస్త్రాల విక్రయాల పెరుగుదలతో నేతన్నలకు ఆర్థిక భరోసాతో కూడిన ఉపాధి లభిస్తుందని తెలిపారు. రాయితీ ఇవ్వడానికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కో షోరూమ్‌లలో రోజుకు సరాసరి రూ.3 లక్షలు చొప్పున విక్రయాలు జరిగేవని, రాయితీ ఇవ్వడంతో ప్రస్తుతం రూ.9 లక్షలకు పెరిగినట్లు మంత్రి పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో బోర్డు తిప్పేసిన ఐటీ సంస్థ

- ఒక్కో విద్యార్థి నుంచి రూ.3 లక్షలు వసూలు
- సుమారు 400 మంది నుంచి డబ్బులు వసూలు

**హైదరాబాద్, నవంబర్25 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో మరో ఐటీ సంస్థ బోర్డు తిప్పేసింది. ఉద్యోగాల పేరిట ఒక్కో విద్యార్థి, నిరుద్యోగి నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసి కంపెనీ డైరెక్టర్ పరారైనట్లు తెలుస్తోంది. మాదాపూర్‌లోని ఎన్ఎస్ఎన్ ఇన్ఫోటెక్ కంపెనీ సుమారు 400 మంది నుంచి డబ్బులు వసూలు చేసింది.రూ.3 లక్షలు చెల్లిస్తే శిక్షణ ఇచ్చి, ఉద్యోగం ఇస్తామని ఈ సంస్థ నమ్మబలికింది. దీంతో వందలాది మంది డబ్బులు చెల్లించారు. విద్యార్థులను మోసం చేసి వసూలు చేసిన డబ్బులతో కంపెనీ డైరెక్టర్ స్వామినాయుడు పరారయ్యాడు. దీంతో బాధితులు సైబరాబాద్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశారు.

# ప్రయోగాత్మకంగా టెక్నాలజీతో వైల్డ్ సెఫ్టీ

- దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ అటవీ శాఖ చర్యలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో పులుల సంరక్షణలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ నాయకత్వంలో హైదరాబాద్ అరణ్యభవన్‌లో స్టేట్-లెవల్ టైగర్ ప్రొటెక్షన్ అండ్ మానిటరింగ్ సెల్‌ను ప్రారంభించింది. సాధారణంగా వన్యప్రాణి విభాగాలు తమ తమ పరిధుల్లోనే పని చేస్తుంటాయి. కానీ, తెలంగాణ నూతన టైగర్ సెల్ ఇందుకు వినూత్నంగా ఉన్నది. ఈ విభాగం నిత్యం పులులు, చిరుత పులుల కదలికల పర్యవేక్షించనున్నది. దాంతోపాటు, పులులు... పులుల మధ్య ఘర్షణ ప్రాంతాలు... మనుషులు, పులుల మధ్య సంఘర్షణ ప్రాంతాలను గుర్తించి నిత్యం నిఘా ఉంచుతుంది. దాంతోపాటు, ఆ ప్రాంతాన్ని అనునిత్యం అంచనా వేస్తూ మ్యాపింగ్ చేసి పెట్టనుంది. దాంతోపాటు, అడవి ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ట్రాకింగ్ చేయనుంది. యాంటీ-పోచింగ్, రెస్క్యూ బృందాల తక్షణ పాట్రోలింగ్ చేసేందుకు ఉపయోగపడుతుంది. ఇవన్నీ సమగ్రంగా ఒకే చోట నిర్వహించే వ్యవస్థ ఈ టెగల్ సెల్ కింద చేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కేంద్రీకృత వ్యవస్థ భారతదేశంలో చాలా అరుదుగా ఉంది.

రాష్ట్రంలోని కవాల్, ఏటూరునాగారం, కిన్నెరసాని, నిర్మల్, కామారెడ్డి, జగిత్యాల జిల్లాల్లోని పులుల కదలికలు సెల్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తారు. వీటితో పాటు మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్-ఉత్తర తెలంగాణ అడవులను ఆంధ్రప్రదేశ్ అటవీ ప్రాంతాలతో కలిపే ఈ మార్గం దేశవ్యాప్తంగా ముఖ్యంగా టైగర్ కారిడార్‌గా గుర్తించి ఆ ప్రాంతాల్లో నిఘా ఉంచనున్నారు. అయితే, పొరుగు రాష్ట్రాల్లో సరైన పర్యవేక్షణ లేకపోయినా, తెలంగాణ మాత్రం నిరంతర మానిటరింగ్ చైన్‌ను ఏర్పరచి ముందడుగు వేయడం సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అవుతున్నది. పులుల సంచారం తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్విక్ రియాక్షన్ టీమ్స్ పై ఈ సెల్‌కు ప్రత్యక్ష నియంత్రణ ఉండనుంది.

టైగర్లపై రేడియో కాలర్ అమర్చే కార్యక్రమాన్ని కూడా తెలంగాణ ప్రారంభించేందుకు సిద్ధమైందని అటవీ అధికారులు చెబుతున్నారు. కర్ణాటక, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు ఈ విధానాన్ని ఎక్కువగా వాడుతుండగా, ఎన్‌టీసీఏ అనుమతి లభించిన వెంటనే తెలంగాణ కూడా ఈ జాబితాలో చేరనుంది. ఈ డేటా మొత్తం టైగర్ సెల్ నుంచే సేకరించి విశ్లేషించబడుతుంది. దాంతోపాటు, జాతీయ టైగర్ లెక్కల్లో తెలంగాణకు అదనపు ప్రయోజనం లభించనుంది.దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్‌లో తెలంగాణకు నూతన సెల్ పెద్దగా సహకరించనుంది. కేవలం రిజర్వుల్లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పులుల కదలిక పెరుగుతున్న వేళ, ఈ సెల్ కీలకంగా మారనుంది.

# ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో బురఖా వివాదం

- నిబంధనలపై మహిళా సెనేటర్ వినూత్న నిరసన



**న్యూఢిల్లీ, నవంబర్ 26 (జనంసాక్షి) :** ఆస్ట్రేలియా పార్లమెంట్ లో బురఖాపై వివాదం నెలకొంది. దేశంలో బురఖాను నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఓ మహిళా సెనేటర్ బురఖా ధరించి పార్లమెంట్ కు హాజరుకావడంపై తోటి సభ్యులు అభ్యంతరం తెలిపారు. బురఖాను నిషేధించాలన్న ఆమె ప్రతిపాదనను తిరస్కరించారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన స్పీకర్.. సదరు సెనేటర్ ను మూడు నెలల పాటు సస్పెండ్ చేశారు.ఆస్ట్రేలియాలో బురఖాను, ముఖాన్ని పూర్తిగా కప్పి ఉంచే వస్త్రాలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ సెనేటర్ పౌలిన్ హాన్ సన్ (71) పార్లమెంట్ లో ఓ బిల్లును ప్రవేశ పెట్టారు. ఈ బిల్లుపై చర్చకు కూడా తోటి సెనేటర్లు అంగీకరించకపోవడంపై మండిపడ్డ హాన్ సన్.. దీనికి నిరసనగా తల నుంచి పాదం వరకు కప్పి ఉంచే బురఖా ధరించి పార్లమెంట్ కు వచ్చారు. అయితే, బురఖాలో సమావేశాలకు హాజరుకావడం పార్లమెంట్ తో పాటు తోటి సెనేటర్లను అవమానించడమేనని, హాన్ సన్ తీరు తీవ్ర అభ్యంతరకరంగా ఉందని మిగతా సెనేటర్లు విమర్శించారు. హాన్ సన్ తీరుపై స్పీకర్ కూడా మండిపడ్డారు. వెంటనే సభకు క్షమాపణ చెప్పాలని ఆదేశించారు. దీనికి హాన్ సన్ ససేమిరా అనడంతో స్పీకర్ ఆమెను ఫిబ్రవరి వరకూ సస్పెండ్ చేశారు.

# 20 నెలల క్రితమే ముగిసిన కాలపరిమితి

**హైదరాబాద్, నవంబర్26 (జనంసాక్షి) :** 2024 ఫిబ్రవరి ఒకటితో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. రాజ్యాంగంలోని 243(3)(ఏ) ఆర్టికల్ ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలను ఐదేళ్ల పదవీ కాలం ముగిసేలోపే నిర్వహించాల్సి ఉంటుంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 14(2) ప్రకారం.. పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగియడానికి మూడు నెలల్లోగా ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నది. పాలకవర్గాల గడువు పూర్తి కావడంతో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల సంఘంగతేడాది డిసెంబర్ 14న రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. కానీ, ఆచరణలో మాత్రం ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించింది. బీసీ రిజర్వేషన్లు, తదితర అంశాలను సాకుగా చూపి.. పంచాయతీ ఎన్నికల నిర్వహణను ఆలస్యం చేస్తూ వచ్చింది. అయితే బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యం కాదని భావించి, తాజాగా పంచాయతీ ఎన్నిలకు పచ్చజెండా ఊపడంతో దాదాపు 20 నెలల తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయి.

# రక్షణ సామర్థ్యాన్ని బలోపేతానికి తైవాన్ చర్యలు

- 40 బిలియన్ డాలర్ల భారీ బడ్జెట్ కేటాయింపు

**న్యూఢిల్లీ, నవంబర్26 (జనంసాక్షి) :** చైనా నుంచి ముప్పు తీవ్రమవుతున్న వేళ, తైవాన్ తన రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు సంచలన నిర్ణయం తీసుకుంది. రాబోయే ఎనిమిదేళ్లలో రక్షణ రంగం కోసం 40 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 3.3 లక్షల కోట్లు) భారీ బడ్జెట్‌ను కేటాయిస్తున్నట్లు అధ్యక్షుడు విలియం లాయ్ చింగ్-తె ప్రకటించారు. టెక్నాలజీ, ఆవిష్కరణలతో 'అభేద్యమైన తైవాన్'ను నిర్మించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. చైనాతో విభేదాల కారణంగా గత దశాబ్ద కాలంగా డిఫెన్స్ రంగంపై తైవాన్ భారీగా ఖర్చు చేస్తోంది. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి నేపథ్యంలో గత కొన్నేళ్లుగా తైవాన్ తన రక్షణ వ్యయాన్ని పెంచుతోంది. ఈ క్రమంలో, 2027 నాటికి చైనాను ఎదుర్కొనేందుకు తమ సైన్యం అత్యున్నత స్థాయి యుద్ధ సన్నద్ధతను సాధిస్తుందని లాయ్ బుధవారం తెలిపారు. అమెరికా అధికారులు కూడా చైనా సైనిక చర్యకు ఇదే సమయాన్ని అంచనా వేస్తున్నట్లు గతంలో పేర్కొనడం గమనార్హం. "ప్రజాస్వామ్య తైవాన్‌ను శాశ్వతంగా కాపాడగల రక్షణ సామర్థ్యాలను నెలకొల్పడమే మా అంతిమ లక్ష్యం" అని లాయ్ వాషింగ్టన్ పోస్ట్ పత్రికలో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. ఈ అదనపు నిధులను అమెరికా నుంచి కొత్త ఆయుధాల కొనుగోలు, అసమాన యుద్ధ తంత్రాలను మెరుగుపరచుకోవడం, 'టి-డోమ్' అనే బహుళ-స్థాయి గగనతల రక్షణ వ్యవస్థ అభివృద్ధికి వెచ్చించనున్నట్లు ఆయన వివరించారు. తైవాన్ నిర్ణయాన్ని ఆ దేశంలోని అమెరికా రాయబారి రేమండ్ గ్రీన్ స్వాగతించారు. మరోవైపు, 'బాహ్య శక్తుల' ఒత్తిడితోనే తైవాన్ ఈ నిర్ణయాలు తీసుకుంటోందని చైనా ఆరోపించింది. అయితే, ఈ బడ్జెట్ ప్రతిపాదనకు పార్లమెంటులో ఆమోదం లభించడం అంత సులభం కాదు. చైనాతో సత్సంబంధాలను కోరుకునే ప్రధాన ప్రతిపక్షమైన క్యుమింటాంగ్ పార్టీ, బడ్జెట్‌ను వ్యతిరేకిస్తోంది.

# రాంచంద్రాపూర్, కుర్మపల్లి గ్రామాల్లో ఎన్నికలు నిలిపివేత

- కోర్టు ఉత్తర్వుల మేరకు ఎన్నికల సంఘం ఆదేశాలు
- మిగతా గ్రామాల్లో మొదలైన సర్పంచ్ హడావిడి

**కరీంనగర్, నవంబర్26 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాంచంద్రాపూర్, కుర్మపల్లి గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు నిలిపివేస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. రాంచంద్రాపూర్‌కు అనుబంధంగా ఉన్న కుర్మపల్లి కొత్త పంచాయతీగా ఏర్పాటు కాగా, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని రాంచంద్రాపూర్ గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎన్నికల సంఘం ఈ రెండు గ్రామాల్లో ఎన్నికలు నిలిపివేసింది. జిల్లాల వారీగా మూడు విడుతల్లో జరిగే మండలాలు కరీంనగర్ జిల్లాలో మొదటి విడుత గంగాధర, రామడుగు, చొప్పదండి, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ ఉన్నాయి. రెండో విడుతలో చిగురుమామిడి, తిమ్మాపూర్, గన్నేరువరం, మానకొండూర్, శంకరపట్నం,మూడో విడుత వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట, హుస్నాబాద్, సైదాపూర్(వీ) ఉన్నాయి. ఇక జగిత్యాల జిల్లాలో మొదటి విడుత మేడిపల్లి, భీమారం, కథలాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఉన్నాయి. రెండో విడుతలో జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్, సారంగాపూర్, రాయికల్, బీర్పూర్, మల్యాల, కొడిమ్యాల ఉన్నాయి. మూడో విడుతలో ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి, పెగడపల్లి ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో మొదటి విడుత మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూర్ ఉన్నాయి. రెండో విడుతలో పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం, జూలపల్లి, మూడో విడుతలో సుల్తానాబాద్, ఎలిగేడు, పెద్దపల్లి, ఓదెల ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి విడతలో రుద్రంగి, వేములవాడ రూరల్, వేములవాడ, కోనరావుపేట,చందుర్తి, రెండో విడతలో బోయినపల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, మూడో విడుత గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో అభ్యర్థుల సందడి మొదలయ్యింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370